www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 34 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు జ్యేష్ఠ బహుళ పంచమి
16-22 జూన్ 2025
వెల : ₹20/-



# సూర్య నమస్కారం

## జూన్ 21, అంతర్జాతీయ యోగా దినోత్సవం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# వైభవంగా రామ్ దర్బార్‌లో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ

అయోధ్య రామమందిరం మొదటి అంతస్తులో రామ్ దర్బార్‌లో విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత భక్తి, శ్రద్ధలతో, వైభవోపేతంగా జరిగింది. వేద మంత్రోచ్ఛారణ, హవనం, తదితర కార్యక్రమాల మధ్య ప్రతిమలకు ప్రాణప్రతిష్ఠ జరిగింది. పవిత్రమైన ఈ కార్యక్రమంలో దేవాలయ సముదాయంలో రాజారామ్, ఇతర దేవతలను ప్రతిష్ఠించారు. గతేడాది జనవరిలో జరిగిన మొదటి ప్రాణప్రతిష్ఠ తర్వాత ఇది రెండవ కార్యక్రమం కావడం విశేషం. ఇందులో భాగంగా రామ్ దర్బార్ విగ్రహాలకు (శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడు), ఆలయ సముదాయంలోని మరో ఏడు ఆలయాల్లో విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ జరిగింది. ఉత్తరప్రదేశ్‌లోని చందౌలి జిల్లాకు చెందిన ప్రసిద్ధ పురోహితులు పండిట్ జైప్రకాష్ నేతృత్వంలో 101 మంది వేదపండితులు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో జూన్ 3 నుంచి జూన్ 5వరకు జరిగిన విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరయ్యారు. దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.




Yoga for Harmony & Peace
రాష్ట్ర ప్రజలకు,బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు
అంతర్జాతీయ యోగా దినోత్సవ
(21 జూన్)
శుభాకాంక్షలు
అర్వింద్ ధర్మపురి
( పార్లమెంట్ సభ్యులు, నిజామాబాద్)

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | **9959991304** |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

భరతమాత అనే భావన రాజకీయాలకు అతీతమైనది. సైద్ధాంతిక వివాదాలకు కేంద్ర బిందువు కాకూడనిది. ఇది గుర్తించమని కేరళ గవర్నర్ విశ్వనాథ్ రాజేంద్ర అర్లేకర్ జూన్ 8న పిలుపునిచ్చారు. మనమంతా ఒకే తల్లి బిడ్డలమని ప్రతిజ్ఞ చేయాలని కూడా కోరారు. ఆ మాత భరతమాత. ఇలాంటి పిలుపు ఎందుకు ఇవ్వవలసి వచ్చింది? ఒక అవాంఛనీయ వాతావరణంలో గవర్నర్ ఆ పిలుపునిచ్చారు. కారణం వామపక్షాలు. ప్రధాని నరేంద్ర మోదీ మన్ కి బాత్ కార్యక్రమం ఆధారంగా నిర్వహించిన క్విజ్ విజేతలకు బహుమతి ప్రదానం, పర్యావరణదినం కోసం రాజ్‌భవన్‌లో జూన్ 5న కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ ఉత్సవంలో భరతమాత చిత్రపటం పెట్టారు. దీనికే వామపక్షాలు రెండూ నీచమైన రీతిలో గందరగోళం లేవదీయాలని ప్రయత్నిస్తున్నాయి. కేవలం భరతమాత పటం పెట్టినందుకు జరుగుతున్న ఆ అల్లరి జాతిని ఆలోచింపచేస్తుంది.

జూన్ 5 నాటి రాజ్‌భవన్ కార్యక్రమానికి కేరళ వ్యవసాయ శాఖ మంత్రి, సీపీఐ నేత పి. ప్రసాద్ హాజరు కావలసి ఉంది. కానీ ఆయన బహిష్కరించారు. కారణం– ఆ కార్యక్రమంలో భరతమాత పటం పెట్టడమే. భరతమాత పటం ఆర్ఎస్ఎస్ ఉపయోగిస్తుంది కాబట్టి బహిష్కరిస్తున్నట్టు బాహాటంగానే ప్రకటించాడు ప్రసాద్. ఇందుకు ప్రతిగా వేరేచోట జాతీయ పతాకం ఎగురవేసి, మొక్కలు నాటాడు. గవర్నర్ నివాసంలో ఉపయోగించిన పటం రివాజుగా ఉపయోగించేది కాదనీ, అందుకే తొలగించమని కోరామనీ, అందుకు గవర్నర్ నిరాకరించినందువల్లనే కార్యక్రమాన్ని బహిష్కరించామనీ కూడా ప్రసాద్ దాచకుండానే చెప్పాడు. భరతమాతకు ప్రతీక జాతీయ పతాకం కాబట్టి పర్యావరణ దినోత్సవానికి రాష్ట్ర మంతటా జాతీయ జెండానే ఎగురవేస్తారట. భరతమాత అనే కొత్త సంప్రదాయాన్ని రుద్దడానికి చూడడం రాజ్యాంగ విరుద్ధమని, జాతి వ్యతిరేకమని కూడా సీపీఐ నాయకులు నోరు పారేసుకున్నారు. గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌కు రాజ్యాంగం ముఖ్యమో, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు ముఖ్యమో చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం తాఖీదు లాంటిది ఇచ్చాడు. వీరి చరిత్ర పరిజ్ఞానం చూస్తే రోతగా లేదా! గవర్నర్ కార్యక్రమానికి

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు జ్యేష్ఠ బహుళ పంచమి**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం

**సూర్య నమస్కారం** 6లో



చర్చ

**శర్మిష్టతో మేఘకు పోలికా?** 20లో



కథ

**బల్లకట్టు రాములు**

– గోవర్ధనం శ్రీనివాసమూర్తి 26లో

# జాగృతి

## సంపాదకీయం

పోటీగా సచివాలయంలోని దర్బార్‌హాలులో పోటీ కార్యక్రమం నిర్వహించి అమర్యాదకు నిర్వచనం చెప్పారు.

భరతమాత అనే ప్రతీకకు రాజ్యాంగబద్ధత లేదు కాబట్టి, అందుకు సంబంధించి కేంద్రం కూడా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు కాబట్టి వామపక్ష కూటమి ప్రభుత్వం గవర్నర్‌ చర్యను ఆమోదించబోదని, అదే ప్రభుత్వ విధానమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్‌ మాట్లాడాడు. మత సిద్ధాంతాల ప్రచార కేంద్రంగా రాజ్‌భవన్‌ మారకూడదంటూ ఒక ఉచిత సలహా పడేశాడు. భారతమాత భావనకు తాము వ్యతిరేకం కాకపోయినా, గవర్నర్‌ పెట్టిన చిత్రపటం ఒక సిద్ధాంతానికి

# భరతమాత చిత్రపటం

సంబంధించినది కాబట్టి అంగీకరించలేమంటున్నాడు గోవిందన్‌.

'భరతమాత ఎవరో కేరళ గవర్నర్‌ స్పష్టం చేయాలి' అంటూ తాజాగా సీపీఐ జాతీయ కార్యదర్శి డి. రాజా రంగంలోకి దిగిపోయారు. దేశభక్తి అంటే ఏమిటో ఆర్‌ఎస్‌ఎస్‌ దగ్గర నుంచి తాము నేర్చుకోనక్కరలేదు అంటూ వాచాలత ప్రదర్శించారు. వాళ్లు అనగా, సీపీఐ వారి భరతమాత వ్యవసాయ క్షేత్రాలలో శ్రమిస్తూ ఉంటుందట. జల్‌, జంగిల్‌, జమీన్‌కు రక్షణ అట. పాఠశాలల్లో, కర్మాగారాలలో పనిచేస్తుందట. సైన్యం, భద్రతాదళాలకు సేవలందిస్తుందట. మరి మీ భరతమాత ఎవరు అంటున్నాడు రాజా. అసలు ఆర్‌ఎస్‌ఎస్‌ స్వాతంత్ర్యోద్యమంలోనే లేదంటూ పాచి పాటే పాడాడు. 1942లో చేసిన ద్రోహాన్ని కప్పి పుచ్చుకోవడానికి ఇలా నోరేసుకు పడిపోవడం వామపక్షవాదులకి మామూలే. అయినా ఇంత హఠాత్తుగా ఎర్రదండుకు భరతమాత ఎందుకు గుర్తుకొచ్చినట్టు?

భరతమాత చిత్రపటం రాష్ట్రంలో వివాదానికి దారి తీయడం విచారకరమని గవర్నర్‌ అనడం సబబే. ఆ రెండు పక్షాలకీ ఏ విషయం మీద వివాదం లేవదీస్తున్నామో కూడా స్పృహ లేదు. మనం మన కన్నతల్లిని వివాదాలలోకి లాగుతామా అని గవర్నర్‌ ప్రశ్నించడం అందుకే. కేరళ వామపక్ష రాజకీయాలంటే జుగుప్సకు చిరునామా. హిందూ వ్యతిరేకత మాటున, భారత వ్యతిరేకత అందులో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. భరతమాత చిత్రపటం మీద రగడ వెనుక ఉన్నది అదే. హిందూత్వం మీద ఈ రీతిలో ద్వేషం కక్కుతున్నారు. చాలా సందర్భాలలో కాంగ్రెస్‌ కేరళ శాఖ వీటితో పోటీ పడుతూ ఉంటుంది. కేరళ అంటే ముస్లిం మతోన్మాదానికి ఆయువు పట్టు. కాబట్టి బుజ్జగింపు రాజకీయాలూ ఉంటాయి.

ఆర్‌ఎస్‌ఎస్‌ భావనలోని భరతమాత సర్వేజనా సుఖినోభవంతు అన్న సమున్నత సిద్ధాంతంలో ఉంది. ఒక్క కుక్క అయినా ఆకలితో మిగిలి పోకుండా తృప్తిగా జీవించాలన్న వివేకానంద భావనలో భరతమాతను దర్శిస్తాం. ఒక వర్గం మరో వర్గం సంఘర్షించుకోమని చెప్పకుండా, అంతా సామరస్యంగా ఉండాలన్న వసుధైవ కుటుంబకం చింతనలో భరతమాతను దర్శించుకోగలం. అంతేతప్ప విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న సిద్ధాంతాలలో, ఆ సిద్ధాంతాల పడికట్టు పదాలలో మాత్రం భరతమాత కనిపించదు. మా భరతమాతది మట్టివాసన. వక్రభాష్యాలకీ, వాగాడంబరాలకీ అతీతమైనది ఆ మహా మాతృ మూర్తి. భరతమాత అనే భావనను గౌరవించాలన్న చట్టం లేదు. అందుకే గౌరవించడం లేదని ఈ మాజీ సోవియెట్‌ రష్యా భక్తులు, వర్తమాన చైనా భక్తులు లా పాయింట్లు లాగుతున్నారు. ఇది చాలు వీళ్ల మెదళ్లు ఎంత కుళ్లిపోయాయో చెప్పడానికి! అమ్మను గౌరవించాలనీ, మాతృభూమికి ప్రతీక అయిన రూపాన్ని మన్నించాలని చెప్పడానికీ చట్టాలు కావాలా? ★

16 జూన్‌ 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్‌




కథ

**ఆనాటి ప్రేమకథ**

- శ్రీమతి భారతీ కృష్ణ

ధరహాసం





| | | |
|---|---|---|
| ఫోన్‌ ట్యాపింగ్‌ హీట్‌ చల్లబడినట్లేనా? (తెలంగాణ) | - | 14 |
| నిరుద్యోగ సుడిలో సాఫ్ట్‌వేర్‌ యువత (ఆంధ్రప్రదేశ్‌) | - | 16 |
| 'సమితి' ధర్మసత్రానికి తాళం (వివాదం) | - | 18 |
| కష్టాల కడలిలో ప్రైవేట్‌ బోధన సిబ్బంది (గురు ఘోష) | - | 22 |
| 'నీళ్ల బాంబు'కు బెదిరిన అణ్వాయుధాలు (అంతర్జాతీయం) | - | 24 |
| దక్షతతో జత (మహిళ) | - | 28 |
| అణువణువూ పరమాత్మ తత్త్వసారమే! (గళమెత్తిన గతం) | - | 30 |
| పంచాయతీలకు శుష్కప్రియాలు, శూన్యహస్తాలు! (సం'గ్రామం') | - | 32 |
| విశ్వ జనానికి 'యోగా'మృతం (క్రీడ) | - | 43 |
| ఎవరికి వారే యమునాతీరే! (సినిమా) | - | 50 |

# సూర్య

జూన్ 21, 2025న 11వసారి అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవడానికి ప్రపంచం సిద్ధమవుతున్నది. నరేంద్ర మోదీ భారత ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత జరిగిన కృషి, పరిణామాల ఫలితంగా ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరపడానికి ఐక్య రాజ్యసమితి జనరల్ అసెంబ్లీ (డిసెంబర్ 11,2014) నిర్ణయించింది. ఇందుకు అమెరికా సహా 177 దేశాల మద్దతు లభించింది. ఆ తరువాత నుంచి యోగ, సూర్య నమస్కారాల గురించి ఒక్కసారిగా ప్రపంచం చర్చించడం ఆరంభించింది. జూన్ 21, 2015 నుంచి యోగా దినోత్సవం ప్రపంచమంతటా అమలులోకి వచ్చింది. భారతీయ సనాతన ధర్మం లేదా జీవనం ప్రపంచానికి అందించిన అపురూప కానుక యోగ/సూర్యనమస్కారాలు. ప్రపంచాన్ని ఆధ్యాత్మిక మార్గంలో, ఆరోగ్యకర వాతావరణంలో కలిపేందుకు ఆధునిక యుగంలో ఇది నాందీవాచకం కాగలదని ఎక్కువమంది నమ్ముతున్నారు. యోగ, సూర్య నమస్కారాలు అవిభాజ్యాలు. సూర్య నమస్కారాలు లేని యోగాను ఊహించలేం. సూర్య నమస్కారాలకు ఉన్న శాస్త్రీయత అద్భుతం. విశేషమైన చరిత్ర కూడా ఉంది. ఈ యోగా దినోత్సవం సందర్భంగా సూర్యనమస్కారాల ఘనత ఎంతటిదో చెప్పడానికి ఇది మరొక ప్రయత్నం.



# నమస్కారం

సూర్యారాధన మానవ నాగరికత పురుడు పోసుకున్న క్షణాల నుంచి కనిపిస్తూనే ఉంది. కానీ భారతదేశంలో సూర్యారాధనకు విశిష్ట స్థానం ఉంది. అందులో శాస్త్ర విజ్ఞానం, ఆధ్యాత్మిక దృష్టి కలసి ఉన్నాయి. ప్రతి వేకువలోను సూర్య భగవానుడికి ప్రణమిల్లే ఒక సంప్రదాయం కొన్ని శతాబ్దాల పాటు భారతభూమి మీద విలసిల్లింది. ఆర్ష వాఙ్మయకర్తలు సూర్యుడి గురించి ఒక పరవశంతో ప్రస్తావించారు. పురాతన సంస్కృతీ సంప్రదాయాలు కలిగిన, నాగరికత కలిగిన గ్రీస్, ఈజిప్ట్, స్కాండినేవియా వంటి దేశాలలోను సూర్యుడి ఆరాధన ఉంది. ఇంకా చెప్పాలంటే దేశీయమైన సాంస్కృతిక సంపద గణనీయంగా ఉన్న అన్ని దేశాలు తమదైన పంథాలో సూర్యుడిని ఆరాధిస్తూనే ఉన్నాయి. రుగ్వేదంలో ఒక శ్లోకంలో చక్కని భావం ఉంది. తన సప్తాశ్వాలను రథానికి పూన్చి సూర్యుడు లోకం నిండా వెలుగులు నింపేందుకు ఎంత సహజంగా ఉదయిస్తాడో, సమున్నత మానవులు త్యాగాలు చేయడానికి అంతే సహజంగా ముందుకు వస్తారు అంటుంది ఆ శ్లోకం. శరీరాన్నీ, మనసును లేదా బుద్ధినీ ఆధ్యాత్మిక స్పర్శ కలిగిన విశిష్ట వ్యాయామంతో ఏకం చేసే ప్రక్రియ సూర్యనమస్కారమని తొలి నుంచి హిందూ జీవనం ప్రకటిస్తూనే ఉంది. ఇందుకు ఉచ్ఛ్వాసనిశ్వాసాలను క్రమబద్ధం చేస్తారు. అదే యోగా. యోగాభ్యాసం, సూర్య నమస్కారాలు వేర్వేరు కాదు. సూర్య నమస్కారాలు లేని యోగాభ్యాసాన్ని ఊహించలేం కూడా. గురుశిష్య బంధం యోగాభ్యాసంలోనే ఉంటుందని కూడా మనవారు విశ్వసించారు. ఆంజనేయస్వామి మొదట సూర్యుని ద్వారా సూర్య నమస్కారాలు అభ్యసించాడని కథనం. అటు పురాణ ప్రశస్తి, ఇటు శాస్త్రీయ దృక్పథం సూర్యనమస్కారాలకు ఉచ్ఛ్వాస నిశ్వాసాలై ప్రాణం పోస్తున్నాయి.

**పురాణాలలో ప్రస్తావన**

సూర్య ఆరాధన ప్రస్తావన మన పురాణాలలో విశేషంగా కనిపిస్తుంది. ఆ విద్యను కేవలం ఆధ్యాత్మిక చింతనగా పరిచయం చేయలేదు. శాస్త్రీయ దృక్పథానికే పరిమితం చేయలేదు. సమున్నత ధ్యేయ సాధనకు మనిషిని సమాయత్తం చేసే చోదకశక్తిగా వాటిని దర్శింపచేశారు. వేదాలలో సరే, శ్రీమద్రామాయణం యుద్ధకాండలో సూర్యుడి ప్రస్తావన 'ఆదిత్య హృదయం' పేరుతో వస్తుంది. ఒకదశలో శ్రీరాముడంతటి వానికి కూడా రావణునితో యుద్ధం చేయలేనన్న శంక బయలుదేరింది. అప్పుడు దేవతలు అగస్త్య మహర్షిని వేడుకోవలసిందని సూచించారు. అగస్త్యుడు వచ్చి ఒక్కటే బోధించాడు. సూర్య భగవానుడిని ప్రార్థించమన్నాడు. ఫలితమే 'ఆదిత్య హృదయం' అనే మహోన్నత, మహిమాన్విత శ్లోకావళి. ఇది పఠించిన తరువాత రాముడు శక్తి మంతుడై రావణుడిని ఓడించాడు. రామాయణ శ్లోక





## మూలాలు

క్రీస్తుశకం 7వ శతాబ్దంలో హర్షవర్ధనుని ఆస్థానకవి మయూరుడు సూర్య శతకం రచించి కీర్తితో పాటు, చూపును కూడా సంపాదించుకున్నాడని చరిత్ర. భవభూతి రచించిన మాలతీ మాధవంలో సూత్రధారుడు పాపపరిహారానికి యశోలాభానికి సూర్యుడిని ఆరాధించినట్టు వర్ణిస్తాడు. ఇట్టి చారిత్రక ఘట్టములు అనేకం కనిపిస్తాయి. వేద వాఙ్మయంలో రుగ్వేదంలో మహా సారమంత్రాలు అరవై అయిదు రుక్కులు, యజుర్వేదంలోని 130 అరుణ మంత్రాలు అక్షరాలతో జనించిన గాయత్రి మంత్రం కూడా చీకటి నుంచి వెలుగులోకి తీసుకువెళ్లమనే ప్రార్థిస్తుంది. యజుర్వేదంలోని తైత్తరీయ ఆరణ్యకం లోను సూర్య నమస్కారాల ప్రస్తావన ఉంది. ఇన్ని వేల సంవత్సరాల నుంచి భారతదేశంలో చాలాచోట్ల, ప్రధానంగా దక్షిణ భారతంలో సూర్య నమస్కారాలు చేసే సంప్రదాయం అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది. కాల పరీక్షకు నిలిచిన ఆరోగ్యం సూత్రమిది.

**తాత్త్వికత**

సౌర కుటుంబానికి కేంద్ర బిందువు సూర్యుడు. సూర్య భగవానుడు అనంత శక్తికి ప్రతీక కూడా. రవి గాంచని ప్రదేశమే లేదు. సూర్యుడి వెలుగులో భూమి పరిఢవిల్లుతూ ఉంటుంది. సూర్యుడు లేకుంటే సృష్టి లేదు. భూమి మీద జీవకోటికి మనుగడ లేదు. జీవులు తీసుకునే ఆహారం, తాగే నీరు, పీల్చే గాలి సూర్యరశ్మితో సంబంధం ఉన్నవే. సర్వ జీవుల పట్ల సమాన దృష్టి కలిగినవాడు సూర్యుడు. సహస్ర కిరణుడికి జాతి, మత, ప్రాంత అంతరాలు లేవు. అలాంటి ప్రత్యక్షదైవం కేంద్రంగా భారతీయత రూపొందించుకున్న మహోన్నత వ్యాయామ ప్రక్రియ సూర్య నమస్కారాలు. కానీ సూర్య నమస్కారాలంటే కేవలం శారీరక వ్యాయామం అనుకుంటే ఘోర తప్పిదమే అవుతుంది. నిర్దుష్టమైన ప్రాణాయామం, ఆసనాల ద్వారా చేసే ఆధ్యాత్మిక సాధన. బుద్ధి లేదా మనసులో వచ్చే ఒడుదుడుకులపై దృష్టి సారించడం, అదుపులో ఉంచుకోవడానికి దోహదం చేయడం ఈ సాధన లక్ష్యం. సూర్యనమస్కారాలలో ఉండే అన్ని ఆసనాలు లేదా భంగిమలు ప్రకృతి పట్ల మానవుడికి ఉండవలసిన లోతైన ఆరాధనను, మమేకత్వాన్ని ప్రతిబింబించేవే. పర్యావరణంలోని జీవజాలంతో యోగ సాధకునికి ఉండే సామరస్యాన్ని ఆవిష్కరించేవే. శరీరం ఖలు ధర్మసాధనం అంటారు. మానవుడు ఏమి సాధించాలన్నా, తాను నివసిస్తున్న భూమి కోసం, ప్రకృతి కోసం, సాటి మనిషి కోసం ఏమి సృష్టించాలన్నా, సమాజానికి ఉపయోగ పడాలన్నా ఆరోగ్యం ప్రధానం. అంతేకాదు, దేహమే దేవాలయం అన్నారు. అది పవిత్రమైనదిగా భావించుకోవాలి. అంటే ఆరోగ్యంగా ఉంచుకోవడం ఎంత ప్రధానమో, పవిత్రంగా ఉంచుకోవడం కూడా అంతే ముఖ్యం. మనసునీ, శరీరాన్నీ బలంగా ఉంచుకోవడం మనిషి కనీస కర్తవ్యం. భౌతికంగా, మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండడానికి యోగాభ్యాసాన్ని అనునిత్యం ఆశ్రయిస్తే చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అసలు యోగాభ్యాసం ప్రధాన ప్రయోజనమే మెదడును చురుకుగా, శరీరాన్ని మృదువుగా ఉంచడం. దీనితోనే ఆరోగ్యవంతమైన జీవన శైలి సాధ్యమవుతుంది. ఒక విధంగా మనసుకీ, హృదయానికీ ఇదొక అనుసంధాన ప్రక్రియ. సూర్యనమస్కారాలు అటు శరీరాన్ని సరళంగా ఉంచడంలోను, ఇటు మనసును ఆధ్యాత్మిక సాధనకు సిద్ధంగా ఉంచేదిగాను చేస్తాయి. అందుకే సూర్యనమస్కారాలు శరీరాన్నీ, బుద్ధినీ కూడా అదుపులో ఉంచే గొప్ప ప్రక్రియగా పేరు పొందాయి. ఆ రెండింటిని సమన్వయం చేసే సాధనగా యోగ రుజువైంది. వివేక జ్ఞానాన్ని సాధించేందుకు యోగా



భావన్‌రావ్

## ఆత్మ విస్మృతికి

ఔంద్ సంస్థానాధీశుడు రాజా భావన్‌రావ్ శ్రీనివాసరావ్ పంత్ ప్రతినిధి (1868–1951) యోగాభ్యాసంలో సూర్య నమస్కారాలను పరాయి ప్రభుత్వం ఇచ్చిన పరిమిత స్వేచ్ఛలో సార్వభౌమాధికారాన్ని జ్ఞప్తికి తెచ్చే శారీరక, మానసిక వ్యాయామ ప్రక్రియగా భావించారనిపిస్తుంది. అదొక మానసిక టెక్నిక్ మాత్రమే కాదు, రాజకీయ వ్యూహంగా కూడా ఆయనకు కనిపించింది. సూర్య నమస్కారాలను సాధన చేయడం అంటే సార్వభౌమాధికారం దిశగా ఆలోచన చేయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే సూర్య నమస్కార యోగ ఔంద్ సంస్థానంలో రాజకీయ, విద్య, ఆర్థిక, సామాజిక రంగాల ప్రముఖులందరినీ ఆకర్షించింది. పుణెకి 150 కిలోమీటర్ల దూరంలోని ఔంద్ సంస్థానంలో గతంలో సార్వత్రిక ఓటు హక్కు, ఉదారవాద, ప్రజాస్వామిక రాజ్యాంగం, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయ వ్యవస్థ, బహిరంగ కారాగార విధానం అమలులో ఉండేవి. నేటి మహారాష్ట్రలోని సతారా, సాంగ్లీ జిల్లాలలోను, ఉత్తర కర్ణాటకలోని విజయపుర జిల్లాలో ఉన్న 72 గ్రామాలతో ఈ సంస్థానం ఏర్పడింది. ఇలాంటి సామాజిక నేపథ్యాన్ని సూర్య నమస్కారం అన్న పదం మరింత చైతన్యవంతం చేసిందని అర్థమవుతుంది. భావన్‌రావు సూర్య నమస్కారాలను సంస్థానంలోని పాఠశాలలు అన్నింటిలోను, న్యాయ వ్యవస్థలోను పరిపాలనా వ్యవస్థలోను తప్పనిసరిగా అంశంగా అమలు చేశారు.

సూర్యోపాసన ప్రాధాన్యం వివరించేవే. వేదాలలోనే కాకుండా, వ్యాస భగవానుడి భవిష్యత్ పురాణంలో బ్రహ్మపర్వంలో సప్తమీ కల్పంలో సూర్య మహాత్మ్య వర్ణన, సౌర ధర్మ వర్ణన వంటివి కనిపిస్తాయి. మార్కండేయ పురాణంలో సూర్యావిర్భావం సవితృ స్తుతి భాస్కరారాధన ఉన్నాయి. సూర్య నమస్కార యోగ వ్యాయామం చేసేవారికి అన్ని రోగాలు పోతాయన్నది జగమెరిగిన సత్యం. అశక్తులైన వారు సూర్య నమస్కారాలు చేసిన వారు ఇచ్చిన మంత్రజలం తీసుకున్నా శారీరక పీడలు తొలగుతాయని నమ్ముతారు.

(జాగృతి/ 13.1.1969)

బోధన ఉపకరిస్తుంది. ఇంకా లోతైన భావం కూడా ఇందులో చూసినవారు ఉన్నారు. యోగా అనేది వ్యక్తి ఆత్మకూ, విశ్వాత్మకూ మధ్య బంధాన్ని కలిపేదే అంటారు. యోగాలో భాగమై; ఆసనం, ప్రాణాయామం, మంత్రం, ధ్యానం అనే వాటి సమ్మేళనంతో ఉండే ఒక సంపూర్ణ ఆధ్యాత్మిక సాధన మార్గంగా సూర్య నమస్కారాలు ఖ్యాతి చెందాయి. కారణాలు లోతుగా తెలియక పోయినా, ఒక ఏడాదిలో నెలలు పన్నెండు, సూర్యనమస్కారాలలో వేసేవి పన్నెండు ఆసనాలే.

**ప్రకృతితో మమేకత్వం**

మానవుడికి తాను కూడా ఈ ప్రకృతిలో భాగం మాత్రమేనన్న స్పృహ కావాలి. ఈ ప్రకృతీ తానూ వేర్వేరు కాదన్న విశాల దృష్టి ఉండాలి. ఇంతటి మహోన్నత భావనలకు ప్రతీకలే సూర్య నమస్కారాలలోని భంగిమలు. ప్రణామాసన, హస్త ఉత్థానాసన, పాదహస్తాసన, అశ్వసంచ ఆసన, అష్టాంగ నమస్కారం, భుజంగాసనం, పర్వతాసన వంటివి సూర్య నమస్కారాలలో వేస్తారు. ప్రతి ఆవృత్తానికి ఒక మంత్రం పఠిస్తారు. బుద్ధి, శరీరాల మధ్య సమన్వయానికి గడచిన 3000 ఏళ్లుగా భారతీయులు సాగిస్తున్న సాధనలోని సారాంశం స్థూలంగా ఇదే. స్థిర చిత్తం, స్వీయ నియంత్రణ, ప్రశాంతత ఆ సాధన ధ్యేయం. జీవితం మీద యోగ సాధకుడి దృక్పథాన్ని మార్చే శక్తి దీనికి ఉంది. అన్నింటికీ మించి మానసిక ఒత్తిడి నివారణకు పరమౌషధం ఇదేనని రుజువైంది. ఒత్తిడి తగ్గడమే బుద్ధి, శరీరాల సమన్వయానికి బాగా తోడ్పడుతుంది. ఈ సాధననే ఇప్పుడు పాశ్చాత్య దేశాల వారు కాంప్లిమెంటరీ అల్టర్‌నేటివ్ మెడిసిన్ పేరుతో అభ్యసిస్తున్నారు.

ఇలియెట్ గోల్డ్‌బెర్గ్ అనే శాస్త్రవేత్త తన పుస్తకం 'మోడ్రన్ పాత్'లో ఒక అంశాన్ని ప్రతిపాదించాడు. ఈ అంశాన్ని ఇక్కడ ప్రస్తావించడం కేవలం చర్చ కోసమే. ఈ ప్రతిపాదనే అంతిమ సత్యం కాదు. సూర్య ఆరాధన మహారాష్ట్రలో ఆరంభమైందని ఆయన అంటాడు. ఎందుకంటే ఆధునిక భౌతిక సంస్కృతి అక్కడే ఊపిరి పోసుకుందని ఆయన వాదన. దీనికి కారణం అక్కడ స్మార్త పంచాయతన విధానం ఉండడమేనని కూడా చెప్పాడు. ఆ విధానంలో శివుడు, విష్ణువు, దేవి, గణేశ్‌లతో పాటు సూర్య ఆరాధనకు కూడా ప్రాముఖ్యం ఉంటుంది. ఇతడి వాదనకు బలం చేకూర్చే రీతిలో మరొక జనాభిప్రాయం కూడా అక్కడ ఉంది. సూర్య నమస్కారాలు హిందూ నిత్య జీవన శైలిలో ఉంటాయి. హిందూ ధర్మోద్ధరణకు కంకణం కట్టుకున్న శివాజీ మహారాజ్ కాలంలో సూర్య నమస్కారాలు పునర్ వైభవం సంతరించుకున్నాయని జనశ్రుతి. శివాజీ ఆధ్యాత్మిక గురువు సమర్థ రామదాస స్వామివారు అనేక అఖాడాలను (వ్యాయామ శాలలు) నిర్వహిస్తూ ఉండేవారు.



వాటిలో సూర్య నమస్కారాలు ప్రత్యేక అంశంగా సాధన చేసేవారు. సాంస్కృతిక మానవ పరిణామ శాస్త్రవేత్త జోసెఫ్ ఎస్ అల్టర్ ఒక సిద్ధాంతం ముందుకు తెచ్చాడు. భారతీయ మల్లయుద్ధంలోని కొన్ని కొన్ని 'పట్టు'ల మూలాలు సూర్య నమస్కారాలలో కనిపిస్తాయంటాడాయన. అందుకే యోగ, సూర్యనమస్కారాలు పాఠశాలలలో క్రమం తప్పకుండా సాధన చేయించేవారు.

**ఆధునిక కాలంలో...**

సూర్య నమస్కారాలకు విశేష ప్రాచుర్యం తెచ్చిన వారిలో స్వామి కైవల్యానంద ఒకరు. యోగ, సూర్య నమస్కారాలను అవిభాజ్యంగా చూస్తూ, ఒకే భౌతిక సంస్కృతిలోని అంశంగా ఆయన భావించారు. కానీ

# కూడా ఔషధమే!

నిజానికి రాజ్యాంగ వ్యవస్థ పర్యవేక్షణలో ఉండే ప్రజాస్వామిక వ్యవస్థ కోసం ఆయన 1939 ప్రాంతంలోనే తన రాజరికాన్ని త్యజించారు. అంటే సంస్థానాల విలీనానికి చాలా ముందే, రాజ్యాంగం అమలులోకి రావడం కంటే ఎంతో ముందే భావన్‌రావ్ భారత భవిష్యత్‌కు, పార్లమెంటరీ వ్యవస్థకు ఒక దిక్సూచిగా నిలిచారు.

సూర్య నమస్కారాలకు భావన్‌రావ్ కల్పించిన ప్రాచుర్యం చరిత్ర విస్మరించడం సాధ్యం కాదు. ఆయన కృషి అంత విశిష్టమైనది. సూర్య నమస్కారాల సాధన గురించి, ప్రక్రియ గురించి వివరించే 11 నిమిషాల మూకీ/లఘుచిత్రాన్ని 1928లోనే ఆయన నిర్మించారు. ఈ చిత్రాన్ని బ్రిటిష్ ఇండియా అంతటా ప్రదర్శించారు. ఆయన విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడ కూడా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. హిందీ, ఇంగ్లిష్ భాషలలో యోగా ఘనతను, శాస్త్రీయ దృక్పథాన్ని ఈ చిన్న చిత్రం నాడు విశ్వానికి వెల్లడించింది. స్వయంగా రాజాయే ఇందులో నటించారు. 1938లో యోగా గురువుగా ఎంతో ఖ్యాతి తెచ్చుకున్న కృష్ణమాచార్య కూడా ఈ చిత్రంలో కనిపిస్తారు. ఇందులో తొమ్మిది గజాల చీరలతో స్త్రీలు కూడా సూర్య నమస్కారాలు చేసే సన్నివేశాలు ఉన్నాయి. ఆరోగ్యానికి ఆధునిక సూర్య నమస్కారాలకు భావన్‌రావ్‌ను ఆద్యునిగా చెబుతున్నప్పటికీ, ఈ సూర్య నమస్కారాలు తనకంటే ముందే మహారాష్ట్రలో ఉన్నాయని ఆయన తన గ్రంథంలో సవినయంగా అంగీకరించారు.




**సూర్య నమస్కారాలపై పంత్ మూకీ చిత్రంలోని దృశ్యాలు**



తరువాత ఆయన అభిప్రాయం మార్చుకుని యోగ, సూర్య నమస్కారాలు వేర్వేరు అని ప్రచారం చేయడం ఆరంభించారు. దీనిని తిరుమల కృష్ణమాచార్య వంటివారు తిరస్కరించారు. 1933లో కృష్ణమాచార్య మైసూరులోని జగమోహన్ భవనంలో యోగా బోధించేవారు. అప్పుడు జరిగిన సాధనలో సూర్య నమస్కారాలు, యోగం కలిసే ఉండేవని మార్క్ సింగల్టన్ తన పుస్తకంలో పేర్కొన్నారు. నిజానికి మైసూరు సంస్థానానికి ఒక ప్రత్యేకత చరిత్రలో ఉంది. దేశీయమైన భౌతిక శిక్షణను గుర్తించిన ఘనత ఆ సంస్థానం ప్రభుత్వానిదే. 1919లోనే ఆ ప్రభుత్వం ఈ చర్య తీసుకున్నది. సూర్య నమస్కారాలు, యోగా తరగతులు నిర్వహించేవారని రికార్డులు తెలియచేస్తు న్నాయి. యోగాభ్యాసానికి ప్రాచుర్యం తెచ్చేందుకు కృష్ణమాచార్య ఆ విద్యను కొంత సరళం చేశారని కూడా ఈ రికార్డులు చెబుతాయి.

ఆధునిక సూర్య నమస్కారాల పితగా ఔంద్ (మహారాష్ట్ర) సంస్థానాధీశుడు భావనరావ్ శ్రీనివాసరావ్ పంత్ ప్రతినిధిని పేర్కొంటారు. బ్రిటన్‌కు చెందిన లూయిూ మోర్గాన్ అనే ఆమెతో కలసి భావనరావు సూర్యనమస్కారాలకు లౌకిక పునాది కల్పించారు. ఆరోగ్యానికి పది సూత్రాలు (1928) అంటూ ఆయన ప్రారంభించిన ఉద్యమానికి సూర్య నమస్కారాలే కీలకం. మోర్గాన్ దృష్టి వేరు. ఆమె సూర్య నమస్కారాలను ఇంగ్లండ్‌లో పరిచయం చేసినా, అది "ఫిట్‌నెస్" కోసమే. అందుకే అక్కడ ఆ రోజులలో మధ్య తరగతి మహిళలు ఎక్కువగా సూర్య నమస్కారాలకు ఆకర్షితులయ్యారు. భావనరావ్ మంత్రోచ్ఛాటనతో ఆసనాలు వేసేవారు. మోర్గాన్ కేవలం ఆసనాలు వేసేవారు. 'సూర్య నమస్కార' పేరుతో భావనరావ్ 1908లో ఒక పుస్తకం రాశారు. తన తండ్రి అర్ధ శతాబ్దం పాటు సూర్య నమస్కారాలను అభ్యసించారని అందులో పేర్కొన్నారు. అంటే 1870 ప్రాంతం నుంచి ఆయన సాధన చేసేవారు. నిజానికి భావనరావ్ పంత్, కైవల్యానంద ఇద్దరూ కూడా విదేశీ భౌతిక విద్యను భారతదేశంలో సాధన చేయడానికి బద్ధ వ్యతిరేకులు. ఆ భావన వారికి జాతీయభావం నుంచి జనించింది. తరువాతి కాలాలలో పట్టాభి జోయిస్, బీకేఎస్ అయ్యంగార్, స్వామి శివానంద సూర్య నమస్కారాలను విశేషంగా ప్రచారం చేసినవారిలో ఉన్నారు.

## సమున్నత ప్రయోజనాలు

ఉదయిస్తున్న సూర్యుడికీ, లేదా సాయం వేళ అస్తమిస్తున్న సూర్యుడికీ అభిముఖంగా నిలిచి సూర్య నమస్కారాలు చేయడం సంప్రదాయం. కానీ సాధారణ వాతావరణంలో కూడా చేస్తారు. మారిన జీవన శైలిలో ఇది తప్పడం లేదు. అయినా సాధారణ వ్యాయామశాలలలో ఉపయోగించే ఎలాంటి పరికరంతోను పని లేకుండా చేసే వ్యాయామం యోగా లేదా సూర్య నమస్కారాలు. ఇవి ఒక సంపూర్ణ వ్యాయామ ప్రక్రియ. సూర్యుడి ముందు వేకువనే నిలిచి వ్యాయామం చేయమని సూచించడంలోనే గొప్ప పరమార్ధం ఉంది. సూర్యుడు ఉదయించగానే ప్రసరించే కిరణాలతో మానవదేహానికి ఎన్నో మేళ్లు కలుగుతున్నాయి. దేహంలోని జీవగడియారం లయ తప్పకుండా పనిచేస్తుంది. డీ విటమిన్ ఉత్పత్తి అవుతుంది. ఎలాంటి కలత లేకుండా హాయిగా నిద్రపడుతుంది. భావోద్వేగాలు సమతూకంలో


శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రి టూల్స్

కలుపు పరికరాలు, కూరగాయల పంటలు, టెర్రస్ గార్డెన్‌లో వాడే పరికరాలు

1) అయ్యన్న వీడర్ రూ.1200/- 2) అన్నమయ్య వీడర్ రూ. 2000/-

3) ఒంగోలు గిత్త ప్లోయింగ్ వీడర్ రూ. 3000/- 4) రామయ్య వీడర్ రూ. 1500/-



Visit Youtube Link:

- Agriculture Implements at low cost - Rythu Nestham
- Low Cost agriculture machines to farmers - HMTV

Contact Number : 9849140465

ఉంటాయి. దేహంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. రోజంతా చురుకుదనం ఉరకలు వేస్తుంది. ఎలాంటి జన్యుపరమైన కారణం లేని పక్షంలో ఊబకాయంతో బాధపడేవారు రోజులో తొలి సూర్యకిరణాల ప్రభావంతో బరువు తగ్గే అవకాశం ఉందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి.

సూర్య నమస్కారాలలో 12 భంగిమలు లేదా ఆసనాలు ఉంటాయి. ఏ ఆసనమైనా పరిపూర్ణంగా ప్రదర్శించాలంటే సునిశిత నైపుణ్యం అవసరం. కాస్త నిశిత దృష్టితో పరిశీలిస్తే ప్రతి ఆసనం అందమైన శిల్ప భంగిమను తలపునకు తెస్తుంది. చాలా చిత్రంగా ప్రతి ఆసనం ఈ భూమ్మీద నివసించే ఒక జంతువును ప్రతిబింబిస్తూ ఉంటుంది. ముందు అనుకున్నట్టు ప్రకృతీ, తాను వేర్వేరు కాదని యోగ సాధకుడు భావించవలసి ఉంటుందని చెప్పడమే ఆసనాల లక్ష్యమని నిశ్చయంగా చెప్పవచ్చు. అంటే ప్రకృతిలోని అద్భుత సౌందర్యాన్ని ఆసనాలు ప్రతిబింబిస్తూ ఉంటాయి. సూర్య నమస్కార యోగాలో శరీరంలోని కండరాలు, లెగమెంట్లు, జాయింట్లు సాగుతాయి. తద్వారా బలోపేతమవు తాయి. సూర్య నమస్కారాలు క్రమం తప్పకుండా చేసే వారి అనుభవం ఏమిటి? కండరాల పటిష్టత, వెన్ను సరళం కావడం. రక్త ప్రసరణ, ప్రాణవాయువు సరఫరా మెరుగు పడతాయి. బ్లాకేజులు తగ్గి రక్త ప్రసరణ మెరుగు పడుతుంది. సూర్య నమస్కారాలలో ప్రతి ఆసనం ప్రత్యేకమైన ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో చేస్తారు. లయబద్ధమైన వ్యాయామం వల్ల ఊపిరి తిత్తులలోకి రక్త ప్రసరణ, ప్రాణవాయువు రాకపోకలు సజావుగా ఉంటాయి. క్రమం తప్పని సూర్య నమస్కార సాధన అధిక శరీర బరువును తగ్గిస్తుంది. ఆసనాలు వేగంగా వేయడం వల్ల ఉదరం వద్ద కండరాలు సాగుతాయి. జీవ ప్రక్రియ మరింత శక్తిమంతమవుతుంది. సరైన రక్త ప్రసరణ వల్ల చర్మం ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంటుంది. శిరోజాలు బలంగా ఉంటాయి. జఠరాగ్ని పెరగడానికి సూర్య నమస్కారాలు గొప్పగా ఉపకరిస్తాయి. అంటే ఆకలికి లోటుండదు. నరాల వ్యవస్థలో సమతుల్యత సాధ్యమై, ఒత్తిడి తగ్గుతుంది. సూర్య నమస్కారాలు స్త్రీలలో బహిష్టు ప్రక్రియను క్రమబద్ధం చేస్తాయి. కొందరిలో కనిపించే నెలవారి శూలపోటును తగ్గిస్తాయి. అందరిలోను సరైన నిద్ర వ్యవస్థను సరి చేయగలవు. నిద్రలేమితో బాధపడేవారు సూర్య నమస్కారాలతో ఉపశమనం పొందుతారు. పిల్లలు ఏడు లేదా ఎనిమిదేళ్ల వయసు నుంచి సూర్య నమస్కారాలు చేయవచ్చు. వారికి కూడా శారీరక పటుత్వమే కాకుండా, మానసికంగా బలంగా ఉండేందుకు అవి దోహదపడతాయి. అయితే వీటిని మొదటి గురు ముఖంగా లేదా అనుభవజ్ఞుల సమక్షంలో సాధన చేయడం మంచిదన్న మాట నిజం.



# ఇస్లాం-యోగ

**సూ**ర్యుడిని ఒక దైవంగా భావించే బలమైన భావన హిందూధర్మానికే పరిమితం. సూర్యుడి వెలుగును మాత్రం అన్ని మతాలు గుర్తించాయి. క్రైస్తవులు వెలుగును దేవుని రూపంగానే చూశారు. సూర్యుడినే దైవంగా భావించలేదు. ఇస్లాం సూర్యుడిని అల్లా సృష్టిగా భావించింది. యూదులు కూడా దైవంగా భావించరు. అంటే సూర్యుడిని ఆకాశంలో ఒక చుక్కగా లేదా నక్షత్ర మండలంలోనే ఒక నక్షత్రంగా మాత్రమే ఈ మతాలు పరిగణిస్తాయి. సూర్య నమస్కార యోగాను కొన్ని ముస్లిం దేశాలు స్వాగతించాయి. కొన్ని అభ్యంతరం వ్యక్తం చేశాయి. యోగ, సూర్య నమస్కారాలు ఇచ్చే ఫలితాలను అంగీకరిస్తూనే, అందులోని హిందూత్వ కోణం కారణంగా దూరం పెట్టిన దేశాల వారు, వ్యక్తులు కూడా ఉన్నారు. భారతీయ ముస్లింలలో ఛాందసవాదులు యోగాకు దూరంగా ఉండాలని ఆదేశించారు. కానీ యోగా గురించి ఇస్లాం ప్రపంచానికి శతాబ్దాల పరిచయం ఉందని చరిత్ర చెబుతుంది. ఇందుకు సంబంధించి వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చక్కని సమాచారం ఇచ్చింది.

అబూ అల్ రేహాన్ మహమ్మద్ ఇబన్ అహ్మద్ అల్ బెరూనీ (అల్‌బెరూనీ) ముస్లిం చరిత్రలో ప్రఖ్యాతుడు. తత్త్వవేత్త, స్వయంగా చరిత్రకారుడు, గణితశాస్త్రవేత్త కూడా. మహమ్మద్ ఘజనీ ఆస్థానానికి వన్నె తెచ్చిన వానిగా కీర్తి ఉంది. ఇతడు భారతదేశంలో 12 ఏళ్లు ఉన్నాడు. తరువాత కితాబ్ అల్ హింద్ లేదా తహకిక్ ఇ హింద్ (భారతదేశ చరిత్ర) రాశాడు. ఆ పుష్కరకాలం అతడు సంస్కృతం, ఖగోళశాస్త్రం, ఇతర శాస్త్రాలు నేర్చుకున్నాడు. 11వ శతాబ్దంలో భారతదేశ సామాజిక, సాంస్కతిక వాతావరణం ఎలా ఉందో వర్ణించాడు. తహకిక్ ఇ హింద్ గ్రంథంలో అతడు తరుచు పతంజలి యోగ శాస్త్రం గురించి ప్రస్తావించడం గమనార్హం. పతంజలి యోగసూత్రాలకు అప్పుడు లభ్యమైన ఒక వ్యాఖ్యానాన్ని తాను అరబిక్‌లోకి అనువదించానని కూడా ఆయన చెప్పుకున్నాడు. ఈ అనువాదం 1922లో ఇస్తాంబుల్ పురావస్తు భాండాగారంలో బయటపడింది కూడా. అల్‌బెరూనీ తన పుస్తకంలో మంచి సాహిత్య శైలితో యోగసూత్రాలను పరిచయం చేశాడు. ఇదంతా ఒక ఎడారిలో పతంజలి, మరొక యోగి కలసి నడుస్తూ సంభాషిస్తున్న తీరులో ఆయన రచించాడు. ఆ కాలంలో యోగసూత్రాల మీద వెలువడిన కొన్ని ఇతర భాష్యాలూ, వ్యాఖ్యానాల గురించి కూడా అల్‌బెరూనీ ప్రస్తావించాడు. చిత్రంగా ఆ వ్యాఖ్యానాలలో, భాష్యాలలో ఉన్న కొన్ని భాగాలు తరువాత లభ్యం కాలేదు. పతంజలి సూత్రాలకు అల్‌బెరూనీ అనువాదం పేరు 'బాధా నివారణకు భారత పతంజలి పుస్తకం'. కాబట్టి విదేశాలకు వెళ్లిన పతంజలి యోగసూత్రాల అనువాదాలలో మొట్టమొదటిది అల్‌బెరూనీ రాసినవే అవుతాయి. అయినా కొన్ని భారతీయతతో ముడిపడి ఉన్న సంస్కృత పదాలకు సరైన అరబిక్ పదాలు లభ్యం కాక తడబడ్డాడన్న అభిప్రాయం కూడా ఉంది.

యోగా వంటి ఒక ప్రక్రియ గురించి, అందుకు సంబంధించి సంస్కృత భాషలో రాసిన సూత్రాలను అంత శ్రమించి అరబిక్‌లోకి అనువదించడం అంటే, భారతీయ జీవనం గురించి ముస్లిం ప్రపంచానికి పరిచయం చేయాలన్న తపనతోనే అయి ఉండాలని విమర్శకులు అంటారు. అయితే ఇతర దేశాలకు భారతీయ శాస్త్ర పరిజ్ఞానం పరిచయం కావడం అల్‌బెరూనీతోనే మొదలు కాలేదు. ఖగోళశాస్త్రం, గణితం వంటి కొన్ని అంశాలు అప్పటికే ముస్లిం దేశాలకు పరిచయం అయ్యాయి. ఖగోళశాస్త్రానికి సంబంధించి బ్రహ్మగుప్తుని గ్రంథాలు, వైద్యానికి సంబంధించి చరకుని, వాగ్భటుని గ్రంథాలు ముస్లిం ప్రపంచానికి తెలుసు. ఇస్లాంలోనే సూఫీ తెగ హఠయోగం మీద ఆసక్తి కలిగి ఉండేది. దీనిని చర్చించిన సంస్కృత గ్రంథం అమృతకుండ అరబిక్, పర్షియన్, తుర్కిష్, ఉర్దూ భాషలలో అనువాదాలు ఉన్నాయి.

**– జాగృతి డెస్క్**

# ఎలా చేయాలి?

సూర్య నమస్కారాలు చేసే సమయంలో నిటారుగా, ప్రార్థనా భంగిమలో నిలుచుని ఉండాలి. కొద్ది నిమిషాలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు (inhale - exhale) చేయాలి.

**1. నమస్కారాసనం (నిశ్వాస)**

సూర్యునికి ఎదురుగా నమస్కారం చేస్తున్నట్లు నిలబడి సూర్యుని నామాన్ని ఉచ్చరించాలి. రెండు పాదాలు ఒకదానికొకటి తాకుతూ ఉండాలి. చేతులు నమస్కార ముద్రను చూపుతుండాలి.

**2. హస్త ఉత్థానాసనం (ఉచ్ఛ్వాస)**

శ్వాస లోనికి పీలుస్తూ రెండు చేతులను పైకెత్తి వీపు వైపునకు వెనుకకు వంచాలి. ప్రారంభ దశలో ఉన్న సాధకులైతే కొద్దిగాను, చాలాకాలంగా అభ్యసిస్తున్న వారైతే గాఢంగాను ఊపిరి పీల్చుకోవాలి కాళ్లు వంచకూడదు.

**3. పాదహస్తాసనం (నిశ్వాస)**

శ్వాసను వదులుతూ ముందుకు వంగి రెండు చేతులను నేలపై ఆన్చాలి. రెండు చేతులను నేలపై ఆన్చలేని పక్షంలో మోకాళ్లను వంచి చేతులను పాదాలకు ఇరుపక్కలా ఉంచాలి. తల తొడలను చూస్తున్నట్లు ఉండాలి. మెడ కింద వైపు వేలాడేలాగా ఉంచాలి. పైకి చూడకూడదు. అలా కాకుంటే మెడ పట్టేసే ప్రమాదముంది.

**4. అశ్వసంచలనాసనం (ఉచ్ఛ్వాస)**

ఎడమ మోకాలును వంచి పాదాన్ని నేలపై ఉంచి, కుడి పాదాన్ని వెనుకగా వేళ్లపై ఆనించి, రెండు చేతులను పైకి చాపి, నడుము పైభాగాన్నంతా వెనుకకు వంచాలి. ఈ స్థితిలో శ్వాసను పీల్చి లోపలే స్తంభింప చేయాలి.

**5. సంతులాసనం (నిశ్వాస)**

కాళ్లు, చేతులు నేలమీద ఆనించి నడుము పైకి ఎత్తి శ్వాస వదలి తిరిగి పీల్చాలి.

**6. సాష్టాంగ నమస్కారం (శ్వాస పట్టి ఉంచాలి)**

ఎనిమిది అంగాలు నేలకు ఆనటం వలన దీనికి 'అష్టాంగ నమస్కారం' అని కూడా అంటారు. రెండు కాళ్లు, రెండు మోకాళ్లు, రెండు చేతులు, రొమ్ము, గడ్డం – ఈ ఎనిమిది అంగాలు నేలమీద ఉంచి, నడుమును కొద్దిగా పైకి లేపాలి. శ్వాసను పూర్తిగా బయటకు వదలి ఆపాలి.

**7. సర్పాసనం (ఉచ్ఛ్వాస)**

శ్వాసను పీల్చి, తలను వెనుకకు వంచాలి.

**8. పర్వతాసనం (నిశ్వాస)**

ఐదవ స్థితివలెనే కాళ్లు చేతులు నేలమీద ఆనించి, నడుమును పైకి ఎత్తి శ్వాస వదలి తిరిగి పీల్చాలి.

**9. అశ్వసంచలనాసనం- (ఉచ్ఛ్వాస)**

నాలుగవ స్థితివలెనే కుడి పాదాన్ని నేలపై ఉంచి, మోకాలును మడిచి, ఎడమ పాదాన్ని వెనుకగా వేళ్లపై ఆనించి, రెండు చేతులను, తలను, నడుమును వెనుకకు వంచాలి.

**10. పాదహస్తాసనం (నిశ్వాస)**

మూడవ స్థితివలెనే రెండు చేతులను కాళ్ల దగ్గరగా నేలపై ఆనించి తలను మోకాలుకు ఆనించాలి. శ్వాసను బయటకు వదలి ఆపాలి. (Standing Forward Bend pose)

**11. హస్త ఉత్తానాసనం (ఉచ్ఛ్వాస)**

రెండవ స్థితివలెనే రెండు చేతులను పైకెత్తి, తలతోపాటు రెండు చేతులను వెనుకకు వంచాలి.

**12. నమస్కారాసనం (నిశ్వాస)**

నిటారుగా నిలబడి నమస్కారం చేయాలి.

### సూర్య నమస్కార మంత్రాలు

ప్రారంభ శ్లోకం:

**ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ**<br>
**నారాయణః సరసిజాసన సన్నివిష్టః ।**<br>
**కేయూరవాన్ మకర కుండలవాన్ కిరీటీ**<br>
**హారీ హిరణ్మయవపుః ధృత శంఖచక్రః ॥**

1. ఓం మిత్రాయ నమః
2. ఓం రవయే నమః
3. ఓం సూర్యాయ నమః
4. ఓం భానవే నమః
5. ఓం ఖగాయ నమః
6. ఓం పూష్ణే నమః
7. ఓం హిరణ్యగర్భాయ నమః
8. ఓం మరీచయే నమః
9. ఓం ఆదిత్యాయ నమః
10. ఓం సవిత్రే నమః
11. ఓం అర్కాయ నమః
12. ఓం భాస్కరాయ నమః
13. ఓం శ్రీ సవితృ సూర్యనారాయణాయ నమః

ఈ శ్లోకంతో సూర్య నమస్కారాలు పూర్తవుతాయి.

**ఆదిత్యస్య నమస్కారాన్ యే కుర్వన్తి దినే దినే ।**<br>
**ఆయుః ప్రజ్ఞా బలం వీర్యం తేజస్తేషాం చ జాయతే॥**

**సూర్య నమస్కారాలలో మొత్తం 13 ఆవృతాలు ఉంటాయి. ఒక్కొక్క మంత్రానికి ఒక ఆవృతం పూర్తవుతుంది. ప్రతీ ఆవృతంలోనూ సాధకులు 12 ఆసనాలు వేస్తారు.**





# నవ భారత నిర్మాణంలో యోగ

భారతదేశం యోగను ప్రపంచానికి ఆధ్యాత్మిక వారసత్వంగా అందించింది. 2014లో ఐక్యరాజ్య సమితి ద్వారా అంతర్జాతీయ యోగ దినోత్సవం ప్రకటన ఈ శాస్త్రానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు నిచ్చింది. ఈ నేపథ్యంలో యోగ ఎలా ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది, మతోన్మాద వ్యతిరేక శక్తిగా ఎలా పనిచేసింది అన్న వివరాలు:

**యోగ భారత్: చారిత్రక మూలాలు**

యోగ శాస్త్రానికి భారతీయ మూలాలు సింధు-సరస్వతీ నాగరికత (క్రీ.పూ. 2700) నాటివి. ఇందులోని ముద్రలు, శిల్పాలు యోగాసనాలను చిత్రిస్తాయి. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతలలో యోగ తత్వాలు వెల్లడయ్యాయి. మహర్షి పతంజలి యోగసూత్రాల ద్వారా ఈ పరిజ్ఞానాన్ని సిద్ధాంతబద్ధం చేశాడు. ఆధునిక భారత్‌లో 1949లో జవహర్ లాల్ నెహ్రూ ప్రభుత్వం మొదటిసారిగా జూన్ 21ని అంతర్జాతీయ యోగ దినోత్సవంగా ప్రతిపాదించింది. కానీ 2014లో నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించి, 177 దేశాల మద్దతుతో ఈ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదింపజేశారు.

**అంతర్జాతీయ గుర్తింపు, ప్రభావం**

**యునైటెడ్ నేషన్స్ ప్రకటన:** 2014 డిసెంబర్ 11న యుఎన్ జనరల్ అసెంబ్లీ 21 జూన్‌ను అంతర్జాతీయ యోగ దినోత్సవంగా ప్రకటించింది. మొదటి వార్షికోత్సవంలో 84 దేశాల ప్రతినిధులు ఢిల్లీలో 35,985 మందితో కలిసి యోగాసనాలు చేశారు.

**ప్రపంచవ్యాప్త స్వీకారం:** 2025 నాటికి 190కు పైగా దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుతున్నాయి. చైనా, యుఎస్, జపాన్ వంటి దేశాలు తమ పాఠశాలల్లో యోగను ప్రవేశపెట్టాయి.

**సాంస్కృతిక దౌత్యం:** యోగ భారత్ "సాఫ్ట్ పవర్"గా మారింది. ప్రతి సంవత్సరం 50కోట్లకు పైగా ప్రజలు ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవంలో పాల్గొంటున్నారు.

**ఆర్థిక వృద్ధి:** 2024 నాటికి ప్రపంచ వెల్నెస్ మార్కెట్ 4.5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. భారతదేశం యోగ టూరిజం ద్వారా సంవత్సరానికి 10 బిలియన్ డాలర్లను ఆర్జిస్తోంది.

**స్టార్టప్ సంస్కృతి:** Cult.fit, Sarva Yoga వంటి యోగ ఆధారిత స్టార్టప్లు 500 మిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పొందాయి. డిజిటల్ యోగ ప్లాట్‌ఫామ్‌లు (ఉదా: Yoga International) ఒక కోటి మందికి పైగా సభ్యులను కలిగి ఉన్నాయి.

**ఆరోగ్య పరిశ్రమ:** యోగ మ్యాట్లు, అనుబంధ పరికరాలు, ఆయుర్వేద ఉత్పత్తుల మార్కెట్ భారత్‌లో సంవత్సరానికి 15% వృద్ధి రేటును నమోదు చేస్తోంది.

**మతోన్మాద వ్యతిరేక శక్తిగా యోగ**

యోగ సామూహిక చైతన్యాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజలలో ఐక్యత, మానసిక స్థైర్యాన్ని పెంచుతుంది. ఉదాహరణకు: జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో యోగ శిబిరాలు యువతలో మానసిక ఒత్తిడిని తగ్గించి, అతివాదం నుండి దూరం చేస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ వంటి ఉగ్రమూకలు యోగ సెషన్లను "మానసిక యుద్ధానికి" వ్యతిరేకంగా ఉపయోగిస్తున్నాయని రహస్య నివేదికలు సూచిస్తున్నాయి. యోగ ద్వారా ప్రచారం చేసే అహింస, సహనం, మానవతావాదం అంతర్జాతీయ స్థాయిలో సామరస్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

యోగ భారత్ యొక్క ప్రచండ భారత్ అనే దృష్టికి సాంస్కృతిక వారసత్వం, ఆర్థిక ప్రగతి, సామాజిక స్థైర్యం అనేవి మూడు స్తంభాలు. 2030 నాటికి భారత్ యోగ ఆధారిత ఆరోగ్య సేవల ద్వారా 50 బిలియన్ డాలర్ల ఎగుమతులను సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మతాతీత చైతన్యాన్ని ప్రోత్స హించడం ద్వారా, ఈ ప్రాచీన శాస్త్రం నూతన భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోంది.

**డా: చిట్యాల రవీందర్,**
**7798891795**

ఫోన్ ట్యాపింగ్.. తెలంగాణలో ప్రకంపనలు సృష్టించిన వ్యవహారం. దాదాపు ఏడాది కాలంగా పోలీసులను తలలు పట్టుకునేలా చేస్తోన్న పరిణామం. చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో అధికారం మాటున జరిగిన దుర్మార్గపు తంతు. అసలు ఇలా కూడా చేయొచ్చా? అని నిఘా వర్గాలనే విస్తుపోయేలా చేసిన ఆధారాలు దొరికిన సంఘటన. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆదేశంతో ఒక రకంగా నియంతృత్వ పాలన సాగించిన అధికార యంత్రాంగం.. చివరకు నైతికతను కూడా గాలికొదిలేసింది. ప్రత్యేకంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవస్థనే సమకూర్చుకున్నారు. నిబంధనలు అడ్డురాకుండా.. అధికారాన్ని అడ్డు పెట్టుకొని పని కానిచ్చేశారు. ఈ తతంగానికి సంబంధించి అనుమానం రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రత్యేక బృందాన్ని నియమించింది. ఈ కన్నింగ్ దందాకు సంబంధించిన ఆధారాలన్నీ సేకరించింది. కానీ, సూత్రధారులు, పాత్రధారులను విచారిస్తూ కాలం వెల్లదీస్తోంది. ఇప్పటిదాకా ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఏ-1 అయిన ప్రభాకర్ రావు విదేశాల్లో ఉన్నాడని, ఆయన తిరిగొస్తేనే ఈ కేసు ముందుకు సాగుతుందని, ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులెవరో, ఆదేశాలు ఇచ్చిన పెద్దాయన ఎవరో బయటకు వస్తారని, అప్పుడు అసలు నిందితులను కటకటాల్లోకి పంపిస్తామని ప్రభుత్వం చెబుతూ వచ్చింది.

# ఫోన్ ట్యాపింగ్ హీట్

రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లే ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు ప్రభాకర్‌రావు విదేశాల నుంచి హైదరాబాద్ తిరిగొచ్చారు. కేసు తీవ్రత దృష్ట్యా పాస్‌పోర్టు రద్దు చేసినప్పటికీ.. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్‌తో దుబాయ్ మీదుగా హైదరాబాద్ చేరుకున్నారు. ఆయన రాక నుంచే అరాచకాలు మొదలయ్యాయి. ఆయనకు రక్షణ కోసం శంషాబాద్ విమానాశ్రయానికి దాదాపు 70 మంది బౌన్సర్లు వచ్చారు. వారు పోలీసులను లెక్క చేయలేదు. మీడియాను కూడా దగ్గరికి రానీయకుండా ఆ ప్రతినిధులపై దాడికి పాల్పడ్డారు. అయినా పోలీసులు చేష్టలుడిగిపోయారే తప్ప తమ పాత బాస్‌కు సంబంధించిన బౌన్సర్లను ఏమీ అనలేక పోయారన్న చర్చ జరిగింది. మరుసటిరోజు కోర్టుకు విచారణకు హాజరైన సందర్భంలోనూ సేమ్ సీన్.

వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారం అత్యంత జుగుప్సాకరం. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఈ స్థాయిలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన అరాచకం ప్రపంచ చరిత్రలోనే ఎక్కడా జరిగి ఉండదు. ప్రధానంగా రాజకీయ ప్రత్యర్థుల సంభాషణలు వినడానికి, వాళ్ల వ్యూహాలకు కౌంటర్లు రూపొందించడానికే ప్రారంభించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రంలో అత్యంత అమానుష పరిణామాలకు దారి తీసింది. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, భార్యాభర్తలు, ప్రియులు, వివాహేతర సంబంధాలు వంటి అనేక అంశాల్లో ఈ ఫోన్‌ట్యాపింగ్‌ను ప్రభాకర్‌రావు అండ్ గ్యాంగ్ తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఫోన్ ట్యాపింగ్‌ను అడ్డు పెట్టుకొని కాపురాల్లో కలహాలు సృష్టించారన్న ఆరోపణ లున్నాయి. వివాహేతర సంబంధాల్లో బ్లాక్ మెయిల్ చేసి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారన్న ప్రచారం జరిగింది. ఈ ఫోన్ ట్యాపింగ్ దందాతో.. ప్రేమ వ్యవహారాలనూ సెటిల్ చేశారన్న ప్రచారం కూడా ఉంది ఇక, ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీల నాయకుల డబ్బుల సమీకరణలను పసిగట్టి పోలీసులతో, ఇన్‌కమ్‌టాక్స్ అధికారులతో రైడింగ్‌లు చేయించి వాళ్లను ఆర్థికంగా దెబ్బతీశారు. అధికారికంగానే కాకుండా.. అనధికారికంగా కూడా దాడులు చేసి.. భారీ మొత్తంలో సంపాదనకు అలవాటు పడ్డారన్న చర్చ కూడా అప్పట్లో జరిగింది. సినీ రంగానికి చెందిన వారి సెల్‌ఫోన్లు కూడా ట్యాపింగ్ చేసి.. పెద్ద ఎత్తున బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడినట్లు పోలీసుల విచారణలో బయటపడ్డాయి.




ఇవన్నీ ఇలా ఉంటే.. ప్రభాకర్ రావు గ్యాంగ్ చివరకు న్యాయవ్యవస్థనూ వదల్లేదన్న ఆధారాలు బయటకు వచ్చాయి. ఏకంగా జడ్జిల ఫోన్ సంభాషణలు కూడా విన్నారన్న ఆనవాళ్లు.. న్యాయ వ్యవస్థను కుదిపాయి. పెద్ద స్థాయిలో అరాచకంగా వ్యవహరించిన ఫోన్ ట్యాపింగ్ బ్యాచ్ చేతికి చిక్కితే దర్యాప్తు ఏ స్థాయిలో ఉండాలి? విచారణ ఏ రకంగా సాగాలి? నిందితుల వెన్నులో వణుకు ఎలా పుట్టాలి? ఇప్పటిదాకా విచారణ ఎదుర్కొన్న ట్యాపింగ్ బ్యాచ్ టీమ్.. ప్రభాకర్‌రావు తిరిగొచ్చాడంటేనే ఏ రకంగా వణికిపోవాలి? కానీ, ఇప్పుడు చూస్తే పరిస్థితి అలా కనిపించడం లేదు. నువ్వూ, నేనూ దోస్త్.. అనే రీతిలో వాతావరణం కనిపిస్తోందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

అధికారానికి వచ్చిన కొత్తలో.. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో సాగించిన అరాచకాలపై అంతెత్తున అధికార పక్ష నాయకులు ఎగిసి పడ్డారు. కరెంటు కొనుగోళ్లలో అక్రమాలు, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్నారు. ఆయా అంశాల్లో విచారణ కమిషన్లు నియమించారు. ఇక.. ఫోన్



కేసీఆర్



ప్రభాకర్‌రావు

# చల్లబడినట్లేనా?

ట్యాపింగ్ కేసులో అయితే... ఊహించని రీతిలో శిక్షలు వేయిస్తామన్నారు. కానీ, దేనికదే విచారణలు కొనసాగుతున్నాయి. సాగిపోతున్నాయి. అవినీతి, అక్రమాలు పక్కన బెడితే.. నైతికతను వదిలేసి.. విలువలను పాతరేసి.. అనాగరికంగా.. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడితే, రహస్యాలు అనేవి లేకుండా.. అన్నీ బాహాటంగా తెలుసుకొని బ్లాక్‌మెయిల్ చేస్తే.. నిందితులు దొరికినా మీనమేషాలు లెక్కిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలంటున్నారు బాధితులు, సామాన్యులు.

ఈ పరిణామాలకు తాజాగా ప్రభాకర్‌రావు విచారణే నిదర్శనమంటున్నారు విశ్లేషకులు. వాస్తవానికి ఏడాది కాలంగా ఈ కేసులో విచారణాధికారులు తలమునకలయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఫోన్ ట్యాపింగ్‌లు చేయించింది వాస్తవమే అన్న ఆధారాలు బయటకు వచ్చాయి. నిందితులు వీళ్లే అన్నది స్పష్టంగా రికార్డుల్లో నమోదయ్యింది. కానీ, పోలీసుల విచారణకు హాజరైన ప్రభాకర్‌రావు, ఫోన్ ట్యాపింగ్‌తో తమకేమిటి సంబంధం అని ఎదురు ప్రశ్నించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. ఈ కేసులో నిందితులుగా చేర్చిన వాళ్లందరూ వృత్తిలో భాగంగా తన దగ్గర పనిచేసిన వాళ్లు మాత్రమేనని, విధి నిర్వహణలో భాగంగా మావోయిస్టులకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే తాము పర్యవేక్షించామని ప్రభాకర్‌రావు చెప్పినట్లు సమాచారం. తిరుపతన్న, భుజంగరావు, రాధాకిషన్‌రావు తదితరులతో తనకు వృత్తిపరమైన సంబంధాలు మాత్రమే ఉన్నాయని ప్రభాకర్ రావు స్పష్టంచేసినట్లు సమాచారం. జూన్ 8వ తేదీన అమెరికా నుంచి హైదరాబాద్ తిరిగివచ్చిన ప్రభాకర్ రావు.. మరుసటి రోజు సిట్ విచారణకు హాజ రయ్యారు. 2023 నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఎస్ఐబీ కార్యాలయంలో హార్డ్‌డిస్క్‌ల ధ్వంసంపైనా అధికారులు ప్రభాకర్‌రావును ప్రశ్నించారు. ఆ నెల 30న సాయంత్రం 4 గంటలకే తాను ఎస్ఐబీ చీఫ్ పోస్టుకు రాజీనామా చేశానని, ఆ వెంటనే కార్యాలయాన్ని విడిచిపెట్టి వెళ్లానని చెప్పిన ప్రభాకర్‌రావు... ఆ తర్వాత రాత్రి 8 గంటల ప్రాంతంలో జరిగిన ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంతో తనకు ఎలా సంబంధం ఉంటుందని సిట్ అధికారులను ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. ఆ హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేసి, కొత్తవి పెట్టమన్నది ఎవరు? అని పోలీసులు ప్రశ్నించగా... ఆయన నుంచి సరైన స్పందన రాలేదంటున్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు పోలీసులు చేసిన దర్యాప్తు, నిందితులు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా సిట్ అధికారులు ప్రభాకర్‌రావును ప్రశ్నించారు.‘ ఫోన్ ట్యాపింగ్‌తో నాకేం సంబంధం? ఏయే ఫోన్లు ట్యాప్ చేయాలి? ఎంత కాలం చేయాలి? ఎందుకు చేయాలి? అనేది ఖరారు చేయడానికి, ఆ వ్యవహారాన్ని పర్యవేక్షించడానికి రివ్యూ కమిటీ ఉంటుంది. ఆ కమిటీలోని సభ్యులుగా ఉన్నతాధికారులను ఎందుకు వదిలేశారు?’ అని ప్రభాకర్ రావు ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. ఆయా అధికారులను విచారించి, వాంగ్మూలాలు నమోదు చేశామని పోలీసులు చెప్పగా... ట్యాపింగ్‌కు అనుమతి ఇచ్చింది వారేనని.. తనకు ఏమాత్రం సంబంధం లేదని వాదించినట్లు సమాచారం. ఈ విచారణ మొత్తాన్ని పోలీసులు వీడియో రికార్డింగ్ చేశారు. ఆ తర్వాత కూడా పలు దశలుగా ప్రభాకర్‌రావును విచారించారు సిట్ అధికారులు.

ఈ విచారణ తంతు ఇలా సాగుతున్న సమయంలో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు నీచుడని, అతను సామాన్యుడు కాదని, ఎంతో మంది ఉసురుపోసుకున్నాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. అంతేకాదు... ప్రభాకర్ రావు పథకం ప్రకారమే లొంగిపోయి సిట్ విచారణకు హాజరయ్యాడన్నారు. తమ లాంటి అనేక మంది కార్యకర్తల ఉసురుపోసుకున్న వ్యక్తి ప్రభాకర రావు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్ విచారణలో మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను బహిరంగ పర్చాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ‘సీఎం రేవంత్ రెడ్డిపైనే కాదు.. నాతో పాటు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు, జడ్జీల ఫోన్లను కూడా ప్రభాకర్ రావు ట్యాప్ చేసిన ఘనుడు. అలా చాలా మంది జీవితాలు దెబ్బ తిన్నాయి. భార్యాభర్తలు మాట్లాడుకున్న సంభాషణలను కూడా ట్యాప్ చేసిన వ్యక్తి.. ఆయన వల్ల భార్యాభర్తలు ఫోన్లో మాట్లాడుకోలేని దుస్థితిని కల్పించారు’. అని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశం మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు.



బండి సంజయ్

‘ఫోన్ ట్యాపింగ్ చేశాక వాటిని ఏం చేశారు? ట్యాపింగ్ ఆడియోలను ఎవరికి పంపారు.. ఆ ఆడియోలను అడ్డుపెట్టుకుని ఎవరెవరిని బెదిరించారు? అనే వివరాలు రాబట్టాలి. వాటిని బహిర్గతం చేయాలి. 18 నెలల రాష్ట్ర పాలనలో అవినీతి కేసుల విచారణలో ఏ ఒక్క కేసు విచారణ ముందుకు సాగలేదని బండి విమర్శించారు. ఇకనైనా కోర్టులో గట్టిగా వాదనలు విన్పించాలని, ప్రభాకర్ రావు సహా ఆయన వెనుకున్న సూత్రధారులను దోషులుగా తేల్చాల్సిందేనని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు.

సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే నిందితులందరినీ అరెస్ట్ చేసి, విచారించారు. కస్టడీలోకి తీసుకొని కూడా ఆధారాలు సేకరించారు. విదేశం నుంచి ఇప్పట్లో తిరిగిరాదనుకున్న ప్రభాకర్ రావు భారత్‌కు తిరిగొచ్చాడు ఇక.... ఈ ఫోన్ ట్యాపింగ్ కన్నింగ్ గాళ్లందరినీ బయటకు తీస్తారా? అసలు సూత్రధారులను కటకటాల్లోకి పంపిస్తారా? తేలాల్సి ఉంది.

**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

# నిరుద్యోగ సుడిలో

**సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగానికి ప్రయత్నిస్తున్న అభ్యర్థులకు, ముఖ్యంగా ఫ్రెషర్లకు, కెరీర్ గ్యాప్ అనేది ఒక పెద్ద అడ్డంకిగా మారింది. ఈ అడ్డంకిని అధిగమించగలుగుతున్నది కేవలం 1 శాతం మంది మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన 99 శాతం ఉద్యోగాలు రాక, భవిష్యత్ అగమ్యగోచరంగా ఉండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇది వారి తల్లిదండ్రులకు కూడా తీరని వేదనను కలిగిస్తోంది.**



సాఫ్ట్‌వేర్ కంపెనీలు నియామక ప్రక్రియలో ఏటా నిబంధనలను కఠినతరం చేస్తుండటంతో ఈ సమస్య మరింత జటిలమవుతోంది. కోవిడ్-19 మహమ్మారికి ముందు, కంపెనీలు మూడు సంవత్సరాల వరకు కెరీర్ గ్యాప్ ఉన్నవారిని కూడా ఫ్రెషర్లుగా పరిగణించి ఉద్యోగాలు ఇచ్చేవి. కానీ 2024 నుంచి ఈ నిబంధనను రెండు సంవత్సరాలకు కుదించారు. కొన్ని కంపెనీలు అయితే ఈ గ్యాప్‌ను కేవలం ఒక సంవత్సరానికే పరిమితం చేశాయి. అంతేకాదు, మరికొన్ని సంస్థలు కేవలం ఆ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారిని మాత్రమే ఫ్రెష్ అభ్యర్థులుగా పరిగణిస్తున్నాయి. ఈ కఠిన నిబంధనలు తల్లిదండ్రులకు తెలిసేసరికి, వారి పిల్లల ఉన్నత విద్య పూర్తయి, ఉద్యోగ వేటలో విలువైన సమయం గడిచిపోతోంది. ఉద్యోగం రాదని తెలిసినప్పుడు తల్లిదండ్రులు, వారి పిల్లలు తీవ్ర నిరాశలో మునిగిపోతున్నారు. ఇంటికొకరు లేదా ఇద్దరు ఉన్నత విద్యావంతులు ఉద్యోగాలు లేకుండా ఖాళీగా ఇంట్లో ఉండటం చూసి తల్లిదండ్రులు తీవ్రమైన మానసిక వేదనను అనుభవిస్తున్నారు. ఈ పరిస్థితి సమాజంలో ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. లక్షలాది కుటుంబాలు తమ గుండెల్లో ఈ దావానలాన్ని దాచుకుని జీవిస్తున్నాయి. నిరుద్యోగ సమస్య భవిష్యత్తులో సమాజాన్ని ఏ దిశగా తీసుకెళ్తుందో అనే ఆందోళన అందరిలోనూ నెలకొంది.

**ఏటా 2 లక్షల మంది పోటీ**

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం ఏటా సుమారు రెండు లక్షల మంది అభ్యర్థులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఈ సంఖ్యలో బీటెక్, సిఎస్‌సి, ఐటీ చదువుతున్న 50 వేల మంది విద్యార్థులు, అలాగే ఎఐ,-మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంట సీఎస్‌సీ అనుబంధ కోర్సులు చదువుతున్న మరో 20 వేల మంది ఉన్నారు. అంతేకాకుండా, ఈసీఈ, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ వంటి ఇతర ఇంజినీరింగ్ విభాగాల నుండి సుమారు 20 వేల మంది విద్యార్థులు కూడా సాఫ్ట్‌వేర్ రంగంలోకి అడుగు పెట్టాలని చూస్తున్నారు. వీరందరితో పాటు, ఎంసీఏ చదివిన 10 వేల మంది, బీఎస్సి కంప్యూటర్ సైన్స్, బీసీఏ వంటి కోర్సులు పూర్తి చేసిన లక్ష మందికి పైగా అభ్యర్థులు కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం పోటీలో ఉన్నారు. అయితే, ఇంత పెద్ద సంఖ్యలో పోటీ పడుతున్నప్పటికీ, కనీసం ఒక శాతం మందికి అంటే 2 వేల మందికి కూడా ఉద్యోగాలు లభించడం లేదు. చాలా కళాశాలల్లో జరుగుతున్న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జిల్లాలోని మొదటి, రెండు అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో జరిగే క్యాంపస్ నియామకాలు కొంతవరకు నిఖార్సుగా జరుగుతున్నప్పటికీ, చాలా కళాశాలల్లో జరిగే రిక్రూట్‌మెంట్లు బోగస్‌గానే కనిపిస్తున్నాయని ఎంపికైన అభ్యర్థులు వాపోతున్నారు. అభ్యర్థులు చెబుతున్న దాని ప్రకారం, తమను ఎంపిక చేసిన సంస్థలు రెండేళ్లు గడిచినా ఉద్యోగాలకు పిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలు సాఫ్ట్‌వేర్ కంపెనీలతో ఉత్తుత్తి క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు నిర్వహించి, అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు ఇచ్చి మాయ చేస్తున్నాయని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ పరిస్థితి కేవలం కొన్ని కళాశాలలకు మాత్రమే పరిమితం కాదని, రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో ఇదే విధమైన ధోరణి నెలకొందని తెలుస్తోంది. ఇది విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

**రియల్-టైమ్ ఎక్స్‌పీరియన్స్ ఎక్కడ?**

ప్రస్తుతం కళాశాలల్లో బోధించే అంశాలకు, సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం చేసేటప్పుడు అవసరమయ్యే నైపుణ్యాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. వాస్తవానికి, కళాశాలల్లో సెమిష్టర్ విధానంలో ఒక కోర్సును ఆరు నెలల పాటు బోధించినప్పటికీ,



# సాఫ్ట్‌వేర్ యువత

విద్యార్థులు దాని నుండి నేర్చుకునేది దాదాపు సున్నా అని చెప్పొచ్చు. బీటెక్ పూర్తయిన తర్వాత కూడా చాలా మంది విద్యార్థులకు ఆయా అంశాల్లో సరైన నైపుణ్యం ఉండటం లేదు. దీనికి ప్రధాన కారణం, కళాశాలలకు, విద్యార్థులకు సరైన నైపుణ్యాన్ని అందించాలనే స్పృహ లేకపోవడమే. కళాశాలలు కేవలం పెద్ద పెద్ద జీతాలు వస్తాయని ప్రచారం చేసుకోవడంపైనే దృష్టి సారిస్తున్నాయి తప్ప, విద్యార్థుల నుంచి వసూలు చేసే భారీ ఫీజులకు తగిన న్యాయం చేయడం లేదు. కనీసం సాఫ్ట్‌వేర్ కంపెనీలలో రిక్రూట్‌మెంట్లు ఎలా జరుగుతాయి? ఇంటర్వ్యూలలో ఎలాంటి ప్రశ్నలు అడుగుతారు? ఎలాంటి నైపుణ్యాలు అవసరం? వంటి విషయాలపై కూడా విద్యార్థులకు సరైన అవగాహన కల్పించడం లేదు. సరైన మార్గదర్శకత్వం పొందిన ఒకరిద్దరు విద్యార్థులు మినహా, చదువులేని కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులకు నిరాశే మిగులుతోంది. వారికి సరైన దిశానిర్దేశం లేకపోవడం వల్ల ఉద్యోగ వేటలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి మారాలంటే, కళాశాలలు తమ బోధనా పద్ధతులను మార్చుకొని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**శిక్షణ పేరిట దందా**

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు నేర్చుకోవడానికి, చాలా మంది అభ్యర్థులు హైదరాబాద్‌లోని కోచింగ్ సెంటర్లకు వెళుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సరైన ఫ్యాకల్టీ లేకపోవడం వల్ల నాణ్యమైన శిక్షణ కోసం హైదరాబాద్‌కు వెళ్లక తప్పడం లేదు. ఆరు నెలల కోర్సులకు దాదాపు రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు ఫీజులు చెల్లించాల్సి వస్తోంది. ప్రతి నెలా హాస్టల్ ఖర్చుల కోసం మరో రూ. 10 వేలు అదనంగా వెచ్చించాల్సి వస్తుంది. ఇంత ఖర్చు చేసి కోర్సులు పూర్తి చేసినప్పటికీ, అక్కడ కూడా ఉద్యోగాలు లభించడం లేదు. కొంతమంది అభ్యర్థులు హైదరాబాద్‌లోనే ఉండి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుంటే, ఖర్చు భరించలేని వారు ఇళ్లకు తిరిగి వచ్చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి ఏటా 50 వేల మందికి పైగా విద్యార్థులు సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకోవడానికి హైదరాబాద్‌కు వస్తున్నారు.

**జాబ్ గ్యారెంటీ పేరుతో రూ. లక్షలు వసూలు**

ఈ పరిస్థితిని అదునుగా చేసుకుని, కొన్ని సంస్థలు "జాబ్ గ్యారెంటీ" పేరుతో విపరీతంగా ప్రచారం చేసుకుంటూ అందిన కాడికి దోచుకుంటున్నాయి. అభ్యర్థుల నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేసి, ఆ తర్వాత వారికి కొన్ని కఠినమైన పరీక్షలు పెడుతున్నాయి. ఆ పరీక్షలలో పాస్ అవ్వలేదనే సాకుతో రిక్రూట్ మెంట్‌లకు పంపడం సాధ్యం కాదని చెప్పి తప్పించుకుంటున్నాయి. ఇలాంటి సంస్థలలో ఆన్‌లైన్‌లో కోచింగ్ ఇచ్చేవే ఎక్కువగా ఉన్నాయి. పేరుకు "లైవ్ క్లాసులు" అని చెప్పినప్పటికీ, చాలా వరకు రికార్డెడ్ క్లాసులు ప్రసారం చేస్తున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో కనీసం ఐదు వందల మందిని చేర్చుకుని, వారికి కేవలం రికార్డెడ్ క్లాసులు వినిపిస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. ఈ మోసపూరిత కార్యకలాపాల వల్ల విద్యార్థులు ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారి నిస్సహాయతను ఆసరాగా చేసుకుని, కొన్ని సంస్థలు వినూత్న మోసాలకు తెరలేపుతున్నాయి. అలాంటి ఒక సంస్థ, ఏకంగా రూ. 3.50 లక్షల వరకు ఫీజు వసూలు చేస్తూ, అందుకు బదులుగా విద్యార్థులకు నెలకు పది వేల రూపాయల స్టైఫండ్ ఇస్తామని, ఆరు నెలల తర్వాత ఉద్యోగం కల్పిస్తామని ప్రచారం చేసుకుంటోంది. ఈ ఆకర్షణీయమైన మాటలు నమ్మిన కొందరు తల్లిదండ్రులు, తమ పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడి సంపాదించిన డబ్బును కట్టేసి పిల్లలను ఈ సంస్థలో చేరుస్తున్నారు. అయితే, ఈ సంస్థ వందల కొద్దీ విద్యార్థులను చేర్చుకుంటున్న తీరు చూస్తుంటే, గతంలో భారీ ఎత్తున ఫీజులు వసూలు చేసి దుకాణం ఎత్తేసిన అనేక మోసపూరిత సంస్థల జాబితాలో ఇది కూడా చేరుతుందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఒకవేళ ఇదే జరిగితే, ఆ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు తమ విలువైన సమయాన్ని, కష్టార్జితాన్ని భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది.

ఇప్పటికే నిరుద్యోగ సమస్యతో అల్లాడుతున్న యువతకు, ఇలాంటి మోసపూరిత సంస్థలు మరింత నైరాశ్యాన్ని కలిగించి, ఆర్థిక భారాన్ని మోపుతాయి. ఈ తరహా మోసాల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ఉద్యోగ హామీలు ఇచ్చే సంస్థల విశ్వసనీయతను క్షుణ్ణంగా పరిశీలించాలి, పూర్వ విద్యార్థుల అభిప్రాయాలు తీసుకోవాలి. ఒప్పందాలను జాగ్రత్తగా చదవాలి. ప్రభుత్వాలు కూడా ఇలాంటి మోసపూరిత సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి, తద్వారా నిరుద్యోగ యువత మోసపోకుండా కాపాడాలి. లేనిపక్షంలో, నిరుద్యోగులకు తీరని నష్టాన్ని మిగిల్చే అవకాశం ఉంది.

**కెరీర్ గ్యాప్ ప్రమాదం**

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం అభ్యర్థులు ఎలాగోలా నైపుణ్యాలను నేర్చుకుని, ఇంటర్వ్యూలకు హాజరయ్యేలోపే రెండు సంవత్సరాల కెరీర్ గ్యాప్ వచ్చేస్తోంది. దీనివల్ల వారికి ఫ్రెషర్లుగా ఇంటర్వ్యూలకు పిలవడం లేదు. ఇది వారిని తీవ్ర నిరాశలోకి నెట్టేస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఏటా సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఈ కెరీర్ గ్యాప్ కారణంగా ఉద్యోగాలు పొందలేక ఆగిపోతున్నారు. ఈ సంఖ్య చూస్తే సమస్య తీవ్రత అర్థమవుతుంది. సంవత్సరానికి 2 లక్షల మంది అదనంగా చేరుతున్నారు. ఇలా రానురాను ఈ సంఖ్య పెరిగిపోతోంది. ప్రభుత్వ ఉద్యోగాలకైతే కనీసం ఒక నిర్దిష్ట వయసు వరకు ఎంపికలు జరుగుతాయి. ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు 34 ఏళ్ల వరకు వయసు పరిమితి ఉంటుంది. బ్యాంకులు, రైల్వేల వంటి వాటికి 28 లేదా 30 ఏళ్ల వరకు వయసు పరిమితి ఉన్నప్పటికీ, సాఫ్ట్‌వేర్ రంగంలో దేశం మొత్తం చదివే అభ్యర్థులకు కెరీర్ గ్యాప్‌ను కేవలం రెండేళ్లకే పరిమితం చేయడం వారి జీవితాలను అస్తవ్యస్తం చేసే ప్రమాదం ఉంది. ఈ కెరీర్ గ్యాప్ సమస్య కుటుంబాల్లో తీవ్రమైన మానసిక క్షోభను కలిగిస్తోంది. ప్రతి గ్రామంలోనూ వందల సంఖ్యలో ఇలాంటి కుటుంబాలు ఉన్నాయి. తమ పిల్లలు ఉన్నత విద్య చదివి, ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉండటం చూసి తల్లిదండ్రులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. ఈ పరిస్థితి సమాజంలో అశాంతిని రేకెత్తిస్తోంది. ఈ సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకుంటే, అది కేవలం విద్యార్థుల భవిష్యత్తునే కాకుండా, మొత్తం సమాజ స్థిరత్వాన్ని కూడా ప్రమాదంలో పడేస్తుంది. ఇలాంటి తీవ్రమైన సామాజిక సమస్యలు ప్రభుత్వాలనే దించేసే ప్రమాదం ఉందని గుర్తించి, సాఫ్ట్‌వేర్ రంగంలో కెరీర్ గ్యాప్ నిబంధనలపై పునరాలోచించి, నిరుద్యోగ యువతకు అండగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

**భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌ను అభినందించకుండా ఉండలేం. చెదలు పట్టి సుమారు డెబ్బైనాలుగు సంవత్సరాలుగా నిరుపయోగంగా వేలాడుతున్న చెట్టును మోదీ, జైశంకర్ ద్వయం ఆసాంతం నరికేసింది. యునైటెడ్ నేషన్స్ మిలటరీ అబ్జర్వర్ గ్రూప్ ఇన్ ఇండియా అండ్ పాకిస్తాన్ (United Nations Military Observer Group in India and Pakistan) అనేది ఐక్యరాజ్యసమితికి సంబంధించిన పరిశీలక బృందం. ఈ బృందం ముఖ్య ఉద్దేశం భారత్, పాకిస్తాన్‌ల మధ్య చోటు చేసుకునే సైనిక ఘర్షణ మీద నిత్యం నివేదికలు ఇవ్వడం. ఎన్నో ఏళ్ల నుంచి నీళ్లు పోస్తున్నాం. కానీ ఇదొక విషం. అయినా ఎన్నో ఏళ్లుగా పోషిస్తున్నాం.. చివరకు మనపైనే పడబోతుంటే మోదీ ప్రభుత్వం కేవలం ముప్పై నిమిషాల్లో దేశం నుండి తరిమికొట్టింది.**




# 'సమితి' ధర్మస

1948లో నెహ్రూ కశ్మీర్ సమస్యని ఐక్యరాజ్య సమితికి అప్పగించిన ఫలితమే ఈ పరిశీలక బృందం రాక. సాక్షాత్తు ఐక్య రాజ్యసమితి దీనిని పంపించింది. ఈ బృందానికి ఒక కార్యాలయం ఏర్పాటు చేసి, జీత భత్యాలతో పాటు సకల సదుపాయాలు కల్పించింది. కానీ ఈ బృందం చేసినదేమిటి? కశ్మీర్ మీద నిత్యం అబద్ధాలను ప్రపంచం మీదకి సంధించడం. కశ్మీర్ వివాదంపై నిఘా దానిపని. కానీ, ఆ సంగతి మరచి ఈ సంస్థ భారతదేశానికి వ్యతిరేకంగా విదేశీ సెన్సార్ బోర్డులా మారింది.

జమ్ము కశ్మీర్ సమస్య భారత పాకిస్తాన్ మధ్య ఉన్నదే కాదు, చైనాకి కూడా భాగం ఉన్నది అంటూ రెండేళ్ల క్రితం ఈ పరిశీలక బృందం సమితికి ఒక నివేదిక ఇచ్చింది. అంతేకాకుండా, తమ కార్యకలాపాలకి భారత్ మాత్రమే కాదు, చైనా కూడా అడ్డంకులు కల్పిస్తున్నదంటూ ఫిర్యాదు చేసింది.

ఈ బృందం బహిరంగ వేదికలపై భారతదేశాన్ని అనేకసార్లు నిందించింది. కశ్మీరీ సమస్యను ద్వైపాక్షిక సమస్యగా కాకుండా త్రైపాక్షిక సమస్యగా చిత్రీకరించ డానికి ప్రయత్నించింది. అంతేకాదు, తమకు జీతభత్యాలు సరిపోవడం లేదని, ఆర్థిక సహాయాన్ని ఇంకా పెంచాలని కోరుతూ భారత ప్రభుత్వానికీ, ఐక్యరాజ్యసమితికీ వినతిపత్రం కూడా ఇచ్చింది. ఇది అన్నం పెట్టే యజమాని మీద కుక్క మొరగడం వంటిది.

జీతభత్యాలు చాలడం లేదని, అవి బాగా పెంచాలని అడగటంతో, ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పరిశీలక బృందంలోని నలభై మంది వీసాలు భారత విదేశాంగ శాఖ రద్దు చేసి, పది రోజులలో దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఈ బృందానికి జీతభత్యాలు ఐక్యరాజ్యసమితి బడ్జెట్ నుంచి వస్తాయి. మరి భారత్ అదనంగా ఈ నలభై మందికి ఎందుకు జీతాలు ఇస్తున్నది అన్నది ప్రశ్న. నిజానికి ఈ బృందానికి రెండు చోట్ల కార్యాలయాలు ఉన్నాయి. ఒకటి శ్రీనగర్‌లోని గుప్కార్ రోడ్‌లో(మే నుంచి అక్టోబర్) రెండు ఇస్లామాబాద్‌లో (నవంబర్ నుంచి ఏప్రిల్). ఇవి భారత్, పాక్‌లు నిర్మించినవే.

ఆ మధ్య శ్రీనగర్‌లోని బృందం లీలలు ఇంకా ఉన్నాయి. ఇక్కడి ఆఫీసును నిబంధనల్ని అతిక్రమించి కట్టారని నోటీసులు ఇచ్చింది అక్కడి మునిసిపాలిటీ. అంటే ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టారు. ఇక నలభై మందికి విలాసవంతమైన గృహాలు, వాహనాలు, పనివాళ్లు... చాలా సదుపాయాలు భారత ప్రభుత్వమే భరిస్తోంది, ఈ డెబ్బైనాలుగు ఏళ్లుగా. ఇవి కాక ఇతర భత్యాలు తడిసిమోపెడు. వ్యక్తిగత వాహనాలతో పాటు సరిహద్దుల దగ్గరకి వెళ్లిరావడానికి మిలటరీ వాహనాలు సమకూర్చాలి. వీటి డీజిల్, ఇతర నిర్వహణ ఖర్చులు భారీగానే ఉంటాయి. వీటినే ఇంకా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరిగాక ప్రతిఫలం ఏమిటి? మనకు వ్యతిరేకంగా ప్రకటనలు, నివేదికలు, అంతర్జాతీయ వేదికలపై భారతదేశ ప్రతిష్టను దిగజార్చడం. ఇపుడు దీనికే స్వస్తి పలికారు.

ఐరాస నివేదిక వచ్చిన ప్రతిసారీ భారతదేశాన్ని ఇరికించే ప్రయత్నం జరిగింది. ఇపుడు మోదీ ప్రభుత్వం సదరు బృందానికి వీధి తలుపు చూపించింది. ఇది చివరి బ్రిటిష్ జెండాను తొలగించిన క్షణం లాంటిది. నేటికీ దేశంలోని 99% మందికి ఐక్యరాజ్యసమితి పేరుతో బ్రిటిష్ వారి నీడ మనదేశంలో ఉందని తెలియదు. దాదాపు డెబ్బైనాలుగు ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని పనిని మోదీ ప్రభుత్వం ముప్పై నిమిషాల్లో చేసింది. నిశ్శబ్దంగానే అయినా నిర్ణయాత్మకంగా దాడి చేసింది. ఇది కేవలం ఒక కాగితం మీద జరిగిన పని కాదు. ఇది సాంస్కృతిక, దౌత్య, మానసిక స్వాతంత్ర్యానికి చిహ్నం.

1971 బాంగ్లా విముక్తి సందర్భంగా భారత సైన్యం కదలికలను అమెరికాకు చేరవేసినది ఈ పరిశీలక బృందమే. అప్పట్లో ఇప్పుడున్నటువంటి హైరిజుల్యూషన్ ఫోటోలు తీసే ఉపగ్రహాలు లేవు, అమెరికా దగ్గర. కాబట్టి పరిశీలక బృందం ఇచ్చిన సమాచారమే కీలక పాత్ర పోషించింది. అమెరికా తన ఏడవ నావికా దళాన్ని పాకిస్తాన్‌కు సహాయంగా






# ...త్రానికి తాళం

పంపడానికి ప్రయత్నించడం, దానిని అప్పటి సోవియట్ యూనియన్ విఫలం చేయడం చరిత్ర. ఆక్రమిత కశ్మీర్‌లో కొంత భాగాన్ని పాకిస్తాన్ చైనాకి దానం చేసిన సంగతి తెలిసిందే. కానీ ఇందులో చైనాను కలపడం దేనికీ? భారత్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటే పాకిస్తాన్ దానం చేసిన భూమి కూడా సాంకేతికంగా మన అధీనంలోకి వచ్చినట్లే. దానిపై చైనా స్పందనను బట్టి భారత్ ప్రతిస్పందన ఉంటుంది. అంతే కానీ సమస్య భారత్ పాకిస్తాన్‌ల మధ్య అయితే చైనాని పార్టీగా చేయడంలో పరిశీలక బృందం వ్యూహం ఏమిటో అర్ధమవుతోంది కదా! వీళ్ల ఉద్దేశం కశ్మీర్ అంశాన్ని మరింత జటిలం చేయాలి. దానికిగాను చైనాని కూడా ఇంకో పార్టీగా చేరిస్తే సరి. మొన్నటి ఎన్నికలకు ముందు ఈ పరిశీలక బృందం మరో చిచ్చుపెట్టే పని చేయబోయింది.

అది పసిగట్టిన మోదీ, జైశంకర్ వెంటనే వీళ్లని దేశం వదిలి పెట్టి పొమ్మని ఆదేశించారు. ఇరాన్–ఇరాక్, ఇజ్రాయిల్–పాలస్తీనా, టర్కీ–సైప్రస్, దక్షిణ కొరియా–ఉత్తర కొరియా, చైనా–సరిహద్దు ఏడు దేశాలు. వాటితో ఉన్న సమస్యల విషయంలో ఇలాంటి పరిశీలక బృందాలు ఏర్పాటు చేయలేదు ఇంతవరకు? మరి కశ్మీర్ విషయంలో ఎందుకు?

డెబ్బై నాలుగేళ్ల క్రితం నెహ్రూ నాటిన విషపు మొక్క పెరిగి మహావృక్షంలా మారి చెదలు పట్టి, ఆ చెదలు పక్కన ఉన్న మంచి చెట్టుకు పాకి వాటి నాశనానికి కారణం అవుతూ వస్తున్నా, ఇంతవరకు ఏ ప్రభుత్వం ధైర్యంగా ఆ చెట్టుని సమూలంగా నరికివేయడానికి ముందుకు రాలేదు. ఈ బృందాన్ని వెనక్కి వెళ్లమని వాళ్ల వీసాలు రద్దు చేయడం అనేది ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన చర్య.

ఇప్పుడు భారతదేశంలో కూర్చున్న ఏ విదేశీ సంస్థ కూడా భారతదేశానికి మనం ఏమి చేయాలో, ఏమి చేయకూడదో నేర్పించదు. ఇప్పుడు భారతదేశం తన భూమిపై ఎవరు నివసించాలో, ఎవరు నివసించకూడదో స్వయంగా నిర్ణయించుకుంటుంది. ఇది ఆంగ్లేయుల నీడ చివరి అవశేషం. దానిని కూడా మనం పెకిలించి వేశాం. ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నది కాబట్టే పురోగతి విషయంలో చరిత్రాత్మక మైన మైలురాళ్లు కనిపిస్తున్నాయి.

మీకు తెలుసా? ప్రపంచంలో విద్యుత్ మీద నడిచే రైలు వ్యవస్థల్లో ఇప్పుడు చైనా, రష్యా, అమెరికా, జర్మనీ దేశాలను దాటుకుని భారత్ ప్రథమ స్థానం చేరుకుంది. భారతదేశం "ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ రైల్వే నెట్వర్క్"గా నెంబర్ వన్ స్థానం సంపాదించింది. ఇది ఎలా సాధ్యపడిందో, భారతదేశంలో రైల్వే విద్యుదీకరణ గురించి తెలుసుకుందాం. దీనిని రూట్ కిలోమీటర్లుగా లెక్కిస్తారు.

స్వతంత్ర భారత్ పాలనను మూడు కాలాలుగా విభజించుకుంటే, అంటే... 1947 నుంచి 2004 వరకూ, 2004 నుంచి 2014 వరకూ, 2014 నుంచి 2024 వరకు జరిగిన అభివృద్ధిని పరిశీలిస్తే...

1) 1947 నుండి 2004 వరకూ ఏభైఏడు సంవత్సరాలు, భారతీయ రైల్వేలు దాదాపు 17,508 కిలోమీటర్లు బ్రాడ్ గేజ్ నెట్‌వర్క్‌ను విద్యుదీకరణ పని పూర్తి చేసుకున్నాయి. అంటే సగటున 307 కిలోమీటర్లు.

2) 2004 నుండి 2014 వరకూ అనగా పది సంవత్సరాలు దాదాపు 3,995 కిలోమీటర్లు అదనంగా విద్యుదీకరించారు. మొత్తం 21,413 కిలోమీటర్లు 2014 నాటికి సాధించారు. అంటే సగటున సంవత్సరానికి 390 కిలోమీటర్లు.

3) ఇక 2014 నుండి 2024 వరకూ రైల్వే విద్యుదీకరణ అంటే పది సంవత్సరాలలో మొత్తం బ్రాడ్–గేజ్ నెట్‌వర్క్‌లో 45,435 కి.మీ. మొత్తం 66,848 కి.మీ.విద్యుదీకరణ జరిగింది. అంటే దాదాపు 96% రైల్వే నెట్ వర్క్ విద్యుదీకరణ జరిగింది. క్లుప్తంగా చెప్పాలంటే 1947–2004 (57 సంవత్సరాలు) 17508 కిలోమీటర్లు. (సంవత్సరానికి సగటున 307 కి.మీ) 2004–14 (పది సంవత్సరాలు) 3905 కిలోమీటర్లు. (సంవత్సరానికి సగటున 391 కిలోమీటర్లు). 2014–2024( పది సంవత్సరాలు) 45,435 కిలోమీటర్లు. (సంవత్సరానికి సగటున 4,544 కిలోమీటర్లు), అంటే మన్‌మోహన్ పాలనాకాలంతో పోలిస్తే సుమారు పన్నెండు రెట్లు వేగంగా రైల్వే విద్యుదీకరణ జరిగింది.

మోదీ ప్రభుత్వ హయాంలో ఈ విషయంలో ఇంత అభివృద్ధి ఎలా సాధ్యమైంది? అని ప్రశ్నించుకుంటే – ఈ ప్రభుత్వం "Mission 100%

**సుమారు డెబ్బై నాలుగేళ్ల క్రితం నెహ్రూ నాటిన విషపు మొక్క పెరిగి మహావృక్షంలా మారి చెదలు పట్టి, ఆ చెదలు పక్కన ఉన్న మంచి చెట్టుకు పాకి వాటి నాశనానికి కారణం అవుతూ వస్తున్నా, ఇంతవరకు ఏ ప్రభుత్వం ధైర్యంగా ఆ చెట్టుని సమూలంగా నరికివేయడానికి ముందుకు రాలేదు. ఈ బృందాన్ని వెనక్కి వెళ్లమని వాళ్ల వీసాలు రద్దు చేయడం అనేది ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన చర్య.**

Electrification": అనే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని central Organisation for railway electrification (CORE) ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టింది. ఇది 2030 నాటికి "Net zero carbon railway" లక్ష్యంతో సమన్వయం చేశారు. మన్‌మోహన్ పాలనలో (2004 – 2014) ఇలాంటి స్పష్టమైన, దీర్ఘకాలిక లక్ష్యం లేదు. మోదీ పాలనలో 2024 నాటికి 96% బ్రాడ్– గేజ్ నెట్‌వర్క్‌ను విద్యుదీకరించారు. మన్‌మోహన్ పాలనలో కేవలం 32% నెట్‌వర్క్‌ను విద్యుదీకరించారు. విద్యుద్దీకరణ వలన లాభాలు.. విద్యుదీకరణ ద్వారా రైల్వేల ఇంధన ఖర్చు తగ్గింది. సంవత్సరానికి రైల్వేకు రూ.10,500 కోట్లు ఆదా అవుతున్నది. డీజిల్ దిగుమతులపై ఆధార పడటం తగ్గింది. పర్యావరణ సమస్యలను పరిష్కరించడంలో భారతదేశం ప్రపంచ నాయకుడిగా ఉద్భవించింది.

మిషన్ 100% విద్యుదీకరణ అనేది చాలా సవాలుతో కూడిన ప్రాజెక్టు. ఎందుకంటే ఇందులో రైళ్లు నడుస్తూ బిజీగా ఉన్న రైల్వే లైన్లను విద్యుద్దీకరించడం అంటే పని చేయడానికి దొరికే సమయం చాలా తక్కువగా ఉంటుంది.అందుకే, అందరూ కోవిడ్‌ను చూసి భయపడితే, మోదీ ప్రభుత్వం కోవిడ్‌ను కూడా తనకు అనుకూలంగా మార్చుకుని పాత రైల్వే ట్రాక్స్ తీసి కొత్తవి వేయడం, విద్యుదీకరణ భారీ ఎత్తున చేపట్టింది.



**అయ్యలసోమయాజుల సుబ్రహ్మణ్యము**
**9394743591**

# శర్మిష్టతో

**‘శర్మిష్ట గురించి మాట్లాడిన పవన్ కళ్యాణ్ అమెరికాలో యూనివర్శిటీ నుంచి బహిష్కరణకు గురైన మేఘా వేమూరి గురించి ఎందుకు మాట్లాడడం లేదు. పాలస్తీనా మీద దాడి చేస్తున్న ఇజ్రాయిల్‌తో ఒప్పందం చేసుకోవడం మీద నిలదీసిన తెలుగు మూలాలున్న విద్యార్థినిని బహిష్కరిస్తే ఎందుకు మాట్లాడడం లేదు..’ అని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను ఓ వామపక్ష విశ్లేషకుడు ప్రశ్నించారు. ఆ విశ్లేషకుడి మాటలు వింటే “నాజీ పార్టీలో గోబెల్స్ తర్వాత అంత ప్రాపగాండ మీ కమ్యూనిస్టులు తప్ప ఈ ప్రపంచంలో ఎవరూ చేసుండరు’ అన్న ఓ సినిమాలో డైలాగ్ గుర్తొస్తుంది. యువత నక్సలిజంలో చేరడానికి వామపక్ష మేధావుల ప్రభావమే కారణమన్నది వాస్తవం. అలా వామపక్ష ప్రభావితురాలే మేఘా వేమూరి అయి ఉండవచ్చు. ముందుగా మేఘ గురించి తెలుసుకుందాం..**

జాతీయ మీడియా సమాచారం ప్రకారం... భారతీయ మూలాలు గల తెలుగు కుటుంబానికి చెందిన విద్యార్థిని మేఘా వేమూరి. అమెరికాలోని జార్జియాలో ఆల్ఫారెట్టాలో పుట్టి పెరిగిన వేమూరి ఆల్ఫారెట్ట హై స్కూల్‌లో చదివారు. మేఘా 2021లో మసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మిట్)లో చేరి గ్రాడ్యుయేషన్ చేశారు. ఆమె క్లాస్ ప్రెసిడెంట్‌గా కూడా ఉన్నారు. మే 29న జరిగిన కార్యక్రమంలో ఆమె పాలస్తీనాకు మద్దతుగా ఎర్రటి కెఫియే అనే సాంప్రదాయ స్కార్ఫ్ ధరించి, పాలస్తీనా అనుకూల ప్రసంగం చేయడంతో పాటు విశ్వవిద్యాల యాన్ని విమర్శించారు.

మే 30న జరగాల్సిన అండర్ గ్రాడ్యుయేట్ ప్రారంభోత్సవంలో ఆమె మార్షల్‌గా ఉండాల్సి ఉంది. కానీ ఆమెతో పాటు కుటుంబాన్ని కూడా కళాశాల క్యాంపస్ నుంచి నిషేధిస్తూ మిట్ ఛాన్సలర్ మెలిస్సా నోబుల్స్ ప్రకటించారు. భావస్వేచ్ఛ హక్కును తాము అంగీకరిస్తున్నప్పటికీ యూనివర్శిటీ వేదికను రాజకీయ నిరసన కార్యక్రమానికి వాడుకోవడాన్ని వర్శిటీ అధికారులు తప్పుబట్టారు.



**ఇజ్రాయెల్‌పై దాడి.. కిడ్నాప్..**

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడికి సంబంధించి అవగాహన లోపం కానీ, లేక తప్పుడు ప్రచారాలను వాస్తవంగా భ్రమిస్తూ కానీ మేఘ ఉండాలి. 2023 అక్టోబర్ 7న స్థానికులు ఉత్సవం జరుపుకుంటున్న వేళ హమాస్ ఉగ్రవాదులు రాకెట్లు పేల్చి ఇజ్రాయెల్‌లో చొరబడి కాల్పులు జరిపి అమాయకులను పొట్టనబెట్టుకున్నారు. ఈ దాడిలో సుమారు 1200 మంది పైగా మృత్యువాతపడ్డారు. వారిలో వందలాది మంది ఇజ్రాయిలీలు, అనేక మంది విదేశీయులతో పాటు భద్రతా దళాల సిబ్బంది ఉన్నారు. 251 మంది ఇజ్రాయెల్ పౌరులను, సైనికులను బందీలుగా తీసుకువెళ్లారు. ఇప్పటికీ 58 మంది బందీలుగా ఉన్నారన్న వాస్తవం గుర్తించాలి.

**వివస్త్రను కారులో తిప్పుతూ...**

ఇజ్రాయెల్‌పై దాడి చేసిన హమాస్ ఉగ్రవాదుల అకృత్యాలు నాటి పత్రికల్లో పతాక శీర్షికలుగా వచ్చాయి. ఆ వార్తలు ఆందోళన, ఆవేదన కలిగించాయి. కనిపించిన వారిని కాల్చి చంపుతూ మహిళలపై లైంగిక దాడులకు పాల్పడ్డారు. ఓ మహిళ బట్టలు చించేసి.. వివస్త్రను చేసి కారులో తీసుకుని వెళ్లారు. తమ చేతుల్లో ఉన్న ఆయుధాలను చూపిస్తూ వీడియోలు తీసుకుంటూ పాశవికంగా ప్రవర్తించారు. వివస్త్ర మహిళ చేతులు వెనక్కు కట్టి కారులో పడేసి ఆమెను కాళ్లతో తొక్కుతూ తన్నుతూ సాగిన వీడియో ఆవేదనకు గురి చేసింది. పసిపిల్లలను కూడా కాల్చి చంపేశారు. సైనికులను బందీగా చేసుకుని వారిని నేలపై ఈడ్చుకుంటూ తీసుకెళ్లిన వీడియోలు బయటికి వచ్చాయి. హమాస్ ఉగ్రవాదులు ఎత్తుకెళ్లిన వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలే ఉన్నట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఈ మేరకు అక్కడి ఎన్జీవో ‘ఇజ్రాయెల్ వార్ రూమ్’ పేరుతో ట్విటర్‌లో వెల్లడించింది. ఇజ్రాయెల్‌లో అపహరణకు గురైన మహిళల ఫొటోలను కూడా ట్విటర్‌లో ఉంచింది. కావాలనే హమాస్ ఉగ్రవాదులు ఎక్కువ మంది మహిళలను అపహరించినట్లు తెలుస్తోందని పేర్కొంది. వారిపై అత్యాచారం అనే ఆయుధాన్ని ఉపయోగిస్తున్నాయని స్పష్టం చేసింది.



శర్మిష్ట

**బందీల విడుదల**

గాజా స్ట్రిప్‌లో ఇద్దరు ఇజ్రాయెల్ బందీలు సజీవంగా ఉన్నట్లు హమాస్ సాయుధ విభాగం గత నెలలో ఒక వీడియోను విడుదల చేసింది. 2023 అక్టోబరు దాడి సమయంలో వారిని ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. ఇజ్రాయెల్ సైన్యం బందీలను విడిపించిన ప్రాంతంలో 2014 యుద్ధంలో మరణించిన ఇజ్రాయెల్ సైనికుడి అవశేషాలు లభ్యమయ్యాయి. గాజాలో ఇంకా 58 మంది బందీలుగా ఉన్నారు.

**ఎందుకీ సానుభూతి?**

‘వారు యుద్ధం ప్రారంభించారు, మేం ముగిస్తామని’ నెతన్యాహు ఘటన జరిగిన వెంటనే పేర్కొన్నారు. నాడు ఇజ్రాయెల్ ప్రారంభించిన దాడి నేటికీ కొనసాగుతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటి

# మేఘకు పోలికా?

వరకూ 54,418 మంది మరణించగా, 1,24,190 మంది గాయపడ్డారని, గత 10 వారాల్లోనే 3,901 మంది మరణించినట్లు హమాస్ నేతృత్వంలోని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉగ్రవాదం అంతానికి ఇజ్రాయెల్ యుద్ధం సాగిస్తోంది.

ఈ దాడిలో ఉగ్రవాదుల అడ్డాగా ఉన్న గాజాలో పలువురు అమాయకులూ మరణిస్తున్నారు. వారి పట్ల సానుభూతి కనబర్చే మేధావులు, ర్యాలీలు నిర్వహించే ప్రజాసంఘాల నాయకులు, వారి ప్రసంగాలకు ప్రభావితమయ్యే మేఘ వంటి వారు ఏ రోజయినా



అమాయక మహిళలను కిడ్నాప్ చేసి బందీలుగా ఉంచి అఘాయిత్యాలకు పాల్పడిన హమాస్ ఉగ్రవాదుల చర్యలను తప్పుబట్టారా? బేషరతుగా బందీలను విడిచిపెట్టాలని ర్యాలీలు నిర్వహించారా? దాడి జరిగిన రోజు వివస్త్రగా హింసకు గురైన ఆ అమాయకురాలి కోసం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారా? హమాస్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కోసం సంతాప సభ నిర్వహించారా? ఇజ్రాయెల్‌లో చనిపోయిన చిన్నారులు, పౌరుల ప్రాణాలకు విలువలేదా? వీటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆ విశ్లేషకుడు, ప్రొఫెసర్లపై ఉంది. ట్రంప్ వాచాలత్వంతో పోల్చి మేఘకు వాక్ స్వాతంత్ర్యంగా పేర్కొనడంలో ప్రొఫెసర్ స్థాయి, విలువ తెలుస్తోంది.

**మానవత్వం అంటే ఏమిటి?**

'గాజాను ఇజ్రాయెల్ దిగ్బంధం చేసింది. ఇప్పటికే మరుభూమిగా మారిన గాజాలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. గాజాకు సరుకులు అందే అన్ని మార్గాలను ఇజ్రాయెల్ కొన్ని నెలలుగా మూసి వేసింది. చరిత్రలో అతిపెద్ద మానవ విషాదంగా పశ్చిమాసియా భూభాగంలో గాజా ఇప్పుడు కనిపిస్తున్నది. కొన్ని నెలలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణ హోమానికి స్త్రీలు, పిల్లలు కూడా బలికావడం ఒక ఎత్తయితే, వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. వారికి తాగేందుకు నీరుకూడా లేదు. రఫాలో నిర్వాసితులను ఆదుకునేందుకు అమెరికా మద్దతుతో సహాయ కేంద్రాన్ని తెరిచినా, అక్కడి పరిస్థితులను అదుపు చేసే మిషతో ఇజ్రాయెల్ దళాలు వారిపై కూడా విచక్షణారహితంగా కాల్పులు జరిపాయి...' అంటూ కన్నీరు మున్నీరయ్యే మానవతావాదులు, ఇంకా హమాస్ చెరలో మగ్గుతున్న వారి కోసం ఎందుకు నోరు విప్పరు. 'సెక్యులరిజం ఈజ్ నాట్ వన్ వే' అని పవన్ అన్నట్టు, మానవత్వం కూడా ఒకవైపే ఉండకూడదు. అలా ఉంటే అది మానవత్వం కాదు.. దానవత్వమవుతుంది.

**మేఘను ఎందుకు సమర్థించాలి?**

శర్మిష్టకు, మేఘకు పోలిక ఎందుకు? శర్మిష్ట క్లిష్ట సమయంలో తన దేశం కోసం గళం విప్పింది. తనను తీర్చిదిద్దిన విద్యాసంస్థ నిర్వహించే ఒక వేడుకలో ఆ సంస్థను అప్రతిష్టపాల్జేసింది మేఘ. హిందూ మహిళల నుదుటి సిందూరం తుడిచేసిన ముష్కరుల దుశ్చర్యను తప్పుపట్టింది శర్మిష్ట, అమాయక మహిళలపై లైంగిక దాడులకు పాల్పడి వివస్త్రను నడిరోడ్డుపై చిత్రహింసలకు గురిచేసిన ఉగ్రవాదులను సమర్థించింది మేఘ. ఏ కోణంలో చూసినా ఇద్దరూ భిన్న ధ్రువాలే! బాధితుల తరపున శర్మిష్ట, తప్పు చేసినవారి తరపున మేఘ. పోలిక ఎక్కడ? 'పాలస్తీనా మన రాక కోసం వేచి ఉందనడం ద్వారా తోటి విద్యార్థులకు ఆమె ఏం సందేశం ఇస్తోంది. అందుకే మేఘ మాట్లాడడం పూర్తయిన వెంటనే, మిట్ అధ్యక్షురాలు సాలీ కార్న్‌బ్లుత్ ఆ వేదిక మీద నుంచే, 'తాము భావప్రకటన స్వేచ్ఛను గౌరవిస్తాం.. కానీ ప్రస్తుత కార్యక్రమం గ్రాడ్యుయేట్ల గురించి' అని చెప్పారు. పాలస్తీనాకు మద్దతుగా మాట్లాడుతున్నట్లుగా కూడా ఆమె తమకు తెలియజేయలేదని మిట్ ప్రతినిధులు చెప్పుకోవాల్సి వచ్చింది.

ఇక్కడే కాదు, ఆమెను నమ్మి ఏ సంస్థ అయినా కీలక, నాయకత్వ బాధ్యతలు అప్పగించగలదా?



మేఘ

విశ్వసనీయత, విలువల్లేని ఆమెను ఎలా విశ్వసించ గలరు? తిన్నింటి వాసాలు లెక్కపెట్టేలా మేఘా తీరు ఉందన్నది వాస్తవం. భారతీయ మూలాలున్న ఆమె, బాంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనార్టీలపై జరిగిన మారణకాండ గురించి ఎందుకు మాట్లాడ లేదో ఆ విశ్లేషకుడు చెప్పగలడా? ఆ వామపక్ష విశ్లేష కుడి వంటి వారు తప్ప ఇతరులెవరూ మేఘను సమర్థించరు. శభాష్ శర్మిష్ట అని మరోసారి అనాల్సిందే!

**చివరి మాట...**

ఇంతకీ శర్మిష్టపై కేసు పెట్టిన వజహత్ ఖాన్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. హిందువులను, హిందూ దేవతలను అసభ్యపదజాలంతో దూషిస్తూ అతను సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని కోల్‌కతా పోలీసులకు శ్రీ రామ్ స్వాభిమాన్ పరిషత్ ఫిర్యాదు చేసింది. 1500 కిలోమీటర్లు వెళ్లి శర్మిష్టను అరెస్టు చేసిన కోల్‌కతా పోలీసులకు వజహత్‌ఖాన్ కనిపించడం లేదట. అతనిపై మూడు రాష్ట్రాల్లో ఇటువంటి కేసులు నమోదయ్యాయి. మరి వజహత్‌ఖాన్ గురించి మాట్లాడతారా ఈ పక్షపాత విశ్లేషకులు! తప్పుని చెబుతారో.. చట్టం తన పని తాను చేస్తుందంటారో!



**హేమచందర్ కొలిపాక**

సీనియర్ జర్నలిస్ట్, 94400 21108

# కష్టాల కడలిలో ప్రైవేట్ బోధన సిబ్బంది

**ఆ మధ్య వచ్చిన ఒక చలనచిత్రంలో ఓ ఊరి పెద్దకు, ఆ ఊరిలోని ఒక వైద్య కళాశాల యాజమాన్యానికి మధ్య జరిగే సంభాషణలో, ఆ ఊరి పెద్ద ఇలా అంటాడు.. 'డబ్బు సంపాదించుకోవాలంటే వెళ్లి సారా కొట్టు పెట్టుకో, చదువుతో వ్యాపారం చెయ్యకు' అని. ఇది అక్షరాలా నిజం. ఇదే భావన మన భారతీయ తత్వంలో ఇమిడి ఉంది. పురాతన కాలం నుంచి భారతదేశంలో విద్యను ఎప్పుడూ వ్యాపార దృష్టితో చూడలేదు. అందుకే డబ్బు ప్రమేయం లేకుండా మంచి విద్యను అభ్యసించే అవకాశం విద్యార్థులకు లభించింది.**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో చాలా పెద్ద ఎత్తున ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను, విశ్వవిద్యాలయాలను స్థాపించి, వాటి ద్వారా అనేకమంది విద్యార్థులకు విద్యను చేరువ చేసింది. అయితే ఈ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాలు క్రమంగా లోపించసాగాయి. బోధన సిబ్బంది కొరత, ఉన్న వారిలో క్రమశిక్షణ లేమి, పాఠశాలలకు అవసరమైన నిధులు మంజూరు కాకపోవడం.. లాంటివి ఈ విద్యాసంస్థల పట్ల విద్యార్థుల తల్లిదండ్రుల ఆసక్తి క్రమేణా సన్నగిల్లింది. ఇదే అదనుగా, నాణ్యమైన విద్యను అందిస్తామంటూ ప్రైవేట్ విద్యాసంస్థలు ఆరంభ మయ్యాయి. అలా ప్రభుత్వ పాఠశాలలను అధిగమించి, పూర్తి గుత్తాధిపత్యం సాధించాయి. విద్యను వ్యాపారం చేసి, విపరీతమైన ఫీజు, పుస్తకాలకు యూనిఫామ్‌కు అంటూ అనేక రకాలుగా అత్యధిక మొత్తంలో పిల్లల తల్లిదండ్రులను లూటీ చేస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో సాధారణ ప్రైవేటు పాఠశాలలో ఒక విద్యార్థి సంవత్సరానికి సగటు రూ.70 వేల నుంచి రూ. 80 వేలు ఫీజుగా చెల్లించాల్సి వస్తోంది. ఇతర రుసుములతో కలిపి అది రూ. లక్ష వరకు అవుతుంది. దేశంలోని అన్నీ ప్రముఖ పట్టణాలలో ఇదే పరిస్థితి. తల్లిదండ్రులు ఎంతో ఒత్తిడిని తట్టుకొంటూ, గత్యంతరం లేక వారి పిల్లలను ఇక్కడే చదివించాల్సిన పరిస్థితి.

పాఠశాలల తర్వాత కాలేజీ విద్యాభ్యాసం మరీ కష్టతరమవుతోంది. మరోవంక ప్రభుత్వ కళాశాలలు వెలవెలబోతున్నాయి. ఒక్క కళాశాలలో కూడా విద్యార్థులు; అధ్యాపకులు కూడా కనిపించరు. ఆకాశాన్నంటే ఫీజుతో, ప్రైవేటు కళాశాలలు విద్యార్థులను రకరకాలుగా ఆకర్షిస్తూ, చేరిన తర్వాత వారి మీద విపరీతమైన ఒత్తిడి పెంచుతోంది. కేవలం అందుకు కారణం. కాగా, అక్కడి బోధన సిబ్బంది పరిస్థితి మరీ దారుణం. వారి నెల జీతం రూ. పదిహేను వేలు ఉండటం లేదు. అదీ ఒకేసారి కాకుండా, మూడు నాలుగు నెలలకోసారి ఇస్తారు. కొన్ని కళాశాలలు అధిక వేతనాలు ఇస్తున్నట్లు చూపించుకొనేందుకు, నెల మొదట్లో ఎక్కువ జీతం ఇచ్చి, వారం తర్వాత అందులో ఎక్కువ భాగాన్ని తిరిగి తీసుకొంటున్నారు. ప్రభుత్వం నుంచి అక్రిడిటేషన్ సంస్థలు వచ్చినప్పుడు, వారికి రికార్డుల్లో తప్పుడు సమాచారాన్ని చూపిస్తూ పబ్బం గడుపుకొంటున్నారు. కాగా గత పదేళ్లలో, రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపుగా 40 ఇంజినీరింగు కళాశాలలు మూతబడ్డాయి.



మన రెండు తెలుగు రాష్ట్రాల్లో వందల మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే, ఒత్తిడికి పెరిగిందనేందుకు వేరే ఉదాహరణ అవసరం లేదు. ఈ సంస్థల్లో బోధన సిబ్బంది పరిస్థితి మరీ దయనీయం. వారు చదువు చెప్పడంతో పాటు, విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియలో కూడా భాగస్వాములు కావలసి ఉంటుంది. 'ఇంతమందిని చేర్పిస్తేనే నీ ఉద్యోగం ఉంటుంది' అంటూ భయాందోళనల పాలు చేయడం సర్వ సాధారణం. ఒక తరగతికి 100 నుంచి 150 మంది విద్యార్థులకు, ఒక బోధకుడు వరసగా 3 లేక 4 క్లాసులను చెప్పాల్సి ఉంటుంది. అయినప్పటికీ, వారికి దక్కే ప్రతిఫలం అంతంత మాత్రమే. ప్రైవేటు అనుబంధ ఇంజినీరింగు కళాశాలల్లోనూ అదే దయనీయత. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులు మాత్రమే పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం లభించడమే

దేశంలో గత 30 ఏళ్లుగా ప్రైవేటు రంగంలో విశ్వ విద్యాలయాలను నెలకొల్పుతుండగా, పదేళ్లుగా ఈ ప్రక్రియ దేశంలో బాగా వేగవంతమైందని చెప్పాలి. కొన్ని ప్రైవేటు విశ్వవిద్యాలయాలు నియమ నిబద్ధతతో నడుపుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నాయని చెప్పటంలో ఏ మాత్రం సందేహం లేదు. అయితే, వ్యాపార దృక్పథంతో స్థాపితమైన విశ్వవిద్యాలయాలు విద్యార్థులు, అధ్యాపకుల పాలిట శాపాలుగా పరిణమించాయి. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల సంగతిని ఒకసారి పరిశీలిస్తే... గత కొన్నేళ్లుగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను పట్టించుకొనే ప్రభుత్వమే కరువయ్యిందని చెప్పాలి. కొన్ని రోజుల క్రితం, ఆంధ్రప్రదేశ్‌లోని పలు విశ్వవిద్యాలయాలకు కొత్తగా ఉప కులపతులు నియమితులు కావడాన్ని బట్టి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆయా విశ్వవిద్యాలయాలను గాడిలో పెట్టాలని

దేశంలో గత 30 ఏళ్లుగా ప్రైవేటు రంగంలో విశ్వ విద్యాలయాలను నెలకొల్పుతుండగా, పదేళ్లుగా ఈ ప్రక్రియ దేశంలో బాగా వేగవంతమైందని చెప్పాలి. కొన్ని ప్రైవేటు విశ్వవిద్యాలయాలు నియమ నిబద్ధతతో నడుపుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నాయని చెప్పటంలో ఏ మాత్రం సందేహం లేదు. అయితే, వ్యాపార దృక్పథంతో స్థాపితమైన విశ్వవిద్యాలయాలు విద్యార్థులు, అధ్యాపకుల పాలిట శాపాలుగా పరిణమించాయి.

చూస్తోందనే అభిప్రాయం కలుగుతోంది. ఆ రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వ విద్యాలయాలలో 4330 అధ్యాపకులకుగాను కేవలం 1048 మందే ఉన్నారని ఒక వార్త పత్రిక కథనం. దీనిని బట్టి 75 శాతం బోధనా సిబ్బంది కొరతతో నడుస్తున్నాయని అర్థం అవుతోంది.

ఇక ప్రైవేటు విశ్వవిద్యాలయాల ప్రస్తావనకు వస్తే, వీటి గురించి బాగా వింటున్నాం. తమిళనాడులో ఇలాంటి విశ్వవిద్యాలయాలున్నాయి. కాగా, మన తెలుగు రాష్ట్రాల్లో కూడా కొన్ని ప్రైవేటురంగ విశ్వవిద్యాలయాలున్నాయి. బయటకు ఈ యూనివర్సిటీల గురించి బాగా వింటున్నా, వీటి అసలు స్వరూపం అక్కడి బోధన సిబ్బందికే బాగా



తెలుసు. కొన్ని రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయం, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఒక అక్రిడిటేషన్ సంస్థతో చేస్తున్న లాలూచి ప్రయత్నాలు బట్టబయలు కావడంతో, ఆ కేసు సీబీఐ పరిధిలోకి వెళ్లడం విదితమే. అక్రిడిటేషన్ సంస్థలు తనిఖీలకు వచ్చినప్పుడు, తాము సక్రమంగా నడిపిస్తున్నామని చెబుతూ దాటవేస్తున్నారు. అధ్యాపక, విద్యార్థి నిష్పత్తిని పాటించటం లేదు. విద్యార్థులు అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా, ఇబ్బడి ముబ్బడిగా సీట్లు పెంచేసుకొని, సౌకర్యాలున్నా లేకపోయినా, ఎక్కువమంది విద్యార్థులను చేర్చుకొని వారిని రకరకాల ఇబ్బందుల పాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ పనిచేస్తున్న అధ్యాపకులకు నెలవారీ జీతాలు, ఇంకా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రకరకాల వెసులుబాట్లు ఏవీ కల్పించటం లేదు. ఉదాహరణకు అధ్యాపకులకు ఇచ్చే సంపాదిత, వైద్య సెలవుల్లాంటి సౌకర్యాలు చాలా ప్రైవేటు విశ్వవిద్యాలయాలలో లేవు. మహిళా బోధకుల ప్రసూతి సెలవును మంజూరు చేయక పోగా, విశ్వవిద్యాలయాన్ని వదలి వెళ్లిపోవాల్సిందిగా పరోక్షంగా ఒత్తిడి తెస్తున్నారు. అలా కానిపక్షంలో 'జీతంనష్టంపై వెళ్లాలి' అని సూచిస్తున్నారు. ఈ విశ్వవిద్యాలయాలు యూజీసీ గుర్తింపు పొందినప్పటికీ, జీతాలు యూజీసీ నిబంధనలకు అనుగుణంగా లేవు. అధ్యాపకులకు సంబంధించిన గ్రాట్యుటీ, పీఎఫ్ సౌకర్యాలు తూతూ మంత్రంగా నడిపిస్తున్నారు. ఇన్ని జరుగుతున్నా, ఆయా విశ్వవిద్యాలయాలకు ర్యాంకులు ఎలా వస్తున్నాయన్నది ప్రశ్నగానే మిగిలిపోతోంది. కొన్ని ప్రైవేటు యూనివర్సిటీలలో, కేంద్ర ప్రభుత్వం విధిగా పెంచే కరవు భత్యం శాతం ఇక్కడ చెల్లించడంలేదు. ఆ విశ్వవిద్యాలయం నుంచి వెళ్లదలచే అధ్యాపకుడు మూడు నెలల నోటీసు ఇవ్వాలని, లేని పక్షంలో మూడు నెలల జీతం జమ చెయ్యాలనే ఒత్తిడి వస్తోంది. మరోవంక, అలా వెళ్లేవారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ, యూనివర్సిటీ యాజమాన్యాలు పైశాచికానందాన్ని పొందుతున్నాయి. దాదాపు 90 శాతం ప్రైవేటు యూనివర్సిటీలలో పైన చెప్పుకున్న లోపాలున్నాయి. అయినప్పటికీ ఆయా యూనివర్సిటీలు పేరొందిన సంస్థలుగా చెలామణి అవుతున్నాయి. వీటిని ప్రభుత్వాలు గమనించటం లేదా? కొన్ని రోజుల క్రితం 'నేచర్ జర్నల్'లో వచ్చిన కథనం ప్రకారం, తమిళనాడులోని రెండు ప్రైవేటు యూనివర్సిటీల్లో అధ్యాపకులపై పెరుగుతున్న ఒత్తిడి కారణంగా లోప భూయిష్టమైన పరిశోధనా పత్రాలు ప్రచురిత మవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

ఏది ఏమైనా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల నిర్వీర్యానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. అలాగే, ప్రైవేటు యూనివర్సిటీలలో జరుగుతున్న

**విద్యార్థులు అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా, ఇబ్బడి ముబ్బడిగా సీట్లు పెంచేసుకొని, సౌకర్యాలున్నా లేకపోయినా, ఎక్కువమంది విద్యార్థులను చేర్చుకొని వారిని రకరకాల ఇబ్బందుల పాలు చేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ పనిచేస్తున్న అధ్యాపకులకు నెలవారీ జీతాలు, ఇంకా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రకరకాల వెసులుబాట్లు ఏవీ కల్పించటం లేదు. ఉదాహరణకు అధ్యాపకులకు ఇచ్చే సంపాదిత, వైద్య సెలవుల్లాంటి సౌకర్యాలు చాలా ప్రైవేటు విశ్వవిద్యాలయాలలో లేవు. మహిళా బోధకుల ప్రసూతి సెలవును మంజూరు చేయక పోగా, విశ్వవిద్యాలయాన్ని వదలి వెళ్లిపోవాల్సిందిగా పరోక్షంగా ఒత్తిడి తెస్తున్నారు.**

అరాచకాలకు కూడా ప్రభుత్వం బాధ్యత వహించి వాటిని సరైన గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. దీనికోసం దిగువ అంశాలను పరిగణనలోకి తీసుకోవచ్చు.

- ప్రైవేటు విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అధ్యాపకుల జీతాల వివరాలను పబ్లిక్ వెబ్‌సైట్‌లో పెట్టాలి.
- అధ్యాపకులకు ఇస్తున్న గ్రాట్యుటీ, పీఎఫ్‌లను విధిగా ప్రభుత్వానికి తెలపాలి.
- NIRF ర్యాంకింగ్ సిస్టంలో బోధనా సిబ్బంది సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- ప్రతి ప్రైవేటు యూనివర్సిటీలో ప్రభుత్వానికి సంబంధించి ఫిర్యాదులు విభాగాన్ని ఏర్పాటు చెయ్యాలి.

**– లక్ష్మీకుమార్ టీవీ**





**భారతదేశంలో నాలుగో వంతు కూడా లేని పాకిస్తాన్, సింధు నదీజలాలలో 80 శాతం వాటా అందుకుంది. దీనిని చూసి చరిత్ర నవ్విపోయింది. పాక్ నైజం 1948లోనే అనుభవానికి వచ్చింది. హిందువులు, ముస్లిం జనాభా మార్పిడికి సంబంధించి లియాఖత్ అలీ-నెహ్రూ ఒప్పందం దారుణంగా విఫలమైంది. అయినా ఇంత అధ్వానంగా ఉన్న సింధు జలాల ఒప్పందం మీద సంతకాలు జరిగిపోయాయి. ఇది స్వతంత్ర భారత తొలి ప్రభుత్వ నిర్వాకం. భారత్‌కు 20 శాతం జలాలే దిక్కయ్యాయి. ఇలా ఆరున్నర దశాబ్దాలుగా సాగుతోంది. అది ఎన్ని అరాచకాలు చేసినా, ఎంత మంది అమాయకులను పొట్టన పెట్టుకున్నా సింధు ఒప్పందం భగ్నం కాకపోవడం, ఆ దిశగా భారత నాయకత్వం ఏనాడు ఆలోచించకపోవడం దానికి వరమైంది. ఇప్పుడు పాపం పండింది. పాకిస్తాన్ పెంచి పోషించిన ఇస్లామిక్ ఉగ్రవాదం కారణంగా ఆ వరమే శాపంగా మారింది. పెహల్గావ్ తదనంతర పరిణామాలలో భాగంగా భారత్ పాకిస్తాన్‌కు సింధు జలాలను నిలిపివేసిన సంగతి తెలిసినదే.**

# ‘నీళ్ల బాంబు’కు బెదిరిన అణ్వా

కాంగ్రెస్ పాలనలో జరిగిన తప్పిదాలను నేటి ప్రభుత్వం సరిదిద్దుతున్నది. ఆ కోణం నుంచి ఆలోచిస్తే సింధు జలాల ఒప్పందం రద్దు గొప్ప తప్పిదాన్ని నివారించడమే. ఈ నిర్ణయం గురించి పునరాలోచించుకోవాలని పాకిస్తాన్ ఇప్పటికి నాలుగుసార్లు భారత్‌కు లేఖలు రాసింది. పాకిస్తాన్ జల వనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సయద్ అలీ ముర్తాజా సింధు జలాల నిలిపివేత గురించి నిర్ణయాన్ని పునరాలోచించాలని భారత జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు నాలుగు లేఖలు రాశారు. అన్ని లేఖలను జల్‌శక్తి శాఖ విదేశీ వ్యవహారాల శాఖకు భద్రంగా పంపింది. భారత్ నిర్ణయంతో పాకిస్తాన్‌లో జల సంక్షోభం ఏర్పడిందనీ, నీరు లేని డ్యాములే మిగులుతాయని ముర్తాజా విలపించాడు.

భారత్ మాకు నీళ్లు ఆపితే, భారత్‌కు మేం ఊపిరి ఆపేస్తాం అంటూ ఉగ్రవాద సంస్థల నాయకులు ప్రేలాపనలు ఇప్పుడు ఏమైనాయి? నీళ్లు ఎలా ఇవ్వరో చూస్తామని పాక్ రాజకీయ నేతలు హెచ్చరికలు జారీ చేసిన విషయం అప్పుడే మరచిపోయారా? చైనా కూడా భారత్‌లోకి నీళ్లు రాకుండా ఆపగలదని అంటూ వచ్చిన బెదిరింపులు ఎందుకు చప్పబడ్డాయి? వీటికి పరాకాష్ట- సింధు నదీ జలాలను నిలిపి వేయడం యుద్ధ చర్య వంటిదేనని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బీరాలు పలకడం. ఇదీ జలాయుధం గొప్పతనం. ఈ వాగాడంబరం ఆపి నీళ్లు తెచ్చే మార్గం చూడండి అని పాకిస్తాన్‌లోనే కొందరు దూర దృష్టి కలిగిన వాళ్లు గోల పెడితే అప్పుడు అరుపులు తగ్గాయి. వీరంగాలు నీరసించాయి. ఇది నీటి బాంబు. ఎప్పుడైనా పేలిపోతుంది, ముందు దానిని నిర్వీర్యం చేసే పనేదో అది చూడండి, అని పాకిస్తాన్‌లో కొందరైనా గుర్తించి, ఆ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాకిస్తాన్ పార్లమెంట్‌లో కొందరు ఎంపీలు కన్నీటితో, ఈ ఉద్రిక్తతలను ఆపండి అంటూ చేసిన విన్నపాలు, కార్చిన కన్నీళ్ల వెనక ఉన్నది కూడా ఇందుకు సంబంధించినదే. నీళ్లు లేకపోతే భవిష్యత్తు ఏమిటి? ఎప్పుడూ జిహాద్, ఉమ్మా, హిందూ నిర్మూలన, ఆటంబాంబులు అంటూ ఉన్మాదంతో ఊగిపోయే వారు కాకుండా, కాస్త బుర్ర పెట్టి ఆలోచించేవారు కూడా అక్కడ ఉన్నారన్నమాట. ‘ఇప్పుడు తలెత్తిన ఈ నీటి సంక్షోభాన్ని తక్షణం పరిష్కరించుకోలేకపోతే, మనమంతా ఆకలితో అలమటిస్తూ చచ్చిపోవలసిందే. సింధు నదీ పరీవాహక ప్రాంతమే మనకు జీవనాధారం. మనకు అవసరమైన జలవనరులలో నాలుగింట మూడు వంతులు పొరుగు దేశం నుంచి రావలసిందే. మరొకటి. ప్రతి పదిమంది పాకిస్తానీ లలో తొమ్మిది మంది బతుకు, సింధు పరీవాహక ప్రాంతంతోనే ముడిపడి ఉంది. అసలు మనదేశంలో వేసే 90 శాతం పంటలకు సింధు జలాలే ఆధారం. మన విద్యుదుత్పత్తి కేంద్రాలన్నీ కూడా సింధు పరీవాహక ప్రాంతంలోనే ఉన్నాయి. ఈ సంక్షోభం అంటే మరేమీ కాదు. మన ముందు పేలడానికి సిద్ధంగా ఉన్న నీటి బాంబు. ఆ బాంబును మనం నిర్వీర్యం చేసి తీరాలి’ అన్నాడు పాకిస్తాన్ సెనేటర్ సయద్ అలీ జఫర్. కిందటి నెలలో జరిగిన సెనేట్ సమావేశాలలోనే తన గోడు వెళ్లబోసుకున్నాడతడు.

సమస్త జీవులకు నీళ్లు ఎంత ప్రధానమో తెలియనిది కాదు. అయినా ప్రపంచంలో ఎవరూ పాకిస్తాన్‌కు నదీజలాలను నిలిపివేస్తే భారత్‌ను ప్రశ్నించలేదు. భారత్ నిర్ణయం అమానవీయం అని గగ్గోలు పెట్టలేదు. ఇందుకు ఒక వర్గం మాత్రం మినహాయింపు. వాళ్లే భారతదేశంలోని ఉదార వాదులు, సెక్యులరిస్టులు. వీళ్లు మాత్రం భారత్ నిర్ణయంలో చాలా అమానుషత్వాన్ని చూశారు. అంటే, పెహల్గావ్‌లు, బొంబాయి పేలుళ్లు ఎన్ని జరిగినా మనమే పెద్ద మనసుతో మరచిపోవాలన్నది ఈ సెక్యులరిస్టుల అభిప్రాయం. ఆ రక్తపాతాన్ని పిల్లచేష్టగా పరిగణించి విడిచిపెట్టాలన్నదే చాలా రాజకీయ పార్టీల నిశ్చితాభిప్రాయం.

1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని ఈ ఏప్రిల్ 23న భారత్ రద్దు చేసింది. ఇదేమీ హఠాత్పరిణామం కాదు. మూడు దశాబ్దాల ఘోర సరిహద్దు తీవ్రవాదానికి కీలెరిగి పెట్టిన వాత. పెహల్గావ్‌లో 26 మంది అమాయక పర్యాటకులను దారుణంగా చంపిన తరువాత భారత ప్రభుత్వం తీసుకున్న తీవ్ర చర్య ఇది. ఉగ్రవాదాన్ని అదే పనిగా పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ మొత్తానికి భారత్ విధించిన సామూహిక శిక్ష. వీసాల రద్దు, దౌత్యవేత్తల సంఖ్య తగ్గింపు, అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీల ఏరివేత దీనికి అదనం. సరిహద్దు ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టేశామని పాకిస్తాన్ ప్రపంచానికి పూర్తి నమ్మకం కలిగించే వరకు చర్చల ప్రసక్తే లేదని భారత్ చెప్పేసింది. చర్చలంటూ జరిగితే రెండు అంశాలపై ఉంటాయని కూడా సుస్పష్టంగా వెల్లడించింది. భారత్‌లో రక్తం చిందించిన ఉగ్రవాదుల అప్పగింత, ఆక్రమిత కశ్మీర్ భూభాగం అప్పగింత అనే రెండే రెండు అంశాలు తప్ప, అంతకు మించి చర్చించేది ఏదీ ఉండదని కూడా తెగేసి చెప్పింది. చాలా చిత్రంగా మా దేశంలో ఉగ్రవాదులే లేరు అంటూ ఇంతకాలం బొంకిన పాకిస్తాన్ పెహల్గావ్ రక్తపాతం తెచ్చిన వీరావేశంలో చాలా విషయాలు అంగీక రించింది. అందులో ప్రధానమైనది-ఉగ్రవాదులను తాము మూడు దశాబ్దాలుగా మేపుతున్నాం అన్నదొకటి. ఆ దేశ రక్షణ



# యుధాలు

మంత్రే ఈ విషయం ప్రపంచం మొత్తం వినేటట్టు మీడియాకు చెప్పాడు. భారత్ వైపు నుంచి ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన జవాబు తిరుగులేని అస్త్రాన్ని మరిపించింది. నీళ్లు, నెత్తురూ కలసి పారలేవు అని తేల్చి చెప్పారు ప్రధాని. అంతేకాదు, తూటాలు–ఉగ్రవాదం, చర్చలు కూడా ఒకేచోటకు రాలేవని వెల్లడించారు మోదీ. కాగా సింధు జలాలతో ముడిపడి ఉన్న కొన్ని ప్రాజెక్టులను కూడా తాము నిర్మించబోతున్నామని కూడా మోదీ తెలియచేశారు. బియాస్‌ను, గంగ కాలువను కలుపుతూ 130 కిలోమీటర్ల కాలువ నిర్మాణం అందులో ఒకటి. యమునతో కలిసే మరొక కాలువ నిర్మాణం కూడా అందులో ఉంది. భారత రాజకీయ నాయకత్వం నుంచి ఇంతటి రాజకీయ సంకల్పం గతంలో పాకిస్తాన్ చూడలేదు. ఇంత జరిగాక పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇరుదేశాలకు చెందిన అన్ని సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి తాము సిద్ధమేనంటూ ప్రకటించారు. కానీ ఆయన మాటను గౌరవించేవారు, ఆలకించేవారూ ఎవరూ లేరు. ముస్లిం దేశాలు కూడా ఇందుకు మినహాయింపు కాదు.

పాకిస్తాన్ అంటేనే దగా కళలో నిష్ణాతురాలని వైమానిక దళ మాజీ గ్రూప్ కెప్టెన్ అజయ్ అహ్లావత్ తాజాగా వ్యాఖ్యానించారు. అది ప్రపంచ రాజ్యాలనే ఆ దగా కళతో దోచేస్తున్నదని కూడా అన్నారు. నిజానికి ఇది అజయ్ సొంత అభిప్రాయం అనుకోవద్దు. అమెరికా రాజనీతి శాస్త్రవేత్త సి. క్రిస్టిన్ ఫెయిర్ రాసిన వ్యాసం మీద ఆయన స్పందించారు. ‘పాకిస్తాన్ అంటేనే పెద్ద దగాకోరు. ఆ దేశం వాళ్లు అందరినీ చవటలను చేసేస్తారు. ఎవరినీ వదలరు. వాళ్లు దశాబ్దాలుగా అమెరికా మీద పడి తినేశారు. ఆ విధంగా వాళ్లనీ చవటలను చేశారు. పాకిస్తాన్ నుంచి చైనాకు ఎదురుకాబోయే అనుభవం కూడా అచ్చంగా అలాగే ఉండబోతున్నది. కానీ కాస్త సమయం పడుతుంది అంతే’ అన్నారు అజయ్. క్రిస్టిన్ పాకిస్తాన్ చేతిలో అమెరికా మోసపోయిన సంగతిని ప్రస్తావించారు. పాకిస్తాన్ మేక వన్నె పులిలాంటి రూపం తెలిసినా అమెరికా మోసపోవడమే పెద్ద వైచిత్రి అని ఆమె అంటారు. వాషింగ్టన్‌లోని భారత దౌత్యకార్యాలయానికి క్రిస్టిన్‌కు పలుసార్లు ఎదురైన ప్రశ్న ఒకటి ఉండేది. అది– ‘మీ అమెరికా వాళ్లు ఇంత సుదీర్ఘకాలం ఆ పాకిస్తానీల చేతిలో ఎలా మోసపోతూ వచ్చారో తెలుసుకోవాలని ఉంది.’ ఇంకో ప్రశ్న– ఆ రోగ్ దేశం వరసగా అమెరికా నుంచి బిలియన్‌ల కొద్దీ డాలర్లు ఎలా అందుకోగలిగింది? ఆ డబ్బంతా పట్టుకెళ్లి ఉగ్రవాదం పెంచి పోషించడానికి, అణ్వాయుధాలు తయారు చేసుకోవడానికి ఎలా ఉపయోగించుకోగలిగింది? క్రిస్టిన్ మరొక ఆశ్చర్యకరమైన పరిణామాన్ని కూడా అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. పాకిస్తాన్ అన్నీ అబద్ధాలే మాట్లాడుతూ అంత సానుభూతి ఎలా సంపాదించింది? ఇప్పుడు మాత్రం క్రిస్టిన్ వాస్తవం దగ్గరకి వస్తున్నారనే అనిపిస్తుంది. పాకిస్తాన్ ఆటలు సాగడానికి పాకిస్తాన్ వ్యవహారాలు చూసిన కొందరు అధికారుల ఐచ్ఛిక ధోరణే కారణమని అంటారామె. పైగా ఆసియాలోని స్థానిక సమీకరణాల గురించి వారికి తెలిసిందేమీ లేదనీ అన్నారు.

మతోన్మాదానికి సంబంధించి పాకిస్తాన్ చేసే వాదనలలో కొన్ని కప్పిపుచ్చిన అంశాలు ఉన్నాయి. అఫ్ఘానిస్తాన్‌లోకి సోవియెట్ రష్యా చొరబాటు తరువాతనే పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని లేదా జిహాద్ నినాదాన్ని అందుకుందని, జిహాదిస్టు విధానాన్ని చేపట్టిందని చాలామంది భావన. కానీ అది అర్ధసత్యమేనని అంటారు క్రిస్టిన్. అఫ్ఘానిస్తాన్ మీద సోవియెట్ రష్యా దండయాత్రకు చాలా ముందే జిహాదిస్టులను పాకిస్తాన్ తయారు చేసే కార్యక్రమం చేపట్టింది. 1973–74 కాలంలో జుల్ఫికర్ అలీ భుట్టో ప్రధానిగా ఉండగానే జిహాదిస్టు వ్యూహం అమలవుతున్నది. హుసేన్ హకానీ చేసిన పరిశోధన ఆధారంగా క్రిస్టిన్ ఈ విషయం వెల్లడించారు. అంటే ఆసియాలో సోవియెట్ రష్యా ప్రాబల్యం పెరగడం, దానిని నిరోధించడానికి అమెరికా రంగంలోకి దిగడం వంటి పరిణామాలకు చాలాముందే జిహాదిస్టులకు పాకిస్తాన్ స్వర్గతుల్యంగా ఉంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అఫ్ఘానిస్తాన్ రాజు జహీర్‌షాను ప్రధాని, మాజీ సైనికాధికారి మహమ్మద్ దావూద్ ఖాన్ పదవీచ్యుతుడిని చేసిన సమయం నుంచి పాకిస్తాన్ జిహాదిస్ట్ విధానం పట్ల మక్కువతో కనిపిస్తుందంటారు క్రిస్టిన్. ఈ పరిణామం 1973 నాటిది. ఆ సమయంలోనే భుట్టో ఐఎస్ఐ అఫ్ఘానిస్తాన్ విభాగం ఏర్పాటు చేశాడు. దీని పని ఇస్లామిస్టులను ఏకం చేయడమే.

మతోన్మాదానికి సంబంధించి పాకిస్తాన్ చేసే వాదనలలో కొన్ని కప్పిపుచ్చిన అంశాలు ఉన్నాయి. అఫ్ఘానిస్తాన్‌లోకి సోవియెట్ రష్యా చొరబాటు తరువాతనే పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని లేదా జిహాద్ నినాదాన్ని అందుకుందని, జిహాదిస్టు విధానాన్ని చేపట్టిందని చాలామంది భావన. కానీ అది అర్ధసత్యమేనని అంటారు క్రిస్టిన్. అఫ్ఘానిస్తాన్ మీద సోవియెట్ రష్యా దండయాత్రకు చాలా ముందే జిహాదిస్టులను పాకిస్తాన్ తయారు చేసే కార్యక్రమం చేపట్టింది. 1973–74 కాలంలో జుల్ఫికర్ అలీ భుట్టో ప్రధానిగా ఉండగానే జిహాదిస్టు వ్యూహం అమలవుతున్నది.

పాకిస్తాన్ నేడు చైనాకు దగ్గరగా ఉండవచ్చు. కానీ గతంలో ప్రపంచ రాజకీయాలలో భాగంగా జరిగిన కమ్యూనిస్టు వ్యతిరేక ఒప్పందాలలో భాగస్వామిగా ఉన్న దేశం పాకిస్తాన్. ఉగ్రవాదం మీద అంతర్జాతీయ పోరులో అమెరికాను పాకిస్తాన్ తుదికంటా మోసగిస్తూనే ఉంది. ఒకపక్క ఉగ్రవాద ముఠాలకు చేయూతనిస్తూనే అమెరికా నుంచి బిలియన్ డాలర్ల నిధులు తెచ్చుకుంది. తాలిబన్ నాయకులకీ, హకానీ ముఠాలకీ పాకిస్తాన్ అండగానే ఉంది. ఇవి చేసిన ఘనకార్యం ఏమిటీ అంటే, అఫ్ఘానిస్తాన్‌లో అమెరికా నాయకత్వంలో ఉన్న నాటో సేనల మీద దాడులకు తెగబడడమే.

అమెరికాను ఈ విధంగా దగా చేస్తే, భారత్ పట్ల పాకిస్తాన్ వైఖరి మతోన్మాదం, రక్తపాతంతో కలసి ఉంది. కశ్మీర్ మీద అవాకులు చెవాకులు పేలడం, కశ్మీర్ మనదేనంటూ సొంత ప్రజలను దగా చేయడం పాకిస్తాన్ నేతలకు సర్వసాధారణం. గడచిన మూడుదశాబ్దాలుగా పాకిస్తాన్ అరాచకాలు భారత్‌కు చూపిన నరకం సామాన్యమైనది కాదు. పేలుళ్లు ఒకవైపు, సరిహద్దులలో ఉగ్రవాదం ఒకవైపు, చొరబాట్లు మరొకవైపు. ఇన్ని ఉన్నా, వేలాది మంది చనిపోతున్నా భారత్ అసాధారణమైన సహనం ప్రదర్శించింది. దీనిని పాకిస్తాన్ చేతగానితనంగా చూసింది. ‘పాకిస్తాన్‌తో భారత్‌కు సరిహద్దు ఉగ్రవాద సమస్య ఒక్కటే కాదు. అవాంఛనీయ మార్పులు వస్తున్నాయి. భద్రతకు ముప్పు, నాణ్యమైన విద్యుదుత్పాదనకు సమస్య, వాతావరణ కాలుష్యం, జనాభా సమీకరణాల మార్పు వంటి పరిణామాలు తప్పడం లేదని భద్రతా మండలిలో మన శాశ్వత సభ్యుడు పి. హరీశ్ వాదించడం ప్రపంచాన్ని ఆలోచింప చేసిందనే అనాలి.

– జాగృతి డెస్క్

కథ

# బల్లకట్టు రాములు

గోవర్ధనం శ్రీనివాసమూర్తి



"ఏడుకొండలవాడా వెంకటరమణా గోవిందా గోవిందా" అని మనసులో అనుకొంటూ కొబ్బరికాయ కొట్టాడు శ్రీరాములు. ప్రతిరోజూ మామూలుగా దణ్ణం పెట్టుకొన్నా శనివారం మాత్రం స్నానం చేసి, మంచి బట్టలు కట్టుకొని, పొడుగుబొట్టు పెట్టుకొని, నడానికి ఉతికిన తువ్వాలు కట్టుకొని కొబ్బరికాయ కొట్టిన తర్వాతగాని బల్లకట్టుతాడు విప్పడు. ఎంతమంది రేవులో ఉన్నా "ఓహో" ఈ రోజు శనివారం కామోసు అని కబుర్లు చెప్పుకుంటూ నిల్చుంటారు. అంతేగాని రాముల్ని ఎవరూ కంగారుపెట్టరు. అలాంటిది ఈ శనివారం రేవులో ఎవరూ లేరు. బల్లకట్టు లంగరు వేసే ఉంది. కాయకొట్టిన తరువాత గుడి అరుగుమీద కూలబడి ఆ స్వామికేసి చూస్తూ అడుగుతున్నాడు. ఊహ తెలిసిన దగ్గర నుండి నిన్ను కొలుస్తున్నాను. ఈ నడివయస్సులో నా బ్రతుకు ప్రశ్నార్థకం చేశావేమిటి స్వామీ! అని మౌనంగా రోదిస్తున్నాడు. ఇంటివద్ద భార్య మాలక్ష్మి కూడా అదే పరిస్థితిలో ఉన్నదని అతనికి తెలుసు.

మొదటిసారి గెడవేసినరోజు అతనికి జ్ఞాపకం వచ్చింది. తాత ఆ రోజుకి ఇంక పనిలేదని అత్తను చూడ్డానికి చంద్రారం వెళ్ళాడు. ప్రెసిడెంటు గారి అబ్బాయికి జ్వరం వచ్చిందని రాజమండ్రి తీసికొని వెళ్తూ రేవులోకి వచ్చారు, రేవు దాటించాను. మరలా వాళ్ల వచ్చే వరకు ఉండి రాత్రి ఇటు తీసుకుని వచ్చాను. "తాతేడిరా" అని ఇప్పటిదాకా ఇక్కడే ఉన్నావురా! అంటూ భుజంతట్టి వెళ్లిపోయారు. మర్నాడు దివాణం నుంచి రమ్మని కబురు వచ్చింది. తాత హడలిపోయాడు. నేను జరిగింది చెప్పాను. మేము వెళ్లేసరికి అబ్బాయి గారు వరండాలో ఆడుకొంటున్నారు. ఏరా నిన్న ఎక్కడికి పోయావు అని తాతను అడుగుతూ "నీ మనుమడు రాత్రంతా అద్దరినే ఉన్నాడురా" చలిలో వాడి ధైర్యం నాకు నచ్చింది. అంటూ అబ్బాయిగారి చేత బట్టలు, డబ్బులు ఇప్పించారు.

"రేవులు, బల్లకట్టు బాగు చేయించు గ్రామ ఖాయిదాలోంచి డబ్బు పంపిస్తాను. నీ జీతం కూడా రెండు బస్తాలు పెంచుతున్నాను". వెళ్ళరా అన్నారు. తాతకు మాటలేదు. ఇంటికి వచ్చాకా తలనిమిరి నా పేరును నిలబెట్టావురా అన్నాడు. ఆ రోజు నుంచి బల్లకట్టే నా జీవితం అయ్యింది. కొన్నాళ్లకు అది నా ఇంటిపేరయ్యింది.

ఊర్లో అందరూ ఆదరంగా చూసేవారు. అక్కా-బావా అంటూ వేళాకోళాలాడుతూ బల్లకట్టు గెడవేసేవాడిని, ఊరి ఉమ్మడి జీతం కాక ఏదో ఒకటి ఇచ్చేవారు. కూరగాయల వాళ్లు కూరలు, పాల బిందెలవాళ్ళు పాలు, పెళ్లిళ్లు కుదిరితే స్వీట్లు, హాస్పటల్ పురుళ్ళకి వెళ్తే ప్రసవమైవస్తూ మగపిల్లాడు పుడితే బహుమతి ఇచ్చేవారు. వేళకాని వేళల్లో దాటిస్తే ఎగస్ట్రా ఇచ్చేవారు. పంతులుగారమ్మాయి బల్లకట్టు మీదే ప్రసవిస్తే ఇంటికి పిలిచి స్టీలు కంచం ఇవ్వడం నాకు ఇంకా జ్ఞాపకం ఉంది. తిండికి లోటు లేకపోయినా పెద్ద ఖర్చులకు అప్పు చేయాల్సివచ్చేది. రోజులు మారాయి. ప్రెసిడెంటుగారబ్బాయి మండల ప్రెసిడెంట్ అయ్యాడు. వ్యాపారస్తులు, ప్రయాణీకులే కాక కాలేజీ పిల్లలు పెరిగారు. ధాన్యంకాక డబ్బులిచ్చేపద్ధతి పెట్టారు. సంపాదన పెరిగింది. అదిచూసి మావ కూతురు మాలక్ష్మినిచ్చి పెళ్లి చేశాడు. మాలక్ష్మి తెలివైంది. 5 వరకు చదివింది. "నేను ఖాళీగా ఉన్నాను. ఏదైనా చేస్తాను'' అంటే వెంకన్నబాబు గుడి దగ్గర కొబ్బరికాయలు పెట్టించాను. రేవుకొచ్చేవాళ్ళు కొబ్బరికాయలు కొట్టేవారు లేదా కొని పట్టుకెళ్ళేవాళ్ళు రెండు సంవత్సరాలలో అది చిన్న బడ్డీ కొట్టు అయ్యింది. అందులో అన్నీ దొరికేవి. ఆదాయం పెరిగింది. ఊళ్లో మోటారు సైకిళ్లు పెరిగాయి. బల్లకట్టుపై వాటిని దాటిస్తే ఎక్కువ డబ్బులు ఇచ్చేవారు. మాలక్ష్మి ఆడబిడ్డనుకంది. దాని అదృష్టం అని మురిసి పోయాము. కాని ఇంతలోనే ఈ ఉపద్రవం వచ్చిపడింది. మాలక్ష్మి చంటిది ఇంట్లోనే ఉన్నారు. కొట్టు తియ్యలేదు. బల్లకట్టు తాడు విప్పలేదు. ఇంక ఊరి జనానికి దానితో పనిలేదు. దాన్నే నమ్ముకున్న నాతో ఎవరికీ పనిలేదు. రేవు బావురుమంటోంది నాకు బదులుగా. దూరంగా వంతెన వద్ద నుంచి మైకులో వినబడుతోంది. ప్రెసిడెంట్‌గారబ్బాయి మాట్లాడుతున్నారు. "సోదరసోదరీమణులారా! ఈ రోజు మన మద్దూరు గ్రామ చరిత్రలో సుదినం. ఎన్నోఏళ్లుగా మనం, మన చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు గోదావరి కాలవదాటడానికి ఎన్నో అవస్థలు పడుతున్నాం. బల్లకట్టు మీదే ఆధారపడుతున్నాం. ఈ రోజు ఎం.పి. గారు తమ నిధుల నుంచి ఈ వంతెన ఏర్పాటు చేశారు. దీనిని ప్రారంభించవలసినదిగా వారిని కోరుచున్నాను" అందరూ చప్పట్లు కొట్టారు. బాణసంచా పేలింది. ఎం.పి గారనుకొంటా మాట్లాడుతూ మద్దూరు గ్రామ ప్రజలారా ! ఈ వంతెన ప్రారంభోత్సవానికి నన్ను ఆహ్వానించినందుకు కృతజ్ఞుడను. మీ ప్రెసిడెంట్ గారి కృషి వల్లే ఇది సాధ్యం అయ్యింది. మీకు మరో శుభవార్త వచ్చే ఆగస్ట్ 15 నుంచి మద్దూరు గ్రామం

మీదుగా ఒక బస్సు కూడా మంజూరు అయ్యింది అని, అది నిడదవోలు, రాజమండ్రిల మధ్య తిరుగుతుందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. మళ్లీ చప్పట్లు కొట్టారు. అవి నా గుండెలపై సమ్మెట పోట్లలా ఉన్నాయి.

రేపటినుంచి రేవు ఎవరు దాటుతారు? పోనీ కొట్టు పని చేసుకొందామా అంటే అదికూడా రేవులోనే ఉంది. పని గట్టుకొని గట్టుదాకా ఎవరు వస్తారు? మైకులో ఎవరో మాట్లాడుతున్నారు గోదావరి కాలువపై వడ్డాణంలా వంతెన అమరి ఉందని. నిజమే కాని అది నా పాలిట ఉరితాడులా కనబడుతోంది. అందరూ సంతోషంగా ఉన్నారు. మరి నాకే ఇలా ఎందుకు జరుగుతోంది? రేపటి నుంచి ఏమి చెయ్యాలి? ఇంకో పని అలవాటులేదు.

మావా! కాస్త ఎంగిలిపడుతూగాని రా ... మాలక్ష్మి కేకవేస్తోంది. నిశ్శబ్దంగా లేచి వెళ్ళాను. ఒకరి కళ్లలోకి ఒకళ్లు చూసుకున్నారు. మాటలకందని బాధ అది. బెంగెట్టుకోకు మావా ఆ ఏడుకొండలవాడే ఏదో దోవచూపించకపోడు అని ఏవేవో మాట్లాడు తోంది. నన్ను ఊరడించడానికి. కానీ దానికీ తెలుసు.

ఆ్రరోజులు గడిచాయి. బల్లకట్టుని, రాముల్ని ఊరు మరిచిపోయింది అనుకున్నాను. వంతెన వద్దకు నడిచివెళ్ళి చూశా. మోటారు సైకిళ్లు, సైకిళ్లుజోరుగా వెళ్తున్నాయి. రేవులో అరటిగెలలు దింపే ఒంటెద్దుబండి నాగన్న అరటిలోడుతో వంతెన పైనుంచి వెళ్తున్నాడు. కాలేజీ పిల్లలు, ఊళ్లో వాళ్ళు రోజుకు 4 ట్రిప్పులు తిరిగే బస్సులో వెళ్తున్నారు. బల్లకట్టు మీద పోస్టల్ సంచులు పెట్టుకెళ్ళే ఆచార్యులుగారు సైకిలుపై వెళ్తున్నారు. నన్ను చూసి ఆగారు. ఏం చేస్తున్నావురా రాములూ? మాలక్ష్మి ఎలా ఉంది? చంటిది ఏంచేస్తోంది? అని ఆయన అడుగుతుంటే కళ్లు చెమర్చాయి. అంతా బాగానే ఉన్నారయ్యా? నా మాటల్లో విషాదం ఆయన కళ్లబడింది. మాట్లాడకుండా అలాగే నాకేసి చూస్తూ వెళ్లిపోయారు.



భండారు
సదాశివరావు స్మారక
దీపావళి కథల పోటీకి
ఎంపికైనది

ఆ రోజు శనివారం మాలక్ష్మి గుడి ఊడ్చి ముగ్గు పెడుతోంది. స్నానం చేసి కొబ్బరికాయ పట్టుకుని గుడివద్దకు వచ్చాను. బల్లకట్టుపై కాకికూడా వాలడం లేదు. బాధ వచ్చింది. స్వామి ఎదురుగా కూల బడ్డాను. "ఒరేయ్ రాములూ అయ్యగా రొస్తున్నారా" అని చాకలి సిద్దడు ఇంటిదగ్గర కేకేస్తున్నాడు. ప్రెసిడెంట్ గారి అబ్బాయి, సర్పంచ్‌గారు, రాయుడుగారు, పంచాయితీ మెంబర్లు ఇంకా కొంతమంది బల్లకట్టు రేవులోకి వచ్చారు. కంగారుగా నడానికి గుడ్డకట్టి ఎదురువెళ్లాను. "దండాలు దొరా" అన్నా "ఏరా రాములు ఇలారా!" అని అందరూ గుళ్లోకి వచ్చారు. కొబ్బరికాయ కొట్టారు. నన్ను కొట్టమన్నారు. గునపంతో తవ్వి ముహూర్తం చెయ్యమన్నారు. రెండు ఇటుకలు తీసాను. నాకేమీ అర్థం కావడం లేదు. బల్లకట్టు తీయమన్నారు. వంతెన చివరరోడ్డు వద్ద ఆపమన్నారు. అక్కడ ఇంకా కొందరు జనం ఉన్నారు. పంతులు గారు మంత్రాలు చదువుతున్నారు. తీసిన ఇటుకలు అక్కడ పెట్టమన్నారు. మళ్లీ అందరూ కొబ్బరికాయలు కొట్టారు. రాములూ ఇలారా అని నన్ను కేకేశారు. అందరూ దోవ ఇచ్చారు. కొబ్బరికాయ చేతికిచ్చారు. ఎవరో పొడుగుబొట్టు పెట్టారు. మెళ్లో దండ వేశారు. పోస్టలు ఆచార్యులు గారు సైగ చేశారు. కొబ్బరికాయ కొట్టమని, కాయకొట్టి నవధాన్యాలు వేశాను. అందరూ కూర్చున్నారు.

సర్పంచ్‌గారు నిలబడి గ్రామ ప్రజలారా మన రాముడు వాళ్ల కుటుంబం తరతరాలుగా మన గ్రామానికి సేవచేస్తోంది. మార్పు సహజంకదా! వంతెన వచ్చింది. బస్సు పడింది. బల్లకట్టు పనిలేదు. మరి రాములు, అతని కుటుంబం గురించి నిన్న ఆచార్యులుగారు చెప్పేదాకా ఎవరం ఆలోచించలేదు. వంతెనలో మిగిలిన నిధులతో పార్కు నిర్మించాలని తలపెట్టారు. దానికి వంతెన దిగువరోడ్డు వద్ద రాయుడుగారు రెండెకరాల పొలాన్ని రాసిస్తున్నారు. మన రేవులోని వేంకటేశ్వరస్వామిని అక్కడే ప్రతిష్టించి గుడి కట్టాలని పెద్దలు నిర్ణయించారు. పార్కు పని రాములు చూస్తాడు. గుడి పని అతని భార్య చూసుకుంటుంది. ఎకరం పొలం ఫలసాయం రాముడికి నిర్ణయించారు అని కాగితాలు చేతిలోపెట్టారు. ఒకేడాది పంట సొమ్ము గ్రామ ఖాయిదానుంచి ముందుగా ఇస్తారు అని సర్పంచ్‌గారు మాట్లాడడం పూర్తిచేసారు. అందరూ చప్పట్లు కొట్టారు. రాయుడుగారి కాళ్లకి దండం పెట్టాను. అందరూ లేచారు, ప్రెసిడెంట్ గారు భుజం మీద చేయివేసి బల్లకట్టును, వంతెన వద్ద కట్టి ఉంచు, పార్కులోకి పిల్లల్ని తీసికెళ్ళడానికి బాగుంటుంది అన్నారు.

పోస్టల్ ఆచార్యులుగారు నవ్వుతూ అడిగారు... ఏరా సంతోషమేనా? అని. చెయ్యెత్తి దండం పెట్టాను. ఆయనలో ఆ ఏడుకొండలవాడు కనబడుతున్నాడు. వెళ్లు, మాలక్ష్మి నీకోసం చూస్తూ ఉంటుంది అన్నారు. అప్పటికి కానీ అది నిజం అని నాకు తెలియలేదు. స్వామీ నువ్వున్నావని దణ్ణం పెట్టి గడవేస్తూ ఇంటికి చేరాను. ★



ఇప్పుడు రెండు పేర్లు మారుమోగుతున్నాయి. ఇప్పటికీ వాటి ప్రతిధ్వనులు వినవస్తున్నాయి.

చీనాబ్, మాధవీలత. ఒకటి రైల్వే వంతెన, మరొకటి – ఆ నిర్మాణ కీలక పాత్రధారిణి. ఏమిటి ఆ చీనాబ్? ఎవరు ఆ మాధవి? జమ్ముకశ్మీర్‌లో ఉంది ఆ నిర్మిత వ్యవస్థ. నిర్మాణ ఘనతలో తనదైన ప్రతిభను రంగరించిన మాధవిది తెలుగునాట ఒంగోలు ప్రాంతం. ఆమె ప్రస్తుతం పనిచేస్తోంది బెంగళూరులోని 'సెంటర్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్' విభాగ అధ్యక్షురాలిగా. పలు ప్రాజెక్టులకు నిర్మాణ బాధ్యత వహించారామె. నిర్మిత సంస్థ 'నార్తర్న్ రైల్వే ఆఫ్కాన్స్'కి ఆమె ప్రధాన సలహాదారు. అంటే – తెలుగు మహిళా ఇంజనీర్. మేధను సాకారంచేసిన నిపుణ. మన దేశం అనే కాదు.... మొత్తం ప్రపంచంలోనే ఎంతో ఎత్తుగా ఉండే వంతెన ప్రాజెక్టుకు శాస్త్ర, సాంకేతిక బాధ్యత వహించడమంటే మాటలా? పరమోన్నత రీతిన కశ్మీరులోయలోని రైల్వేసేవగా ఈ వంతెనను ఆరంభించిన ప్రధాని మోదీ అన్నట్లు – ఇదొక చరిత్రాత్మక సందర్భం. భారత్‌లో రూపుదిద్దుకున్న మొదటి కేబుల్ బ్రిడ్జ్‌గా ఇది ఘనాతి ఘనం. సృజనకు పర్యాయంలా నిలుస్తున్న మాధవీలతను చూస్తే...

'అటు ఇటు అన్నింటా, నువ్వే జగమంతా<br>
పరుగులు తీస్తావు ఇంటా బయటా.<br>
అలుపని రవ్వంత అననే అనవంట<br>
వెలుగులు పూస్తావు వెళ్లే దారంతా!'

అనే కవితోక్తి తలపులోకి రాక మానదు.

ఎందుకంటే – స్థానికం నుంచి అంతర్జాతీయానికి బాటలు పరచిన శాస్త్రీయ దృక్పథం తనది. ఎక్కడి పల్లెటూరు–ఏడుగుండ్లపాడు! తన సొంత ఊరు.

ఎక్కడి చీనాబ్–జమ్ముకశ్మీర్‌లోని రియాసీ ఏరియా!

అత్యధునాతన ఇంజనీరింగ్ నేపథ్యాన తెలుగు అతివ!

మరింత విలక్షణత ఒకటుంది. ఒకటిన్నర దశాబ్దంగా ఆమె సాగించిన పలు విధాల కృషికి ఇదంతా వాస్తవ రూపం. ఇదంతా జాతీయతా స్ఫూర్తి ఫలితం. ఈ మాట ఆమే అన్నారు!



డాక్టర్ మాధవీలత

నిర్మాణ, నిర్వహణలపైనే మాధవికి మక్కువ ఎక్కువ. ఒంగోలు ప్రాంత విద్యాలయాల్లో చదువు సాగింది. సమీప కందుకూరులోని ప్రభుత్వ పాఠశాలలో, జూనియర్ కళాశాలలో చదివిన ఆమె శాస్త్ర పరిజ్ఞానంలో ఎప్పుడూ ముందుండేది.

వాయువేగం వంటి ఆలోచన. దాన్ని ఆచరణకు తేవడంలోనూ తానే మిన్న. కాకినాడలోని టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ డిగ్రీ. అందునా డిస్టింక్షన్‌లో!

జియోటెక్నికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చదవాలని వరంగల్‌కి వెళ్లారు. ఎంతటి గుర్తింపూ గౌరవాలను సొంతం చేసుకున్నారంటే – స్వర్ణపతకం ఆమెదే! అటు తర్వాత మద్రాసు ఐఐటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు డాక్టర్ మాధవీలత.

పోస్ట్ డాక్టరల్ రీసెర్చి చేసింది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి. గువాహటి (గౌహతి)లోనే అసిస్టెంట్ ప్రొఫెసర్ అయ్యారు. అనంతర క్రమంలో సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌కి అపార సేవలందించారు.

అలా అలా ప్రొఫెసర్ అయ్యారు. శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాల్లో ఎందరెందరికో మార్గదర్శిని అయ్యారు.

సదా ప్రయోగాలు, బోధనలు, శోధనలు. అన్ని సందర్భాల్లోనూ నిర్మాణ పనులపైనే శ్రద్ధ, ఆసక్తి. పునాదులు, గోడల నిర్మాణాలు, కొండలను తొలిచి కట్టడాలు నిర్మించడం గురించే సమయమంతటినీ కేటాయిస్తూ వచ్చారు.

వంతెన పనులకు సంబంధించి ప్రత్యేక దృష్టి ఉంటుండేది. ఎన్నెన్నో పుస్తకాలను చదివారు. ఎందరెందరితోనో సంప్రదింపులు జరిపారు. పరిచయాలను విస్తృతంగా వినియోగించుకున్నారు.

చీనాబ్ వనితో ఎలా అనుసంధానం జరిగిందంటే... చీనాబ్ అనేది నది. అక్కడి జమ్ము–బారాముల్లా లైనులో ఉన్న కౌరి– బక్కల్ రైలు స్టేషన్ల మధ్య ఏర్పాటైంది వంతెన.

నదీ లోయ ప్రాంతాన ఇది వేలాది అడుగుల మేర విస్తరించి ఉంటుంది. అప్రోచ్ బ్రిడ్జిగా రూపు ఏర్పడింది. ఎంతెంతో ఎత్తయిన, ఆర్చి సంబంధమైన వంతెనే ఇది. నిర్మాణ వ్యయం అనేక కోట్ల రూపాయల్లో. నిర్మాణానికి కాలం స్థూలంగా దరిదాపు మూడేళ్లు. ట్రయల్ రన్ నిరుడు అయింది. ఇదే వంతెనమీద రైలుబండ్ల రాకపోకలు ఈ మధ్యనే మొదలయ్యాయి.

రెండు భాగాలుగా ఉండే వంపు వంతెన. ప్రధాన వంతెన నిర్మాణ బరువు వేలాది టన్నుల్లో! మొత్తం వంతెన ప్రతిపాదిత జీవితకాలం నూట ఇరవై సంవత్సరాల పై మాటే.

మధ్యలో స్టేషన్లు రెండు పదుల సంఖ్యలో.



# దక్షతతో జత

వాటిల్లో ఉధంపూర్ – శ్రీనగర్ – బారాముల్లా రైల్వే లింక్ పరంగా... రత్నిపోరా, అవంతి, అనంత నాగ్ తదితరాలు ఉన్నాయి. జమ్మును కశ్మీరులోయతో అనుసంధానించే రైలు సేవల ఆరంభోత్సవాల వేళ, ఈ వంతెనను జాతికి అంకితం చేశారు భారత ప్రధానమంత్రి. దానిమీదనే పరుగులు తీసింది 'వందే భారత్'.

అది జమ్ముకశ్మీరులోని కట్రా–శ్రీనగర్ మధ్యన నడిచేది. చీనాబ్ నదిపైన రైల్వే వంతెన మీద భారత జాతీయ పతాకాన్ని చేతపట్టి నడిచారు మోదీ. ఈ వంతెన వాస్తుశాస్త్ర అద్భుతమన్నది ఆయన ప్రసంగంలో ప్రతిఫలించింది.

కాదా మరి? న్యూయార్క్, పారిస్ ప్రాంతాలలోని ఎత్తుకట్టడాల కన్నా ఈ వంతెనే ఘనమైంది.ఎంతటి ప్రకృతి విపత్తు ఎదురైనా తట్టుకుంటుంది. భారతావనికి మకుటం జమ్ముకశ్మీరు అయితే, ఈ సరికొత్త రైల్వే వంతెన ఇక్కడి ప్రాంతీయులకు మహా కీలకం. కీలకాన్ని సాకారం చేయడంలో ప్రధాన నిర్మాణ పాత్ర స్వీకరించినందుకే మాధవీలతకు ఇంతింత ప్రత్యేక విశిష్టత.

వంతెన అందరి కళ్లముందూ నిలిచిందంటే, అంతా సంకల్ప బలం.

నేలమీదనే కాదు – నింగిలో ప్రయాణించేవారికీ వంతెన ప్రాంతం అంటే అత్యంత ఆసక్తి. జమ్ముకశ్మీరు లోయలకు ఎగువ నుంచి పయనించే విమానాల్లోని వారందరూ ఆ లోయకు చేరువైనపుడు పులకిస్తున్నారు. కిటికీల నుంచి చూసి, పొంగి పరవశిస్తున్నారు. విమానాల్లో నుంచీ అనేకానేక ఫోటోలు తీసి, తెలిసినవారందరికీ మహదానందంగా చేరవేస్తున్నారు.

వీటన్నింటినీ చదివీ, వినీ, సమాచార మాధ్యమాల్లో చూసీ ఎంతగానో సంబరపడుతున్నారు మాధవి. 'అభివృద్ధి, సంక్షేమం మన లక్ష్యాలు. దేశం వృద్ధి చెందడాన్ని ఎవరూ ఆపలేరు. సంక్షేమ ఫలాలు ప్రజలకు దక్కకుండా చేయలేరు. ఉగ్రవాదులు ఎన్ని ఆటంకాలు కలిగించినా ఏదీ సాధించలేరు. మనదైన భారతీయత చెక్కు చెదరదు ఏనాటికైనా. పురోగమనం కొనసాగుతూనే ఉంటుంది ఎన్నాళ్లకైనా. ఇందులో భాగంగానే ఇప్పుడీ వంతెన ప్రారంభ సందర్భం. నిలిచేదీ గెలిచేదీ జాతీయవాదమే! ఉగ్రవాదం కుప్పకూలక తప్పదు' అంటూ భావ ఉద్విగ్నతను వ్యక్తపరచారు ప్రసార సంస్థల వారితో.

ఎంతగానో పరిశ్రమించి బాధ్యతలన్నింటినీ ఫలప్రదం చేయడంలో తన బృందం పాత్ర అనంతంగా ఉందంటున్నారు. తన వాయువేగ పనితీరును సందర్భవశాత్తు ప్రస్తావిస్తూ, అంతా కేంద్రం ప్రోత్సాహ ప్రభావమేనని వ్యాఖ్యానించారు. **'మా నాన్నగారు చిన్నపాటి వ్యాపారం చేస్తుండేవారు. నేను చిన్నగా ఉన్నపుడే, శాశ్వతంగా దూరమయ్యారు. అమ్మ నన్ను తీర్చిదిద్దింది. నా భర్త సాంకేతిక నిపుణులు. ఆయన ప్రేరణ నా వృత్తిగతంగా నన్ను ముందుకు నడుపుతోంది.** అంటూ కృతజ్ఞత తెలుపుతుండగానే మందహాసం! ఆ చిరునవ్వులోనే ఎంతో సంతృప్తి సంతోషాలు.

ఎక్కడో దూరప్రాంతాన, పర్వత ప్రాంతాల నడుమ, విల్లు ఆకారంతో రూపనిర్మాణం చేసుకుంది చీనాబ్ వంతెన. నిర్మాణ క్రమంలో ఏళ్ల తరబడి అవరోధాలు ఎదురైనా, భౌగోళిక స్థితిగతులు సంక్లిష్టంగా మారినా, అంతర్గత సంకల్పమే చివరికి గెలిచిందంటారు ఆమె.

ఎప్పుడు తీరిక దొరికినా, ఏదో ఒక పుస్తకం చదువుతుంటారు. తనకు నచ్చిన, తాను మెచ్చిన పదకవితలను వల్లె వేసుకుంటూ ఉంటారు.

***'కళ్లు మూసుకుని రూపకల్పన చేసుకుంటే***
***ఆకాశం... ఎత్తయిన లోయలా అగుపిస్తుంది!***
***లోయలో ప్రవహించే నదులు***
***ఆ గగనంలో కదిలిపోయే మబ్బులా***
***అనిపిస్తుంటుంది!***
***అట్టగున పడి ఉంటే లోయకు***
***అంబరాన్ని అంటుకునే అవకాశం***
***ఏదీ, ఎక్కడా – అనే ప్రశ్నలొస్తుంటాయి.***
***వీటికి సమాధానం సుస్థిర యథార్థమే చెప్తుంది'***

అంటూనే, శాంతి సామరస్య అత్యవసరాన్ని తేటతెల్లం చేస్తుంటారు.

తన భావాల్ని ప్రస్ఫుటపరచే శక్తి మాధవీలత సొంతం. ప్రాజెక్టు నిర్మాణ పనుల తరుణంలో సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. తొలి నుంచీ నవీన యోచనలకు ప్రాధాన్యమిచ్చే ఆ శాస్త్రవేత్త గతంలోనే ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ నుంచి ఉత్తమ మహిళా పరిశోధన పురస్కృతిని అందుకున్నారు. అదేవిధంగా దేశంలోని 75మంది మహిళా ప్రముఖుల జాబితాలో చోటు సంపాదించుకున్నారు.

వనితలకు అవకాశాలు విస్తరింపచేస్తే, అద్భుతాలే జరుగుతాయన్నది ఆమె నినాదం, విధానం. బోధన రంగంలో అనంత పటిమ సాధించి, జాతీయ స్థాయి పురస్కారాన్ని కైవసం చేసుకున్నారు.

అసాధారణ పనితనానికి నిఖార్సయిన ప్రతీక ఆ వంతెన. దీనివల్ల జమ్ముకశ్మీరు ప్రాంత వ్యవసాయ ఉత్పత్తుల రవాణా బాగా వేగవంతమవుతుంది. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల సులభ సాధ్యంగా మారుతుంది. ఇంతటి బహుళ ప్రయోజక నిర్మాణ పనికి కీలకంగా వ్యవహరించినందుకే... మాధవీలత వనితాలోక స్ఫూర్తి ప్రదాత. ఇంజినీరింగ్ వృత్తి వనితల పాలిట కాంతి మాలిక!



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్




# అణువణువూ

“జగత్తుకు మూలం చిన్న పరమాణువని ఎంతో పూర్వం కణాద మహర్షి చెప్పాడు. గ్రీకు తత్త్వవేత్త డెమోక్రాటీస్ జగన్మూలం పరమాణువు అనే అన్నాడు. పూర్వ రుషులు పరతత్త్వ జ్ఞానానుభవం సహాయంతో ఖగోళ, గణిత, వైద్య, రసాయన, శస్త్ర, శాస్త్రాలను మనకు ప్రసాదించారు. వారు ధ్యాన సమాధి సాధనల ద్వారా మానవాళికి శాంతి సౌభాగ్యాలను కూర్చారు. సూర్యమండలం చుట్టూ ఇతర గ్రహాలున్నట్లు చిన్న ఉదజని అణు మధ్య భాగంలో ప్రోటాను; దానిచుట్టూ విద్యుత్ పరమాణు సంచలనం ఉన్నాయి. నున్నగా మనకి కనిపిస్తున్న బల్ల యదార్థంగా నున్నగా లేదు. సూక్ష్మదర్శినితో పరిశీలిస్తే, ఈ కర్రలో ఎంతో వేగంతో అనేక విద్యుత్ పరమాణువులు పనిచేస్తున్న సంగతి తెలుస్తుంది. అయినా మన దృష్టికి ఆ కర్ర ఒక మొద్దువలె కన్పిస్తున్నది. చిన్న పరమాణువులలో గొప్ప శక్తి ఉంది. ఈ పరమాణువుల మధ్యగల అన్యోన్య ఆకర్షణ, తీవ్రశక్తి ప్రభావాలతో సామరస్యాన్ని గ్రహిస్తే సామాన్య మానవులకు రాయి వలె కనిపించిన ఈ మూర్తిలో శ్రీరామకృష్ణ పరమహంస దివ్య కాళీమాతను దర్శించారు. అనంత పరతత్త్వాన్ని కూడా ధ్యాన సమాధుల ద్వారా మనం గ్రహించి సృష్టి రహస్యం, జీవిత రహస్యాల అనుభూతిని పొంది ఉభయత్రా పురోగమించాలి. ఈ విశాల ప్రపంచ నర్తనం స్వీయ ఇచ్ఛ లేకుండానే జరుగుతున్నది. అలాగే పరమాణువులు తీవ్ర వేగంతో తమ ఇచ్ఛ లేకుండానే పనిచేస్తున్నాయి. మన హృదయ స్పందన, రక్త ప్రసరణ, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు జీర్ణక్రియ మన ఇచ్ఛ లేకుండానే భగవదేచ్ఛ చేత జరుగుతున్నాయి.

*ఈశ్వరసర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి*
*భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా* (గీత 18-61)

(ఓ అర్జునా! జగన్నియామకుడు పరమేశ్వరుడు (అంతర్యామి) మాయచేత సమస్త ప్రాణులు యంత్రము నారోహించిన వారివలె (కీలు బొమ్మలవలె) తిప్పుచూ సమస్త ప్రాణుల హృదయ ములందు వెలయుచున్నాడు.) కనుక అహంకారం, సోమరితనం వీడి సర్వం భగవంతుని ఇచ్ఛ వల్లనే జరుగుతున్నదని తెలుసుకోవాలి. మనమందరం భగవత్ స్వరూపులమే కనుక పరస్పరానురాగం, ఐకమత్యం, సౌభ్రాతృలు కలిగి సర్వేశ్వరుని అనుగ్రహం పొంది ఇహపర శాంతి, సౌభాగ్యాభ్యు దయాలను, జన్మసార్థకతను సాధించాలి.”

ఒక మహా తత్త్వం ఇమిడి ఉన్న ఈ ఉపన్యాసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోనసీమలో అంతర్వేది పాలెం అనే చిన్న గ్రామంలో ఇచ్చారు ఒక మహనీయుడు (1-4-1952). ఆధ్యాత్మిక చింతన, శాస్త్రజ్ఞానం ఏదో ఒక బిందువు వద్ద కరచాలనం చేసుకోవడం గొప్ప సత్యమన్న ధ్వని ఇందులో గమనించవచ్చు. ఆ ఉపన్యాసం ఇచ్చిన ఆ వ్యక్తి ఆ రెండింటిని దర్శించినవారే కూడా. పేరు జ్ఞానానంద. ఇంకొక కోణం నుంచి కూడా ఆయనను పరిచయం చేసుకోవచ్చు. శ్రీకృష్ణుని దర్శించిన అణుశాస్త్రవేత్త.

‘ఏకో గోత్రే స భవతి పుమాన్ య: కుటుంబాన్ భిభర్తి’ (ఒక గోత్రంలో వంశోద్ధారకుడైన ఒక్కొక్క మహా పురుషుడు ఉద్భవిస్తాడు) అంటాడు కవికుల గురువు కాళిదాసు. జ్ఞానానంద గొరగనమూడి (ఉమ్మడి పశ్చిమ గోదావరి, భీమవరం దగ్గర) గ్రామంలో బహు సంపన్న కుటుంబంలో జన్మించారు (5-12-1896). సీతమ్మ, భూపతిరాజు శ్రీరామ రాజు జననీజనకులు. వ్యవహార నామం లక్ష్మీ నరసింహరాజు (జ్ఞానానంద). ఆధ్యాత్మిక సత్యాల కోసం మొదలైన ఆయన ప్రయాణం శాస్త్రవిజ్ఞానం వైపు సాగింది.

మంగిపూడి వీరయ్య సిద్ధాంతి అక్షరాభ్యాసం చేయించిన అనంతరం వీరవాసరంలోని సూరంపూడి సీతారామయ్య సంరక్షణలో జ్ఞానానందను ఉంచారు. గురువుగారికి తణుకు బదిలీ కాగా, తాను వెళ్లి ‘కోతుల మేడ’ అని పిలిచే ఇంట్లో ఉన్నారు. అక్కడే ముదిగంటి జగన్నశాస్త్రితో స్నేహం ఏర్పడింది. ఆ సమయంలో తణుకుకు మహారాష్ట్ర నుండి వచ్చిన ఒక స్వామి శ్రీకృష్ణభగవానుని మంత్రోపదేశం చేశారు. తరువాత ఎస్.ఎస్.ఎల్.సి. కోసం జ్ఞానానంద నరసాపురం టేలర్ హైస్కూలులో చేరారు. ఒకసారి తండ్రి మద్రాసు కంటి డాక్టరు దగ్గరకు తీసుకువెళ్లారు. అప్పుడే అడయార్‌లో అనిబిసెంట్‌ను కలిశారు రాజు. వీరికి మొగల్లులోని యోగి రామరాజు అంటే అభిమానం. ఆ యోగి కాశీలో హఠయోగం నేర్చుకున్నారు. "the light of Asia" (Edwin Arnold) పుస్తకం ఆయనను ప్రభావితం చేసింది. ఎస్.ఎస్.ఎల్.సి. ఉత్తీర్ణులు కాకపోతే ఇల్లు వదిలి వెళ్లిపోవాలని బాల్యమిత్రుడు వీరన్న, రాజు నిర్ణయించుకున్నారు. రాజు జీవితంలో ఇదొక మలుపు. నిజంగానే ఇరువురు ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్ష తప్పారు. కానీ జ్ఞానానంద మాత్రమే ఇల్లు వదిలి పారిపోయారు, ముందు అనుకున్నట్టే కలకత్తా.

తండ్రి రామరాజు ఆదేశం మేరకు వీరన్న కలకత్తా చేరుకొని బేలూరు మఠంలో రాజును చూశాడు. కానీ తిరిగి రావడానికి రాజు అంగీకరించలేదు. బేలూరు మఠం స్వామీజీ శ్రీ శివానంద అనుమతితో మొత్తానికి ఇంటికి వచ్చారు. అప్పుడే వివాహం చేశారు. ఎంతజెప్పినా వినక మళ్లీ 14.12.1917లో మరోసారి రాజు ఇల్లు వదిలి నేపాల్ బయలుదేరారు.

రామరాజు గారి సమీప బంధువు గొట్టుముక్కల సత్యనారాయణరాజు బెనారస్ హిందూ



విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. చదివేవారు. రాజు బెంగాలీ సాధువుల గుంపులో ఈయనకు కనిపించారు. పూర్ణానంద శిష్యుడయ్యాడు. పూర్ణానంద ఒక పక్షం రోజులు స్వగ్రామం వెళ్లడానికి రాజుకు అనుమతి నిచ్చారు. గౌరగనమూడిలో ఒక కుటీరం నిర్మించారు. ఇక్కడే "Man to Budda" అనే పద్యకావ్యాన్ని వ్రాశారు. తరువాత "Through the path of Silence" అను ఆంగ్ల పద్యం రాశారు. మళ్లీ 1922 మార్చిలో స్వగ్రామం వదిలి కలకత్తా మీదుగా కాశీకి చేరి తపో నియతితోనున్నారు. నేపాల్ వెళ్లి బుద్ధుడు తపస్సు చేసిన ప్రాంతాలలో తపస్సు చేయ నిశ్చయించారు. నేపాల్ దగ్గర జయనగర్‌లో గంగానది ఉపనదిని దాటాలి. ఈతకు దిగి కొట్టుకుపోయారు. కానీ దైవకృప. బతికి బయట పడ్డారు. బిహార్‌లోని ముజఫర్‌పూర్‌కు చెందిన యుద్ధ విక్రమార్కుడు అనే సంపన్నుడు వేటకు వచ్చి మలేరియా జ్వరంతో ఉన్న రాజును చూశాడు. అతడు జ్ఞానానందను తీసుకొని ఇంటికి తెచ్చి పై అంతస్తులో ఒక గది ఏర్పాటు చేశాడు. క్రిందిగదిలో విద్యార్థులు "Gregory and

ఇంకొన్ని అనుభవాల తరువాత 24-12-1924న గౌరగనమూడి చేరారు. తిరిగి ఏప్రిల్ 1925న అబూకు (నఖీతలాబ్) చేరి పూర్ణ సూత్రములు రాయాలని సంకల్పించారు. ధ్యానం చేస్తూ అందులో వచ్చే అనుభూతులను సూత్రబద్ధం చేశారు.

పూర్ణ సూత్రముల గ్రంథాన్ని జర్మనీలో అచ్చు వేయించాలన్న తలంపు కలిగింది. వెంటనే పాస్‌పోర్టులు సిద్ధం చేసుకున్నారు. 17 రోజుల్లో ఇటలీ చేరుకుని అక్కడనుండి డ్రెస్‌డన్ (జర్మనీ)లో ప్రొ॥ బూట్నర్‌ను కలిశారు. వారి కోరిక మేరకు పూర్ణసూత్రాల మీద 150 ఉపన్యాసాలు ఇచ్చారు. జ్ఞానానంద "దేశకాలం" (Time and Space) యిచ్చిన ఉపన్యాసంతోనే ప్రొ॥ డెంబర్ పరిచయమయ్యారు. ఆయన విద్యాశాఖామంత్రికి పరిచయం చేశారు. ఆయన పరీక్షించి ఉపన్యాసాలు వినేందుకు అంగీకరించారు. డా॥టేష్మన్ అనే ట్యూటర్‌ను పెట్టుకుని జర్మన్ భాషతో పాటు భౌతికశాస్త్రం నేర్చుకున్నారు. 1927 అక్టోబరులో ఎంట్రెన్స్ పరీక్ష ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై, కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్



# పరమాత్మ తత్త్వసారమే!

Hardly" ఫిజిక్స్ పుస్తకంలో ప్రాబ్లమ్ రాక కుస్తీపడుతుంటే జ్ఞానానంద జవాబు రాసి ఇచ్చారు. మరుసటిరోజు ఢిల్లీ చేరుకుని యమునా నది ఒడ్డున ఒక కుటీరంలో ఉన్నారు. దగ్గర్లో హర్డింజ్ లైబ్రరీలోని Plato "the Republic" నాలుగు సంపుటాలు నెలరోజుల్లో పూర్తి చేశారు.

తరువాత అబూలోని రఘునాథ మందిరంలో లక్ష్మీనరసింహరాజు తన పేరును జ్ఞానానందగా మార్చుకున్నాడు. ధ్యానంలో కూర్చున్నప్పుడు దేహస్మృతి పూర్తిగా పోయేది, శ్రీకృష్ణ భగవానుని సన్నిధిలోనే కాలము గడిచినట్లుండి తన్మయుడనై శరీరస్మృతిని మరచెడివాడను (పే.65) అని తన అనుభవాలను ఆత్మకథలో చెప్పారాయన. ఇక్కడ శరశ్చంద్రజీ పరిచయం అయ్యాడు. ఆయన గొప్ప సాధకుడు. తనను సాధన విధానమడగ్గా "You are already in the lap of God" (ఇప్పటికే నీవు దేవుని సన్నిధిలో ఉన్నావు). నీకు చెప్పాల్సిందేమీ లేదు" అనే వారు. అక్కడ నుండి కశ్మీర్ వెళ్లడానికి రైలు టిక్కెట్టు తీసుకున్నారు. అప్పుడే జలియన్‌వాలా బాగ్ దురంతం జరిగింది. అందువలన వీరిని రైలు నుండి దించారు. అయితే లాహోర్ వెళ్లి అక్కడ నుంచి కశ్మీర్ చేరుకున్నారు. కశ్మీర్‌లోని జాడీపూరాలో తీవ్ర సాధనతో భగవద్భావములు, నిరంతర ధ్యానం వలన సాయంత్రానికి ఒడలు తెలియని స్థితికి వచ్చారు.

టెక్నాలజీలో పరిశోధన చేసేందుకు అనుమతి సాధించారు. రోజుకు 14 లేక 15 గంటలు పరిశోధనలో గడిపేవారు. ఒకసారి తోటి స్కాలర్ అజాగ్రత్త వల్ల విద్యుదాఘాతం తగిలింది. భారత్‌కు వచ్చి వైద్యం చేయించుకున్నారు. టెహ్రీన్ రాజాగారి సహాయంతో మళ్లీ జర్మనీ చేరుకొనే సరికి హిట్లర్ ప్రభుత్వం వచ్చింది. తన పాత గైడ్ ప్రొ॥ డెంబర్ యూదు జాతీయుడు గనుక అతన్ని ఉద్యోగం నుండి తొలగించారు. కాబట్టి ప్రాగ్ (జెకోస్లావేకియా) నగరం వెళ్ళి ప్రొ॥ డొలేషక్ దగ్గర పిహెచ్.డి.కి చేర నిర్ణయించుకున్నారు. ఈ సమయంలోనే డ్రెస్‌డన్‌కు సుభాష్‌చంద్రబోసు వైద్యం నిమిత్తం వచ్చారు. ఆయనే జ్ఞానానందను భోజనానికి ఆహ్వానించారు. ఈ విషయం మోడరన్ రివ్యూలో వచ్చింది.

"ఎక్స్‌రే స్పెక్ట్రోస్కోపి" మీద పరిశోధనలు జరిపి అనేక వ్యాసాలు రాశారు. 3 నెలల్లో ఫిజిక్స్‌లోని అన్ని శాఖలలోనూ పరీక్షకు కూర్చుని డిస్టింక్షన్‌లో పాస్ అయ్యారు. ప్రాగ్ యూనివర్సిటీ డి.ఎస్.సి. డిగ్రీని 1936లో ప్రదానం చేసింది. తిరిగి 1936 నవంబరులో బొంబాయి చేరి, అక్కడ నుండి టెహ్రీన్ రాజుగారి సలహా మేరకు యూరోప్ వెళ్లాలని నిర్ణయించారు. ఈ లోగా "మ్యూనిక్ ఒడంబడిక " జరిగింది. దీని ప్రకారం జెకోస్లావేకియాలోని సూడిటాన్ లాండ్ జర్మనీ వశమైంది, దానితో ఇంగ్లండ్ పయనమై విక్టోరియా స్టేషన్‌కు చేరుకున్నారు. రేడియో ఎక్స్‌రే పై పరిశోధనకు వీలవుతుందా అని సర్ జేమ్స్ ఛాడ్విక్ (న్యూట్రాన్‌ను కనుగొనిన మహనీయుడు నోబెల్ గ్రహీత)కు లేఖ రాశారు జ్ఞానానంద. ఛాడ్విక్ ఆయనను లివర్‌పూల్‌కు రప్పించారు. ప్రయోగశాల చుట్టూ జ్ఞానానందతో రెండు గంటలు తిరిగి 'నీ ఇష్టమైన పరిశోధన చేయవచ్చు"నని చెప్పారు. ఇక్కడే హైవాకు రాశారు. దీన్ని పూర్తి చేయడానికి 17 మాసాలు పట్టింది. 1940 చివరకు ఈ పుస్తకం పూర్తయింది. ఛాడ్విక్ చాలా సంతోషించాడు. ఈ థీసిస్‌కు 1940 జూన్‌లో అవార్డు ప్రదానం జరిగింది. హైవాకు పుస్తకం పూర్తి కాగానే లండన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ 1941లో పెలో ఆఫ్ ది ఇన్సిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్‌గా ప్రకటించారు.

ప్రపంచమంతటా రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులు. అదే సమయంలో భారతదేశ నాయకులు "క్విట్ ఇండియా" ఉద్యమం సాగిస్తున్నారు. ఆ సమయంలో 5000 మంది మృతి చెందారనే వార్త వచ్చింది. జ్ఞానానంద యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ఇంగ్లండ్‌లో ఉద్రేక పూరిత ఉపన్యాసాలు ఇచ్చారు. దీనితో జ్ఞానానంద జాతీయవాది అని గుర్తించి ఆయనకు టెహ్రీ మహారాజు నుండి వచ్చే ద్రవ్యాన్ని నిలిపివేశారు. ఛాడ్విక్ జ్ఞానానందను చూడటానికి

కూడా ఇష్టపడలేదు.

అమెరికాలోని మిచిగాన్ యూనివర్శిటీ ప్రొ॥ లిండ్సే ఎక్స్‌రే స్పెషలిస్ట్. ఆయన ఆహ్వానం మేరకు డిసెంబర్ 25, 1944న అమెరికా చేరి సోలోనాయిడ్ కాపర్ వైర్‌తో బీటారే స్పెక్ట్రోగ్రాఫ్ నిర్మించారు. అప్పుడే 1947లో భారత్‌కు స్వతంత్రం వచ్చింది. తేది.15-12-1947లో పండిట్ నెహ్రూ ఆహ్వానం మేరకు నేషనల్ ఫిజికల్ లేబరేటరీ (ఎన్.పి.ఎల్)లో పరమాణు శాస్త్ర పరిశోధన హెడ్‌గా బాధ్యతలు స్వీకరించారు. తన పరిశోధనలు జరుగుతూ ఉండగానే 1939లో పశివేదల గ్రామంలో 'చిదానందాశ్రమం' స్థాపించి స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు.

జ్ఞానానందకు 24.04.1954న ప్రమాదవశాత్తు కాలుజారి తుంటి, మోచేతి ఎముకలు విరిగాయి. వైద్యం కోసం విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పటల్‌లో చేరారు. నాటి ఆంధ్రా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డా॥ వి.ఎస్.కృష్ణ జ్ఞానానందను కలిసి యూనివర్శిటీలో తాము ప్రారంభించబోయే విద్యుత్ పరమాణు పరిశోధనా విభాగానికి అధిపతిగా బాధ్యతలు స్వీకరించవలసిందని కోరారు. ఆ మేరకు 15-10-1954న 'గౌతమి ప్రొఫెసర్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్' పేరుతో ఎన్నో పరిశోధనలు చేసి, ఎందరో విద్యార్థులకు మార్గ దర్శనం చేశారు సెప్టెంబరు 21, 1969వ తేదీన విశాఖలో పరమదించారు. వారి జ్ఞాపకార్థం ఆంధ్ర విశ్వకళా పరిషత్‌లో జ్ఞానానంద న్యూక్లియర్ ఫిజిక్స్ లేబోరేటరీ' నిర్మించారు.

'యోగులు నడిచిన మార్గమిది, లోకము లేలిన దుర్గమిది, శాశ్వత శాంతులు స్వర్గమిది, భగవాధ్వజ ఛాయలలో మాయని భరతావని దిగ్విజయమిది' - సిరివెన్నెల.

**మూలం:**


1. శ్రీమత్ స్వామి జ్ఞానానంద చరితామృతము, స్వామి ప్రజ్ఞానంద.
2. ముదిగంటి జగ్గన్న శాస్త్రి రాసిన లేఖ తేది.06.08.1971.
3. మంతిన గోపాల్‌రాజు లేఖ 16.11.1971.
4. వారణాసి రామబ్రహ్మం లేఖ 01.09.1971.





**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు




# పంచాయతీలకు

**పంచాయతీ వ్యవస్థలు రానురానూ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. స్థానిక స్వపరిపాలన, స్వరాజ్యం వంటివి కానరాకుండా పోతున్నాయి. దేశంలోని పంచాయతీలను పట్టించుకోవలసిన విధంగా పట్టించుకుని ఉంటే దేశం ఏనాడో ఆర్థికాభివృద్ధి సాధించి ఉండేదని, ప్రజాస్వామ్యం మరింత పటిష్ఠంగా పరిఢవిల్లేదని ఆర్థిక శాస్త్రవేత్తలు, ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.**

ఇటీవల మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జాతీయ స్థాయి పంచాయతీ అధ్యక్షుల సమావేశం జరిగింది. రాజ్యాంగం ప్రకారం దేశంలో మూడంచెల ప్రభుత్వ వ్యవస్థ ఉన్నప్పటికీ, ఇందులో మూడవ వ్యవస్థగా ఉన్న పంచాయతీ వ్యవస్థకు ప్రాధాన్యమేమీ లేదని, పంచాయతీలు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఈ సమావేశం అభిప్రాయ పడింది. అధికారాల వికేంద్రీకరణకు సంబంధించిన సంస్కరణల్లో భాగంగా పంచాయతీల కోసం 73వ రాజ్యాంగ సవరణ, మునిసిపాలిటీల కోసం 74వ రాజ్యాంగ సవరణ చేపట్టడం జరిగింది. స్వయం పాలన, స్థానిక ప్రజాస్వామ్య సూత్రాలే లక్ష్యంగా పంచాయతీలను, పురపాలక సంఘాలను అభివృద్ధి చేయాలన్నది ఈ సవరణల అంతిమ ఉద్దేశం. ఈ సవరణలు జరిగి ఏళ్లూ పూళ్లూ గడిచిపోతున్నా పంచాయతీలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి. ఈ మూడవ అంచె విషయంలో 16వ కేంద్ర ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్) కొన్ని వ్యాఖ్యలు చేయడం చర్చనీయాం శమైంది.

నిజానికి, రాజ్యాంగంలో చేసిన రెండు సవరణల ప్రకారం పంచాయతీలకు, పురపాలక సంఘాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అయితే, ఆర్థిక సంఘాలు ఇప్పటికీ ఈ రెండు వ్యవస్థలనూ కలిపి స్థానిక సంస్థలుగానే పరిగణిం చడం వల్ల మూడంచెల ప్రభుత్వ వ్యవస్థకు అర్థం లేకుండా పోతోంది. ఈ రెండు సంస్థల సమస్యలు విభిన్నమైనవి.

అందువల్ల ఆర్థిక సంఘాలు పంచాయతీలను, పురపాలక సంఘాలను ఒకే గాటన కట్టకుండా వేర్వేరుగా చూడాల్సిన అవసరం ఉంది. రాజ్యాం గంలో ఈ సవరణలు జరిగి మూడు దశాబ్దాలు దాటినప్పటికీ, పంచాయతీల ఆర్థిక పరిస్థితి ఏ స్థాయిలో ఉందో, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆర్థిక పరిపుష్టికి వీటి నుంచి అందుతున్న సేవలు ఎటువంటివో ఇంతవరకూ ఎవరూ అంచనా వేయలేదు. పంచాయతీల ఆదాయ వ్యయాల పరిస్థితి ఏమిటో, అవి ఏ మేరకు పురోగతి సాధించాయో కూడా ఎవరూ ఇంత వరకూ మదింపు చేయలేదు.

**మూడంచెల వ్యవస్థ మృగ్యం**

పాశ్చాత్య దేశాలు కూడా రాష్ట్రాల సమాఖ్య సూత్రాలనే పాటిస్తాయి కానీ, రాష్ట్రాల సమాఖ్యలో పంచాయతీలకు స్థానం ఉండదు. భారతదేశంలో మాత్రం రాష్ట్రాల సమాఖ్యతో పాటు, మూడంచెల వ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అధికారాల వికేంద్రీకరణలో భాగంగా ఇక్కడ గ్రామసభలు కూడా



ఏర్పడ్డాయి. వాటికి కూడా ఆర్థిక ప్రాధాన్యాలు ఉన్నాయి. ఆదాయ వ్యయాల మదింపు ఉంది. కానీ, వాటిని ఆర్థికాభివృద్ధిలో భాగంగా పరిగణించడం లేదు. నిజానికి, పంచాయతీలు కూడా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించవచ్చు. సామాజిక న్యాయం కోసం ప్రయత్నించవచ్చు. స్థానిక ప్రజాస్వామ్యానికి అవసరమైన ప్రక్రియలు, పద్ధతులను పెంపొందించు కోవచ్చు. ఇటువంటివి ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేస్తాయి.

అయితే, దేశంలోని అత్యధిక శాతం పంచాయతీలు స్వయం పాలన సంస్థలుగా పనిచేయడం లేదు. కేవలం ప్రభుత్వాల ఏజెంట్లుగా మాత్రమే పనిస్తున్నాయి. రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలో పంచాయతీ

# శుష్కప్రియాలు, శూన్యహస్తాలు!

రాజ్ సంస్థలు భాగం కానే కాదు.

ఈ రెండు రాజ్యాంగ సవరణలను బట్టి పంచాయతీలు, పురపాలక సంఘాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోనే కాకుండా, కేంద్ర ఆర్థిక వ్యవస్థలో కూడా అంతర్భాగమని అర్థం అవుతూనే ఉంది. అయితే, ఈ వాస్తవాన్ని ఏ ప్రభుత్వమూ, ఏ రాజకీయ పక్షమూ గుర్తించడం లేదు. కేంద్ర ఆర్థిక సంఘంతో పాటు రాష్ట్ర ఆర్థిక సంఘం కూడా క్రమబద్ధంగా పంచాయతీల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అటు కేంద్ర ఆర్థిక సంఘం, ఇటు రాష్ట్ర ఆర్థిక సంఘం పంచాయతీల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, పంచాయతీలకు ఇవ్వాల్సినంత ప్రాధాన్యం ఇచ్చిన పక్షంలో దేశంలో చిన్న పట్టణాలు, గ్రామాల స్థాయిలో ప్రాథమిక అవసరాలు



తీరిపోవడంతో పాటు, అవి ఆర్థికంగా కూడా పరిపుష్టం అయ్యేవి. అంతేకాదు, కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాలు సమన్వయంతో పని చేస్తూ ఉంటే సహకార సమాఖ్య పెంపొందేది. తాగునీరు, ప్రాథమిక విద్య వంటి మౌలిక సదుపాయాలు ప్రతి పౌరుడికీ అందడానికి అవకాశం ఉండేది.

**స్వపరిపాలనకు ప్రాధాన్యం**

వికేంద్రీకరణకు సంబంధించిన సంస్కరణలు పురోగతి చెందాలన్న పక్షంలో వీటిలో తరచూ మార్పులు, చేర్పులు అవసరం. ప్రభుత్వ ఆదాయ వ్యయాలను పునర్నిర్మించాలని 11, 12వ ఆర్థిక సంఘాలు సిఫారసు చేశాయి కానీ వాటిల్లో ఎక్కడా పంచాయతీలకు అవకాశం కల్పించలేదు. పంచాయతీలకు స్థానిక కేటాయింపులు ఉండాలని, పనితీరును బట్టి కూడా ఆర్థిక కేటాయింపులు జరపాలని, వీటికి కూడా ఒక ఆడిటింగ్ వ్యవస్థ ఉండాలని, ఒక పర్యవేక్షణాధికారిని నియమించాలని, పంచాయతీల స్థాయిలో కూడా ఆస్తి పన్ను వసూలు చేయాలని 14వ ఆర్థిక సంఘం సూచించింది. కానీ అటువంటివేవీ అమలుకు మాత్రం నోచుకోలేదు. కొన్ని రాష్ట్ర ఆర్థిక సంఘాలు పంచాయతీలకు ప్రాధాన్యం ఇవ్వడం, వాటిని అభివృద్ధి చేయడం వంటి విషయాల్లో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సిఫార్సులను అవి అరకొర సిఫార్సులుగా, నిర్దిష్టమైన సూచనలు లేనివిగా కొట్టి పారేస్తున్నాయి.

వికేంద్రీకరణకు సంబంధించిన సంస్కరణల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒక పట్టాన సమన్వయం కుదరడం లేదు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం గతంలోనూ, ఇప్పుడూ కొన్ని మార్గదర్శకాలను జారీ చేసినప్పటికీ, నిధుల విషయంలో పంచాయతీలకు అధికారాలివ్వడానికి అనేక రాష్ట్ర ప్రభుత్వాలు సంసిద్ధంగా లేవు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ కార్యకలాపాలను, అధికారాలను, నిధులను, నియామకాలను పంచాయతీలకు అప్పగించడానికి ఒప్పుకోవడం లేదు. ఒక్క గుజరాత్ ప్రభుత్వం మాత్రమే కొద్దో గొప్పో ఈ మార్గదర్శకత్వాలను పాటించడం జరిగింది. విచిత్రమేమిటంటే, కొన్ని రాష్ట్రాలు పంచాయతీలకు పోటీగా కొన్ని సంస్థలను సృష్టించి, వాటిని తమ అదుపాజ్ఞల్లో పెట్టుకుని, వాటికి నిధులివ్వడం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు సృష్టించిన ఈ పోటీ సంస్థలు స్థానిక పాలనను, స్థానిక ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టిస్తున్నాయి.

**ప్రభుత్వాలతో సమస్యలు**

పార్లమెంట్ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక అభివృద్ధి ప్రాజెక్టులు ఏర్పడి స్థానిక సంస్థల తరఫున అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోంది. శాసన సభ్యుల ఆధ్వర్యంలో కూడా ఇటువంటి అభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేసి వాటి ద్వారా కూడా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతోంది. అంతేకాదు, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల ప్రాధాన్యాన్ని పక్కన పెట్టి అనేక సంస్థల ద్వారా పంచాయతీల్లోని గ్రామాలను అభివృద్ధి చేయడం జరుగుతోంది. నిజానికి ఈ పోటీ సంస్థలేవీ స్థానిక ప్రజల ఆశయాలకు, అవసరాలకు తగ్గట్టుగా పనిచేయడం లేదు. గత మూడు దశాబ్దాల నుంచి ఈ పోటీ సంస్థలే పంచాయతీల్లో రాజ్యమేలుతున్నాయి. మొదటి నుంచి పంచాయతీ సంస్థలు, స్థానిక సంస్థలను బలహీనపరచడానికే ప్రభుత్వాలు కృషి చేయడం శోచనీయం. పంచాయతీలు ఆర్థికంగా బలంగా ఉంటే, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక సమస్యలుండవు. ఆర్థికంగా పరిపుష్టం అయ్యేవి. ప్రభుత్వ ఖజానా మీద ఒత్తిడి తగ్గేది. గ్రామ సీమల్లో ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి జరిగేది. ప్రభుత్వాలు కేవలం తమ ఆర్థిక, రాజకీయ ఆధిపత్యం కోసం పంచాయతీ వ్యవస్థకు సమాధి కడుతున్నాయి. పంచాయతీలతో పోలిస్తే పురపాలక సంఘాలు ఆర్థికంగా శక్తిమంతంగా ఉంటున్నాయి.

పంచాయతీలకు తమ ఆదాయాన్ని తామే సృష్టించుకునే అవకాశం కల్పించడం చాలా అవసరం. దేశంలో అనేక పంచాయతీలకు ఆస్తి పన్ను వసూలు చేసే అధికారం లేదు. పంజాబ్, హర్యానా, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ఆస్తి పన్ను వసూలు చేయడమన్నది లేనే లేదు. పంచాయతీ సంస్థలు తమను తాము నిర్వహించుకోవడానికి అవసరమైన నిధుల్లో పది శాతం నిధులను కూడా పొందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలు తమ మీద ఆధారపడి ఉండేలా చేసుకుంటున్నాయి. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం, స్వయం పాలన వంటివేవీ ఉండడం లేదు. స్థానిక సంస్థలకు, పంచాయతీ సంస్థలకు ఆర్థిక స్వావలంబన ఏర్పడడం అనేది సుదూర కాలంలో ఎక్కడా కనిపించడం లేదు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయడానికి, ఆర్థిక అధికారాలను పంచుకోవడానికి 16వ ఆర్థిక సంఘం చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వ సిఫార్సులను, మార్గదర్శకాలను రాష్ట్రాలు రాజకీయ కోణంలో కాకుండా ఆర్థిక, సామాజిక కోణాల్లో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. పంచాయతీలను పరిపుష్టం చేయడానికి ఆర్థిక సంఘాలు, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా సంసిద్ధంగా ఉన్నాయి. ఈ ఆశయం ఫలించడం అవసరం. ఇది జరిగే పక్షంలో దేశ ప్రజాస్వామ్యానికి దీనినొక గొప్ప విజయంగా భావించవచ్చు.



**జి.రాజశుక**
సీనియర్ జర్నలిస్ట్



# 27 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

భారత్‌లో కటిక పేదరికం నుంచి 26.9 కోట్ల మంది విముక్తి పొందారని ప్రపంచ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడించింది. కీలకమైన ఈ పరిణామం 2011-12 నుంచి 2022-23 మధ్య కాలంలో చోటు చేసుకుంది. 2011-12లో తీవ్ర పేదరికంలో ఉన్నవారి శాతం 27.1కాగా 2022-23నాటికి అది 5.3 శాతానికి చేరుకుంది. అంటే పేదవాళ్ల సంఖ్య 34.45 కోట్ల నుంచి 7.52 కోట్లకు తగ్గింది. ఈ తగ్గుదల ప్రధానంగా మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో కనిపించింది. 2017లో ధరల ఆధారంగా రోజుకు 2.5 డాలర్ల కంటే తక్కువ ఆదాయం ఉన్నవారిని కడు పేదరికంలో ఉన్నవారిగా గుర్తించారు. దీని ప్రకారం 2011లో దేశజనాభాలో 16.2 శాతంగా ఉన్న నిరుపేదలు 2022నాటికి 2.3 శాతానికి తగ్గారు. అత్యంత నిరుపేదలుగా ఉన్న వారి సంఖ్య 20.59 కోట్ల నుంచి 3.36 కోట్లకు తగ్గింది. దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ పేదరికం తగ్గింది. ఈ 11 సంవత్సరాల్లో గ్రామీణ పేదరికం 18.4 శాతం నుంచి 2.8 శాతానికి, పట్టణ పేదరికం 10.7 శాతం నుంచి 1.1 శాతానికి తగ్గింది. ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు వంటి అంశాల్లో మెరుగుదల భారత్‌లో పేదరికం తగ్గడానికి దోహదం చేసింది. కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు గడచిన 11 సంవత్సరాల్లో అమలు చేసిన పీఎం ఉజ్వల యోజన, జన్‌ధన్ యోజన, ఆయుష్మాన్ బీమా వంటి పథకాలు పేదరికాన్ని తగ్గించడంలో కీలకమైన పాత్ర పోషించాయని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. పైన పేర్కొన్న పథకాలతో పేదలకు వంటగ్యాస్, బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణ, పథకాల ప్రయోజనాలను లబ్ధిదారులకు నేరుగా బదిలీ చేయడం, డిజిటల్ సమ్మిళితత్వం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల్లో మెరుగుదల, తదితరాలు ఈ 11 ఏళ్లలో 26.9 కోట్ల మంది కడు పేదరికం నుంచి విముక్తి పొందడానికి దోహదపడ్డాయని ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది.

# ట్రంప్‌కు తాతగారి బర్త్ సర్టిఫికేట్ బహూకరణ



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను తొలిసారి కలవడానికి శ్వేతసౌధానికి జూన్ 5న వెళ్లిన జర్మనీ ఛాన్సెలర్ ఫ్రెడరిక్ మెర్జ్ ఆయనకు మరుపురాని బహుమానాన్ని అందించారు. ట్రంప్ తాతగారైన ఫ్రెడరిక్ ట్రంప్ జనన ధ్రువీకరణ పత్రాన్ని బంగారు ఫ్రేమ్‌లో పెట్టించి ఇచ్చారు. ఫ్రెడరిక్ ట్రంప్ 1869లో పాలాటినేట్ ప్రాంతంలోని కల్‌స్టాడ్‌ట్‌లో జన్మించారు. అమెరికా అధ్యక్షుడు తాతగారి బర్త్ సర్టిఫికేట్‌ను చూసుకొని మురిసిపోయారు. పుట్టిన ఊరును పదేపదే పలికి ఇది జర్మనీలోదే అని ధ్రువీకరించుకున్నారు. అద్భుతంగా ఉందన్నారు. ధన్యవాదాలు తెలుపుకున్నారు. దానిని తగిన చోట ఉంచి తగురీతిన గౌరవిస్తాం అని అన్నారు. ఆ తర్వాత చేత్తో సర్టిఫికేట్‌ను పట్టుకొని దీన్ని ఎక్కడ తగిలించాలా అని గది అంతటా కలయ దిరుగుతూ, గోడల వైపు చూస్తూ అక్కడ ఉన్నవారిని నవ్వుల్లో ముంచెత్తారు. తాతగారి జన్మస్థలాన్ని చూడటానికి జర్మనీ రావాల్సిందిగా అమెరికా అధ్యక్షుడ్ని మెర్జ్ ఆహ్వానించారు. డోనాల్డ్ ట్రంప్‌కు ఆయన కుటుంబాన్ని గుర్తు చేస్తున్నట్టుగా ఓ చిన్న కానుకను ఆయనకు ఇచ్చాను అని పేర్కొంటూ జర్మనీ ఛాన్సెలర్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ట్రంప్ తాతగారు జన్మించిన సమయానికి ఆయన పుట్టిన ప్రాంతం బవారియా రాజ్యంలో భాగంగా ఉంది. అందుకని బవారియా అధికారులు ఆయన జనాన్ని ధ్రువీకరించారు. ఇదే విషయాన్ని నిర్ధారిస్తున్నట్టుగా ఫ్రెడరిక్ ట్రంప్ బాడ్‌దుర్క్ హైమ్ పట్టణానికి దగ్గర్లో జన్మించారని మెర్జ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. కాకతాళీయంగా అమెరికా అధ్యక్షుడి తాతగారి పేరులో మొదటిపేరు, జర్మనీ ఛాన్సెలర్ పేరులో మొదటి పేరు ఒకటే కావడం విశేషం.

# నెదర్లాండ్స్‌లో గుండె తయార్



నెదర్లాండ్స్ పరిశోధకులు మెత్తటి గుండెలు తయారు చేసే పనిలో పడ్డారు. ఈ మేరకు ఒక నమూనా గుండెను సిద్ధం చేశారు. దీనికి సంబంధించిన విశేషాలను సైన్సు పత్రిక నేచర్ కమ్యూనికేషన్ ప్రచురించింది. కృత్రిమంగా తయారైన ఈ గుండె శరీరంలో అన్ని భాగాలకు రక్తాన్ని సహజమైన గుండెకు దీటుగా పంపించింది. సింథటిక్ ఇన్నర్ లైనింగ్‌తో పాటు రోబోటిక్ కండరాన్ని కలిగి ఉన్న దీనిని హైబ్రీడ్ గుండె అని కూడా అంటున్నారు. దీనిలోని రోబోటిక్ కండరం సహజమైన హృదయంలోని లయ, మృదువైన కణజాలాన్ని ముమ్మూర్తులా కలిగి ఉంటుంది. ఇది రక్తాన్ని గడ్డకట్టనివ్వదు. ఇన్ఫెక్షన్ లాంటి సమస్యలను తగ్గిస్తుంది. శరీరంతో పాటుగా పెరిగే ఈ రోబోటిక్ గుండెను అన్ని వయసులవారికి అమర్చవచ్చు. గుండె తయారీలో ఉపయోగించిన సింథటిక్ పదార్థం విచ్ఛిన్నం కావడంతో క్రమంగా సహజ కణజాలం ఏర్పడుతుందని కృత్రిమ గుండె పరిశోధనలో పాలుపంచుకున్న నెదర్లాండ్స్‌లో ఐండ్‌హోవెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కార్లిజ్ బౌటెన్ తెలిపారు. గతంలో గుండెకు సంబంధించిన కవాటాలు, రక్తనాళాలు, రక్తప్రసరణ మండలాన్ని తయారు చేశామని, అవి విజయవంతంగా పనిచేశాయని చెప్పారు. ప్రస్తుతం పూర్తి స్థాయి గుండెను తయారు చేసే దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు.

# అడుగంటిన పాక్ జలాశయాలు

భారత్ పెహల్గావ్ ఉగ్రదాడికి ప్రతిగా సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేయడంతో పుట్టుకొచ్చిన నీటి కష్టాలతో పాకిస్తాన్ సతమతమైపోతోంది. పలు జలాశయాల్లో నీటి మట్టం అడుగంటిపోయింది. పొరుగుదేశంలోని పంజాబ్ ప్రావిన్సులో గతేడాది జూన్ 5న నీటి



విడుదల 1.44 లక్షల క్యూసెక్కులు ఉండగా ఈ ఏడాది అదే తేదీకి 1.24 లక్షల క్యూసెక్కులకు పడిపోయింది. ఇటీవల అందుబాటులోకి వచ్చిన డేటా ప్రకారం ఖైబర్ పఖ్తుంఖ్వాలోని టార్బెలా ఆనకట్ట వద్ద సింధూనది నీటి మట్టం 1.465 మీటర్లకు తగ్గింది. దీని కనిష్ట నీటిమట్టం 1,402 మీటర్లు. అలాగే పంజాబ్‌లోని చస్మా ఆనకట్ట వద్ద ప్రస్తుతం నీటిమట్టం 644 మీటర్లుగా ఉంది. కానీ దాని కనిష్ట మట్టం 638 మీటర్లు. మీర్పూర్‌లోని జీలం నదిపై ఉన్న మంగ్లా ఆనకట్ట వద్ద నీటిమట్టం 1,163 మీటర్లు కాగా కనిష్ట నీటిమట్టం 1,050 మీటర్లు. సియాల్‌కోట్‌లోని మరాలా వద్ద చీనాబ్ నదిపై ఆనకట్ట నుంచి మే 28న 26,645 క్యూసెక్కులు నీటి ని విడుదల చేయగా, జూన్ 5నాటికి అది 3,064 క్యూసెక్కులకు పడిపోయింది.



# 11 ఏళ్ల పాలనపై పాట

నరేంద్ర మోదీ సర్కారు అధికారంలోకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని భారతీయ జనతాపార్టీ(బీజేపీ) **జూన్** 9న ఒక పాటను విడుదల చేసింది. ఆ పాటకు 'సఫర్ చల్ రహా హై, దేశ్ బదల్ రహా హై' (ప్రయాణం కొనసాగుతోంది, దేశం మార్పు చెందుతోంది) అనే పేరు పెట్టింది. మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మూడవసారి పాలనాపగ్గాలు చేపట్టిన తర్వాత దాకా మోదీప్రభుత్వం సాధించిన కీలకమైన ఘనతలను పాటలో పొందుపరిచింది. అలా ప్రస్తావించిన వాటిలో ఆర్థిక సమ్మిళితత్వం, ప్రజా సంక్షేమ పథకాల ద్వారా దీనజనోద్ధరణ, జాతి ఆధ్యాత్మిక వారసత్వ సంపద వృద్ధి, దేశీయంగా తయారైన రక్షణ సామాగ్రి, సైనిక చర్య ద్వారా దేశ సరిహద్దుల పరిరక్షణ లాంటివి ఉన్నాయి. కృత్రిమ మేధ ఆధారంగా రూపొందిన వీడియోలో మోడీ ప్రభుత్వ హయాంలో విజయవంతమైన ఉజ్వల్ యోజన, మేకిన్ ఇండియా లాంటి మైలురాళ్లు ఉన్నాయి. అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ లాంటి చరిత్రాత్మక ఘట్టాలు కూడా ఉన్నాయి. నేపథ్యంలో ఇంద్రధనుస్సుతో మొదలయ్యే వీడియోలో ప్రధాని నరేంద్రమోదీ చీనాబ్ వంతెనను జాతికి అంకితం చేసిన ఘట్టం కూడా ఉంది. వ్యక్తిగత లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటి సాధనకు కట్టుబడి ఉండాలనే సందేశాన్ని సైతం దేశ ప్రజలకు బీజేపీ విడుదల చేసిన వీడియో పాట ఇచ్చింది.



# సాగరతాపం.. జీవరాశికి శాపం!

గ్రీన్‌హౌస్ వాయువుల కారణంగా వేడెక్కిన వాతావరణంలో 90 శాతానికి పైగా వేడిని స్వీకరిస్తున్న సముద్రాలు అంతే స్థాయిలో వేడెక్కుతున్నాయి. సాగర జీవరాశులు విలవిలలాడిపోతున్నాయి. సాగర గర్భంలో ఆక్సిజన్ స్థాయిలు నానాటికి పడిపోతున్నాయి. ఆ కారణంగా పెద్ద ఎత్తున ఆమ్లీకరణ – యాసిడిఫికేషన్ జరుగుతున్నది. సముద్రాల్లో మృతజీవుల అస్థిపంజరాల్లోని కాల్షియంను ఆమ్లాలు తినేస్తున్నాయి. దీంతో సాగర జీవులకు ఆక్సిజన్‌తో పాటుగా సరిపడినంత కాల్షియం లభించడంలేదు. సాగరతాపం భూగోళంపై తన ప్రభావాన్ని చూపిస్తోంది. యావత్ మానవాళికి అతి సమీపకాలంలో పెను ముప్పుగా మారనుంది. ఇదంతా కూడా భూమిపై అడ్డూ అదుపూ లేకుండా శిలాజ ఇంధనాలను మండిస్తున్న కారణంగా, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల వల్ల జరుగుతోందని యూరోపియన్ మెర్కటోర్ ఓషన్ మానిటర్‌కు చెందిన ఓషనోగ్రాఫర్ అంగెలిక్ మెలెట్ తెలిపారు. ఐక్యరాజ్యసమితి–ఐరాసకు చెందిన ఐపీసీసీ క్లయిమేట్ ఎక్స్‌పర్ట్ ప్యానెల్ ప్రకారం 1993 నుంచి ఇప్పటివరకు చూస్తే సాగరాల్లో వేడిమి రెండింతలు అయ్యింది. 2023, 2024 సంవత్సరాల్లో సగటు సముద్రమట్టం ఉష్ణోగ్రతలు కొత్త రికార్డులను నెలకొల్పాయి. ఐరోపా యూనియన్‌కు చెందిన కోపర్నికస్ క్లయిమేట్ మానిటర్ డేటా ప్రకారం 2025 మొదట్లో కాస్త ఊరటను ఇచ్చినప్పటికీ ఆ తర్వాత ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగి పోయాయి. మధ్యధర, ఉత్తర అట్లాంటిక్, ఆర్కిటిక్ సముద్రాల్లో ఉష్ణోగ్రత ప్రతీ మూడేళ్లకు ఒకసారి సరికొత్త రికార్డును సృష్టిస్తోంది. అది తీరప్రాంత ప్రజలను బెంబేలెత్తి స్తోందని ఫ్రాన్సులో సీయాఎంఎస్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన థిబాల్ట్ గునాల్ట్ తెలిపారు. సాగరాల నుంచి వడగాడ్పులు గతంతో పోలిస్తే రెండింతలు అయ్యాయని ఐరాసకు చెందిన ఐపీసీసీ సముద్రాలపై వెలువరించిన ఒక ప్రత్యేక నివేదికలో వెల్లడించింది.

వేడెక్కుతున్న సాగర జలాలు పగడపు పురుగులు లాంటి జీవుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. సముద్రాలపై పెను ప్రభావాన్ని చూపిస్తున్న భూతాపం

# వృద్ధుడి ఇంటికి నడిచొచ్చిన న్యాయస్థానం



జస్టిస్ స్వామినాథన్




మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వామినాథన్ ఓ కేసుకు సంబంధించి నిజానిజాలు తెలుసుకోవడానికి కదలలేని స్థితిలో ఉన్న ఓ 83 ఏళ్ల వృద్ధుడి చెంతకు వెళ్లారు. పరిస్థితిని గమనించారు. మానవత్వంతో ఆలోచించారు. బాధితుడికి న్యాయం చేశారు. 2023లో జస్టిస్ స్వామినాథన్ దృష్టికి ఒక పిటిషన్ వచ్చింది. పిటిషన్‌లో శివకుమార్ చెల్లదురై అనే వ్యక్తి అతడి తండ్రి పీకేఎం దురై ఆస్తులకు మేనేజర్‌గా తనను నియమించాలని, ఆస్తులను అమ్ముకోవడానికి అనుమతించాలని కోర్టును వేడుకున్నాడు. ఆ పిటిషన్ ది లెటర్స్ పాటెంట్‌లో క్లాజు 17 కింద దాఖలైంది. ఆ క్లాజు పిటిషనరుకు 'మైనర్లు, చపలచిత్తులు, తెలివితక్కువవారి' బాగోగులు చూసుకునేలా హైకోర్టును అనుమతిస్తుంది. అయితే పిటిషనర్ తండ్రి దురైకు 83 ఏళ్లు. 2021లో గుండెపోటు వచ్చింది. అప్పట్నుంచి మంచానికి పరిమితమైపోయారు. మాటపడిపోయింది. ట్యూబులతోనే ఆహారం తీసుకునేది. అదే సమయంలో తన తండ్రికి మతిస్థిమితం లేదని పిటిషనర్ పేర్కొన్నాడు. దీంతో కేసు విచారణ నిమిత్తం జస్టిస్ స్వామినాథన్ నేరుగా దురై దగ్గరకు వెళ్లారు. కూడా తన భార్య, దివ్యాంగులకు సేవలు అందిస్తున్న కామాక్షిని కూడా తీసుకొని వెళ్లారు. కామాక్షి ఒక కాగితం మీద ఒకదాని కింద ఒకటి అన్నట్టుగా 'ఇల్లు', 'ఆసుపత్రి' అని రాసి దొరైకి ఇచ్చారు. ఆయన ఆసుపత్రి వైపు వేలు చూపించారు. అయితే ఆసుపత్రిలో చేరడం మీకిష్టమేనా అని జస్టిస్ స్వామినాథన్ అడగ్గానే దొరై పొగిలి పొగిలి ఏడ్చారు. కామాక్షి కాగితాన్ని ఓ తిరగేసి మరోసారి ఆసుపత్రి, ఇల్లు అనే పదాలు రాసి దొరైకి ఇచ్చారు. ఈసారి ఆయన ఇల్లు అనే పదాన్ని చేతితో తాకారు. ఇంట్లో ఉంటే తనకు సౌకర్యవంతంగా ఉంటుందని సైగలతో చెప్పారు. ఆ తర్వాత దురై భార్య, చిన్నకుమారుడితో జడ్జి మాట్లాడారు. పిటిషనర్ తండ్రిని చూడ్డానికి ఇంటికి వస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వారు తెలిపారు.

జస్టిస్ స్వామినాథన్ జూన్ 3న ఇచ్చిన తీర్పులో ''శారీరక పరిస్థితి కారణంగా ఆయన(దొరై) లాలాజలాన్ని స్రవిస్తున్నారు. అలాంటప్పుడు దాన్ని తన ఎడమచేతిలో ఒక చేతిరుమాలతో తుడుస్తున్నారు. ఏడ్చినప్పుడు అదే చేతిరుమాలుతో కన్నీళ్లను

1.5 డిగ్రీల సెల్సియస్ పెరిగిన పక్షంలో 70 నుంచి 90 శాతం మేరకు పగడపు పురుగులు ఈ శతాబ్దంలో అంతరించిపోతాయనే ఒక అంచనాకు నిపుణులు వచ్చారు. మరోవైపు వాతావరణ మార్పు కారణంగా హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయి. భూగోళాన్ని ఆవరించి ఉన్న సముద్రాల్లో నీటి మట్టాలను పెంచుకుంటూ పోతున్నాయి. సముద్ర మట్టాలు గడిచిన మూడు దశాబ్దాల్లో రెండింతలు పెరిగాయి. ఏడాదికి ఒక సెంటీమీటరు చొప్పున ఇలాగే పెరుగుతూ పోయిన పక్షంలో 2100 నాటికి మరోసారి రెండింతలు అవుతాయని ఐరాస నివేదిక హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 23 కోట్ల మంది ప్రజలు సముద్రమట్టానికి కేవలం ఒక మీటరు ఎత్తులోనే జీవిస్తున్నారు. అలాంటివారు సాగర తాపం కారణంగా వరదలు, తుపానుల బారిన పడతారని మెలెట్ తెలిపారు. ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాల్లో ఐస్ పొర కరిగిపోతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 10 లక్షల చదరపు మైళ్లమేరకు ఐస్ పొర కరిగిపోయిందని చెప్పారు. శిలాజ ఇంధనాల వినియోగాన్ని, గ్రీన్‌హౌస్ ఉద్గారాలను తగ్గించుకోవడం ద్వారా రానున్న నష్టాన్ని కొంతమేరకు తగ్గించుకోవచ్చునని చెప్పారు.



# అంతర్జాతీయ అల్పాహారాల్లో మిసల్ పావ్.. పరోటా..చోలే భటురే..

**భా**రతీయ వంటకాలు ముఖ్యంగా అల్పాహారాల పట్ల యావత్ ప్రపంచం అమితమైన ఆసక్తిని ప్రదర్శిస్తోంది. ఇదే విషయాన్ని టేస్ట్ అట్లాస్ అనే సంస్థ ధ్రువీకరించింది. ఈ ఏడాదికి ప్రపంచంలో అత్యంత ఆదరణపొందిన 50 వంటకాలు, అల్పాహారాల జాబితాను టేస్ట్ అట్లాస్ ఇటీవల విడుదల చేసింది. వాటిలో భారతీయ అల్పాహారాల్లో మూడింటికి చోటు దక్కింది. జాబితాలో మిసల్ పావ్‌కు 18వ స్థానం, పరోటాకు 23వ స్థానం, చోలే భటురేకు 32వ స్థానం దక్కింది. మిసల్ పావ్ గురించి టేస్ట్ అట్లాస్ వివరిస్తూ ఈ అల్పాహారం కాస్త కారంగా ఉంటుంది. దీని అడుగుభాగం కొంచెం కరకరలాడుతుంటుంది. దీనిపైన గోధుమ, ఆకుపచ్చ, నారింజ రంగులో ఉండే పదార్థాలను అద్దాలి. అలా చూడగానే ఓ అద్భుతమైన కళాఖండాన్ని ఇది గుర్తు చేస్తోంది అని తెలిపింది. మిసల్‌పావ్‌ను బ్రెడ్, బీన్స్, వేరుశెనగ పచ్చడి, పెరుగు, ఉడికించిన బంగాళాదుంప, ఉల్లిపాయ, టమాటా, కొత్తిమీర తురుముతో చేస్తారు. జాబితాలో 23వ స్థానం పొందిన పరోటాను ఒక రకమైన బ్రెడ్‌గా టేస్ట్ అట్లాస్ వర్ణించింది. దీన్ని గోధుమ–మైదా పిండితో చేస్తారు. పరట్, అట్టా పదాలను కలిపి రపోటా అని పిలుస్తారు. నెయ్యి లేదా నూనెతో పెనంపైన కాలిస్తే పొరలు పొరలుగా రుచికరంగా తయారయ్యే పరోటా అల్పాహారంగా ఆహార ప్రియుల ఆదరణ పొందింది. వివిధ రూపాల్లో కనిపించే పరోటాలో కొన్నిచోట్ల ఉడికించిన బంగాళాదుంప, మిర్చి, కాలిఫ్లవర్ తురుము, వెల్లుల్లి, అల్లం, పన్నీర్ వంటివి కలిపి చేసిన కూరను పరోటా మధ్యలో కూర్చి తయారు చేస్తుంటారు. జాబితాలో 32వ స్థానం దక్కించుకున్న చోలా భటురే శనగలు, కాల్చిన బ్రెడ్‌ల సమాహారం. దీనిని టమాటా, ఉల్లిపాయ ముక్కలు, చీజ్, ఉడికించిన బంగాళాదుంపల ముక్కలతో ఇస్తారు. ఛోలే భటురే ఢిల్లీలో ఎనిమిది దశాబ్దాలకుపైగా పేరొందిన అల్పాహారం.

తుడుచుకున్నారు. దీన్ని బట్టి నేను స్పష్టంగా చెబుతున్నది ఏమిటంటే శ్రీ పీకేఎం దురైగారు తీవ్రమైన శారీరక రుగ్మతలతో బాధపడుతున్నారు. కానీ ఆయన మానసిక స్థితి బాగుంది. ఆయనను ఒక చపలచిత్తులు లేదా తెలివితక్కువవారు అని ఊహించుకోవడానికి కూడా అవకాశం లేదు. ప్రస్తుతం ఆయనకు కావాల్సింది ప్రేమతో చూసుకునేవారు. ఆసుపత్రికి తరలిస్తే ఆయన ఒంటరితనంతో కుమిలిపోతారు. ఐసీయూకే పరిమితమైపోతారు. అదే ఇంట్లో అయితే ఆయన చుట్టూ మనవళ్లతో పాటుగా ఆయన కుటుంబ సభ్యులు ఉంటారు. ఆయన ప్రయోజనాలకే మనం పెద్ద పీట వేయాలి. న్యాయం కోరే అర్హత ఈ పిటిషన్‌కు లేదని తెలిసి నేను ఎంతో సంతృప్తి చెందుతున్నాను" అని అన్నారు.



# డ్రోన్లతో రైళ్లు శుభ్రం

**రై**ళ్లను, రైలు బోగీలను, రైల్వేస్టేషన్ పరిసరాలను శుభ్రం చేసే పనిని డ్రోన్‌లకు అప్పగించాలని భారతీయ రైల్వేలు నిర్ణయించింది. ఇందులో భాగంగా వాటి పనితీరును అసోంలోని కామాఖ్య రైల్వేస్టేషన్‌లో ప్రయోగాత్మకంగా పరీక్షించారు. రైళ్లలోనూ, రైలు ప్లాట్‌ఫామ్‌లపైన మానవమాత్రులు చేరుకోవడానికి సాధ్యం కాని చోట్లకు డ్రోన్‌లు చేరుకున్నాయి. అప్పగించిన పనిని శుభ్రంగా చేసిపెట్టాయి. బీజేపీ నేత దిలీప్ ఘోష్ దీనికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దేశపురోగతికి నవతరపు యంత్రాలు చాలా ముఖ్యం అని వ్యాఖ్యానించారు. భారతీయ రైల్వేలు రైల్వే మౌలిక సదుపాయల భద్రత, నిర్వహణకోసమని తొలిసారిగా 2018లో డ్రోన్‌లను రంగంలోకి దించింది.

కథ

# ఆనాటి ప్రేమకథ

**శ్రీమతి భారతీ కృష్ణ**

"అమ్మాయ్ శారదా వీధి తలుపు చప్పుడవుతోంది. ఎవరో చూడు."

"అలాగే నాన్నా"

''రాత్రి ఎనిమిదవుతోంది. లాస్ట్ బస్ వచ్చుంటుంది.

"ఎవరైనా చుట్టాలేమో... చూడు."

తలుపు తీసి చూస్తే... చేతిలో చిన్న బ్యాగ్ పట్టుకొని ఓ కుర్రాడు నిలబడి ఉన్నాడు. ఎక్కడో చూసినట్టుంది.

"శర్మగారిల్లు ఇదేనా...?"

"ఆ ఇదే రండి లోపలికి..."

"ఎవరమ్మా...?

"నా పేరు శ్రీరామండి... మాది వైజాగ్.. మీ పెద్దమ్మాయి ఇంటి పక్కనే ఉంటాము.. ఈ ఊరిలో మా నాన్నగారి స్నేహితులు ఉన్నారు. వారితో చిన్న పనుండి వచ్చాను. మీ ఇంటిలో ఉండమని మీ అమ్మాయి చెప్పారు."

"అవునా.. అలాగా..."

అడగాలనుకున్నాను.

''శారదా భోజనానికి రమ్మను..'' అమ్మ పిలిచింది...

''పదండి భోజనానికి..'' అంటూ లోపలికి తీసుకెళ్లాను.

ఇలా చుట్టాలు రావడం మాకు అలవాటే.. బంధువులెక్కువ... వచ్చీపోయే ఇల్లు.. రాత్రిళ్లు ఎవరైనా వస్తారేమోనని.. అమ్మ భోజనం సిద్ధంగా ఉంచుతూనే ఉంటుంది. వస్తే తింటారు. లేకపోతే, మర్నాడు ఆ మిగిలిన అన్నం నాకూ తమ్ముడికి చద్దన్నంగా పెట్టేస్తుంది... శ్రీరాంకి కొసరి కొసరి వడ్డించి కడుపు నింపేసింది... నాన్న వీధి అరుగు మీద తన మంచం పక్కనే శ్రీరాం కోసం మడత మంచం వేసి పక్క సిద్ధం చేసాడు.. నేను, అమ్మ గదిలో పడుకున్నాం.. ఎంతకీ నిద్రపట్టడం లేదు.

వైజాగ్‌లో అక్కా వాళ్ల పక్క వాటాలో... బామ్మగారు ఉండేవారు. వాళ్ల అమ్మాయి కుసుమ నాతో చాలా బాగా మాట్లాడేది.

ఇద్దరం మంచి స్నేహితులమైపోయాము. ఈ కావాలనిపించదు. కదండీ ..'' అన్నాడు అమ్మ పెట్టిన ఇడ్లీలు తింటూ.

"అవునా మా కలవాటైపోయింది." అన్నాను. బిడియమో.. అతనెదురుగా మొహమాటమో తెలియదు కానీ సరిగ్గా మాట్లాడలేకపోతున్నాను.

''నువ్వు కూడా స్నానం చేసి రావే ఇడ్లీ తిందువుగాని అంది." అమ్మ.

అమ్మో... ఇతనెదురుగా ఇంట్లో తిరుగుతూ, పనులన్నీ చెయ్యడానికీ, గుమ్మంలో ముగ్గు వేయడానికే ఇబ్బందిగా ఉంది. "తర్వాత చేస్తాను లే.." అన్నాను. వదలదుగా పదే పదే చెప్తూనే వుంది. అమ్మ అర్థం చేసుకోదు.

ఇంతలో నాన్న వచ్చి, మీ నాన్నగారి స్నేహితుడి దగ్గరకు తీసికెళ్తాను పద ఓయ్ అన్నాడు. "సరేనండి" అంటూ శ్రీరాం నాన్నతో బయటకు వెళ్లాడు. బతికానురా దేవుడా అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నాను.

* * *

మధ్యాహ్నం భోజనంలో రకరకాల కూరలు,

ఇదుగో మీకు ఇమ్మని ఈ ఉత్తరం రాసిచ్చారంటూ జేబులోంచి అక్క రాసిన ఉత్తరం తీసి ఇచ్చాడు.

"సరేలే నాయనా...కాళ్లు కడుక్కో... శారదా నూతి దగ్గరకు తీసుకెళ్లు... అలాగే అమ్మతో చెప్పు... భోజనం వడ్డించమను."

అల్మారాలో నుండి ఇస్త్రీ తువ్వాలు, పెరట్లో అరుగు మీద ఉన్న గూట్లో నుండి సబ్బు పెట్టి తీసి ఇచ్చాను. నూతిలో నుండి నీళ్లు తోడి బకెట్‌లో పోసాను. మొహం, కాళ్లు చేతులు కడుక్కొని, తువ్వాలుతో తుడుచుకుంటూ..

"మీరు నన్నుగుర్తు పట్టలేదా..?" అన్నాడు.

అప్పుడు సరిగ్గా చూసాను.

అక్కా వాళ్లింటికెళ్లినప్పుడు చూసాను. గుర్తుకొచ్చాడు.

"ఊ...గుర్తుకొచ్చారు..."

"నేను మీ నాన్నగారితో మాట్లాడాలనే వచ్చాను."

ఏం మాట్లాడతాడు... గుండె ఏదో తెలియని గుబులుతో చిన్నగా కొట్టుకుంటోంది... ఏవిటీ అని శ్రీరాం వాళ్ల బంధువులబ్బాయి. ఒకటి రెండు సార్లు వాళ్లింట్లో చూసాను. అప్పుడేమీ మాట్లాడనివాడు... ఇప్పుడేం మాట్లాడతాడు... ఒకటే ఆలోచనలు... ఎడతెగని ఆలోచనలతో ఎప్పటికో నిద్రపట్టింది.

* * *

తెల్లవారి నాన్న పిలుపుతో మెలకువ వచ్చింది. ఓహో... శ్రీరాం ఉన్నాడు కదూ... అనుకుంటూ లేచి అతిథి మర్యాదల్లో మునిగిపోయాను. ఒక పెళ్లికాని పిల్ల, ఒక పెళ్లికాని యువకుడికి సదుపాయాలన్నీ చూడాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. సమయానికి తమ్ముడు కూడా లేడు. పెద్దన్నయ్య ఇంట్లో ఉన్నాడు. అన్నయ్యలు అక్కలూ... పెళ్లిళ్లు ఐపోయి తలోఊళ్లోనూ ఉంటున్నారు. ప్రస్తుతం అమ్మా, నాన్నా, నేనే వుంటున్నాం.

"మీ ఇల్లు చాలా బావుందండీ... పల్లెటూరు, ప్రశాంత వాతావరణం, పెరట్లో కూరగాయలూ... పూలచెట్లూ... చల్లటి గాలి పీల్చుకుంటూ పెరట్లో అరుగుమీద కూర్చుంటే చాలు, జీవితంలో ఇంకేమీ



పచ్చళ్ళు, మీగడ పెరుగుతో కమ్మగా కడుపు నింపేసింది అమ్మ. తింటున్నంత సేపు అమ్మ వంటను పొగుడుతూనే వున్నాడు.

అమ్మాయ్.. సూర్రావొచ్చాడు తోటలో కొబ్బరి కాయలు కోయించుకొని వస్తాను. అంటూ నాన్న పక్కనే వున్న తోటలోకి వెళ్ళాడు. అమ్మ, నేనూ కూడా అన్నాలు తినేసాం. అమ్మ వంటిల్లు సర్దుకుంటోంది.

శ్రీరాం ఒక్కడూ వీధి అరుగు మీద కూర్చున్నాడు. జామ చెట్టు మీద చిలుకలు సందడి చేస్తూ.. కాయలు కొరికి పడేస్తున్నాయి. రోజూ అలా పడేసిన కాయలన్నీ ఏరి, గూట్లో పెడుతుంటాను. మా వీధిలో వున్న బడిపిల్లల కోసం. కాయలన్నీ ఏరుతున్నాను.

నాతోపాటు తాను కూడా ఏరుతూ "మీరు బుక్స్ చదువుతారా..?" అని మాట కలిపాడు.

"చదువుతాను నాన్న లైబ్రరీ నుండి తెస్తాడు." అన్నాను.

"ఈ మధ్య కాలంలో ఏం నవలలు చదివారు.. అసలు ఎలాంటి సాహిత్యాన్ని ఇష్టపడతారు?"

"నవలలా... అవేమీ కాదు... కాశీమజిలీ కథలు చదువుతున్నాను. మొన్ననే రఘువంశం పూర్తి చేసాను."

"అవునా ఆ పుస్తకాలు చదువుతారా? ఆ భాష అర్థ అవుతుందా...?"

"అవును నాన్న ఏవి తెచ్చి ఇస్తే అవే చదువుతాను. నాన్న నాకు సంస్కృతం నేర్పించాడు. ఒకవేళ అర్థం కాకపోతే నాన్న చెపుతాడు. ఆయనకు భాష మీద పట్టు ఎక్కువ. నాకోసం చందమామ కూడా కొంటాడు. ఆ కథలంటే నాకు చాలా ఇష్టం" ఎందుకో తెలియదు.

మాట్లాడాలంటే చాలా బెరుకుగా వుంది.

"అమ్మాయ్.. ఈ నాలుగు కొబ్బరి కాయలతోటి అమ్మను స్వీట్ చెయ్యమని చెప్పు. అక్కకు పంపిద్దాం. శ్రీరాం సాయంత్రం బస్‌కి వెళ్లిపోతాడుట." అంటూ నాన్న రావడంతో మా సంభాషణ ఆగిపోయింది.

"ఇంకా కొన్ని కూరగాయలు, ఆకుకూరలు, నిమ్మకాయలు, కొన్ని పండ్లు.. సూర్రావు చేత సంచిలో సర్దిస్తానంటూ".. నాన్న తిరిగి తోటలోకి వెళ్లాడు.

అమ్మ ఆ కాయల తోటి స్వీట్ చెయ్యసాగింది.

నా మనసులో చిన్న అనుమానం... శ్రీరాం నాన్నతో ఏం మాట్లాడాడు..? ఎలా తెలుసుకోవడం..? అతని మాటతీరు, ఆ కళ్లల్లో నాపై కనిపిస్తున్న ఆరాధనా భావం.. చూస్తోంటే అతను మనసులో నన్నిష్టపడుతున్నట్టుగా ఉంది. ఆ ఉద్దేశ్యంతోటే వచ్చాడా...? ఉదయం నాన్నతో బయటకు వెళ్లినప్పుడు నాన్నతో చెప్పాడా...?

ఒకవేళ అదే విషయమైతే నేనేం నిర్ణయం తీసుకోవాలి..? మనిషి అందగాడే చదువుకున్నాడు, ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడుట. తల్లితండ్రులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగస్తులేనట. చిన్న కుటుంబం. ఈ అర్హతలుంటే చాలనుకొని ఆడపిల్ల తల్లితండ్రులు ఇష్టపడి పిల్లనిచ్చేస్తారా..?



కానీ... నాకు అప్పుడే పెళ్లి చేసుకోవాలని లేదు. అమ్మా, నాన్నకు దూరంగా వుండాలంటే ఎంతో బెంగగా వుంది.

ఇంతకు ముందు కూడా, మీ అమ్మాయిని పెళ్లిలో చూసాను. పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానంటూ ఒకతను వస్తే... ఇప్పుడే పెళ్లి చేయాలనుకోవడం లేదంటూ నాన్న పంపించేసాడు. కాకినాడ నుండి కూడా దూరపు బంధువులొకరు పిల్ల అందంగా ఉంటుంది మా కోడల్ని చేసుకోవాలనుకుంటున్నాం అని కబురు పెట్టారు. అదే సమాధానం చెప్పేసాడు నాన్న.

పిల్ల బంగారపు బొమ్మ, ఎంతో మంది చేసుకోవాలని వస్తుంటే ఇప్పుడు కాదంటూ చెప్తున్నావేంటిరా శర్మా..? అని నాన్న స్నేహితులందరూ అడుగుతున్నారు కూడా...

“మీ తోట చూడాలని ఉంది చూపిస్తారా..?” అంటూ అతను అడగ్గానే నా ఆలోచనలను పక్కకు పెట్టి, తనను తీసుకొని తోటకు వెళ్లాను ఇద్దర్నీ అలా చూసేసరికి నాన్న కళ్లల్లో మెరిసిన చిన్న మెరుపు గమనించాను. కొబ్బరి, మామిడి, నిమ్మ, జామ ఇంకా రకరకాల పాదులు.. అవికాక పూలచెట్లతో పచ్చగా ఉన్న తోటను చూసి చాలా ఆనంద పడిపోయాడు శ్రీరాం. ఒక గులాబి పువ్వు కోసి నా కివ్వబోయాడు. నాకు చాలా సిగ్గుగా అనిపించింది...

“తీసుకోమ్మా ఆలోచిస్తున్నావేమిటీ..” అని నాన్న అనగానే ఆ పువ్వు అందుకొని, ఇంట్లోకి వచ్చి దేవుడి మందిరంలో పెట్టేసాను. ఏదో తెలియని భావోద్వేగానికి గురైయ్యాను.

నా మనసులో ఏదో అవుతోంది. అదేవిటో తెలియడం లేదు.

* * *

సాయంత్రం నేను చేసిన కాఫీ చాలా నచ్చిందన్నాడు..“మా అమ్మాయి వంట కూడా చాలా రుచిగా చేస్తుందోయ్...” అంటూ నాన్న ఇంకొంచెం పొగుడ్తుండగా పక్కింట్లో ఉండే వెంకట్రావు మావయ్య వచ్చాడు. వస్తూనే

“మీ కుటుంబం, మీ మర్యాదలు, నాకెంతో నచ్చాయి. ముఖ్యంగా కావ్యకన్యకలాంటి అందమైన మీరు, నా గుండెల్లో చెదరని ముద్ర వేసారు. మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. నాపై మీకున్న అభిప్రాయం వినాలని ఉంది.” అంటూ నా కళ్లల్లోకి చూస్తూ ఆగాడు.
ఊహించినదంతా అయింది. నాకు తెలుసు ఇదే అడుగుతాడని... నాన్నను కూడా ఇలాగే అడిగాడేమో..



“ఎవర్రా ఈ అబ్బాయి శర్మా..” అంటూ ప్రశ్నించాడు.

“మా పెద్దమ్మాయి వాళ్లకు తెలిసిన వాళ్లబ్బాయి. వైజాగ్ నుండి వచ్చాడురా'' అంటూ నాన్న బదులిచ్చాడు.

అవునూ...మొన్న ఆ కాకినాడ వాళ్లు శారదను చేసుకుంటామని కబురు పెట్టారుట కదా? నాకు కొడుకుంటే, నేనే ఈ బంగారు తల్లిని కోడలిగా చేసుకునేవాడిని.” అన్నాడు మావయ్య.

పల్లెటూరి ఆప్యాయతలు ఇలాగే ఉంటాయి. ప్రతీ ఇంట్లో సమస్యా వాళ్ల సొంతం చేసేసుకొని మాట్లాడే అమాయకత్వం కనపడుతూ ఉంటుంది. “లేదురా.. అమ్మాయి ఇప్పట్లో పెళ్లి వద్దంటోంది..”

“అందానికి అందం.. అటు సంగీతం, ఇంటి పనీ, వంటపనీ ఎవరు చేసుకుంటారో గానీ అదృష్టవంతులురా శర్మా..”

“ఏమోరా పెళ్లిళ్లు స్వర్గంలో నిర్ణయించబడతాయంటారు మన చేతుల్లో ఏముందిరా” అన్నాడు నాన్న. ఈ సంభాషణ వినాలంటే ఎందుకో గుండెల్లో అలజడిగా వుంది.

“సరేరా మీ చెల్లాయి సరుకులేవో తెమ్మంది వెళ్లొస్తా..” అంటూ మావయ్య వెళ్ళిపోయాడు.

“నువ్వు కూడా రెడీ అవ్వు శ్రీరాం.. బస్ టైమవుతోంది.

“అమ్మాయ్ సబ్బు, తువ్వాలు ఇవ్వు” అని నాన్న అనగానే నేను పెరట్లోకి వెళ్లాను. నన్ననుసరిస్తూ వచ్చిన శ్రీరాం, మొహం కడుక్కొని, తువ్వాలుతో తుడుచుకొంటూ.. నన్ను చూస్తూ..” మిమ్మల్ని ఒక్కమాట అడగాలనుకుంటున్నాను అడగమంటారా?” అన్నాడు.

“అడగండి..” అన్నాను సందేహపడుతూనే.

“మీకుటుంబం, మీ మర్యాదలు, నాకెంతో నచ్చాయి. ముఖ్యంగా కావ్యకన్యకలాంటి అందమైన మీరు, నా గుండెల్లో చెదరని ముద్ర వేసారు. మిమ్మల్ని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. నాపై మీకున్న అభిప్రాయం వినాలని ఉంది.” అంటూ నా కళ్లల్లోకి చూస్తూ ఆగాడు.

ఊహించినదంతా అయింది.

నాకు తెలుసు ఇదే అడుగుతాడని... నాన్నను కూడా ఇలాగే అడిగాడేమో..

నాన్న ఏమన్నాడో...? హఠాత్తుగా ఇప్పుడేం చెప్పాలి?

నాకు మాటలు రాలేదు.

మౌనంగా ఉండిపోయాను.

మా ఇద్దరి మధ్య కొన్ని క్షణాలు నిశ్శబ్దం చోటు చేసుకుంది.

అలా బొమ్మలా నిలబడిన నన్ను చూసి అతనే అన్నాడు.

‘‘ఇప్పుడే చెప్పాల్సిన అవసరం లేదు. ఆలోచించుకొని మీ నాన్నగారికి చెప్పండి. నేను అడ్రస్ ఇచ్చి వెళతాను.”

అమ్మయ్య.. ఆ మాటతో నా గుండెల్లో భారం దిగిపోయింది.

“అమ్మాయ్. బస్కిటైమవుతోంది.” అంటూ నాన్న పిలవడంతో.. ఇద్దరం లోపలికి వచ్చాము.

* * *



"సామాన్లు ఎక్కువయ్యాయని ఏమీ అనుకోకోయ్ శ్రీరాం...వెళ్లగానే ఉత్తరం రాయి. ఒరేయ్ సూర్రావ్. ఈ సామాన్లు తీసుకొని బస్టాండ్‌కి పద.. అమ్మాయ్, నా కండువా ఇలా ఇవ్వు. అబ్బాయిని బస్సెక్కించి వస్తాను." ప్రయాణం అనేసరికి నాన్న హడావిడి ఇలాగే వుంటుంది.

"ఆయ్.. విశాఖపట్నం బస్సొచ్చి చానాసేపైనాదండి.. పదండి బాబు ..." అంటున్న సూర్రావు వెనకాల.. నాన్నా, శ్రీరాం కదిలారు. వెళ్లొస్తానండీ అని అమ్మకూ, నాకూ చెప్పి వెళ్తున్న అతని కళ్లల్లో నా జవాబు కోసం ఎదురు చూపులే కనిపించాయి.

* * *

ఆ మరుసటి రోజు నాన్న, నేను తోటలో మొక్కలకు నీళ్లు పోస్తుండగా శ్రీరాంపై నీ అభిప్రాయంఏవిటమ్మా..? "అంటూ నాన్న నా పెళ్లి విషయం కదిపాడు.

"నాకు ఇప్పుడే పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు నాన్నా... నీకు, అమ్మకూ దూరంగా వెళ్లిపోవాలంటే నాకు దుఃఖం ఆగడం లేదు."

"ఆడపిల్ల ఎప్పటికైనా అత్తవారింటికి వెళ్లాలి కదా తల్లీ .."

"నా చదువు మధ్యలో ఆగిపోతుంది కదా.. పొరుగూరు పంపి కాలేజీలో చదివించడం ఇష్టం లేక డిగ్రీ ప్రైవేట్‌గా చదివిస్తున్నావు..."

"పోనీ పరీక్షలయ్యాకనే పెళ్లి చేసుకుందువు గానీ.. చూడమ్మా నీకు సంబంధం చూడాలంటే అన్నయ్యలందరికీ... సెలవులు కుదరాలి.. నేను ఈ వయసులో తిరగగలనా.. గుమ్మంలోకి కోరివచ్చిన, శుభ్రమైన సంబంధం కుదుర్చుకుంటే మంచిది కదా..! ఆ.. అదీ నీ కిష్టమైతేనే..." నాన్న మాటల్లో నిజం లేకపోలేదు.. కన్నతల్లితండ్రుల ఆవేదన ఆడపిల్లకు వయసు వస్తున్న కొద్దీ వారి మాటల్లో వినిపిస్తూనే ఉంటుంది. శ్రీరాం నచ్చలేదనడానికి కారణం ఉందా? నేను తిరగలేనమ్మా అంటున్న నాన్న మాటలకు నా మనసు కరిగిపోతోంది.. నాన్న బాధ పడుతుంటే చూడగలనా ..?

ఆయనలోని తపన నన్నాలోచింపచేస్తోందా..

ఏమో...!? నా మౌనాన్ని, నాన్న అంగీకారంగా భావిస్తాడా. ఏమో..?

* * *

ఆనాటి ప్రేమలో కట్టుబాటు ఉంది. ఆ ఇష్టంలో సర్దుబాటు ఉంది. అమ్మా నాన్నా అనుబంధాలున్నాయి. పెద్దవారి పట్ల గౌరవ మర్యాదలు, వారి మాటకు విలువ ఇవ్వాలనే ఆలోచన తప్ప, ఆవేశం లేదు.

కాలంతోపాటు, సంప్రదాయాలలో, ఆచారాలలో కొత్త పోకడలు వచ్చేసాయి. ఈ రోజుల్లో పిల్లలకు ఏం కావాలో తెలియడం లేదు, ఏం కోల్పోతున్నామో అంతకన్నా తెలియడం లేదు. వివాహబంధానికి విలువేలేదు. సర్దుకుపోయే ధోరణే లేదు. పెళ్లయిన కొద్దిరోజులకే భేదాభిప్రాయాలతో దూరమైపోతున్న జంటలను చూస్తే మనసు భారమైపోతోంది.

నా చదువు పూర్తయ్యాకే పెళ్లి జరిగింది....!

* * *

"శారదా.. నువ్వు రాసిన ఆనాటి 'మన' ప్రేమ కథ మన పెళ్లిరోజు పూటా పిల్లలకు ప్రతి ఒక్కరి హృదయాన్ని దోచుకునేంత అందంగా... ఆహ్లాదంగా ఉందంటూ...శుభాకాంక్షలు చెబుతూ పిల్లలు జవాబు పంపించారు. దీనికి కారణం అందమైన నువ్వు, నా జీవితంలోకి రావడమే కదా" అంటున్న శ్రీరాం కళ్లల్లో ఆనాటి ప్రేమ ఈనాటికీ తాజాగా తొంగిచూస్తూనే వుంది.!!

* * *



వచ్చేవారం కథ..

**పాత నారాయణ**

డా. పేరం ఇందిరాదేవి





# ఆగ్రో టెర్రరిజమ్ పడగనీడలో భారత్!

**కాలమాన, పరిస్థితులకు తగ్గట్టుగా మానవ జీవనశైలి ఎలా మారుతూ ఉంటుందో ప్రపంచానికి పెద్ద చీడలా పట్టిన టెర్రరిజమ్ కూడా అలా తన రూపాన్ని మార్చుకుంటూ విధ్వంసానికి కొత్త నిర్వచనాన్ని ఇస్తూ ఉంటుంది. అలాంటి దారుణమైన ఒకటి ఆగ్రో టెర్రరిజమ్. రెండో ప్రపంచ యుద్ధం కాలం నుంచి చాప కింద నీరులా ప్రపంచాన్ని చుట్టేయడానికి ప్రయత్నిస్తున్న ఆగ్రో టెర్రరిజమ్ ఆనవాళ్లు ఇటీవల అమెరికాలో ఇద్దరు చైనీయుల అరెస్టుతో వెలుగులోకి వచ్చాయి.**



యున్‌కింగ్ జియాన్

ఇద్దరిలో ఒకడైన జున్‌యోంగ్ అనే దుర్మార్గుడు చైనాలో పరిశోధకుడు. మరొకరు యున్‌కింగ్ జియాన్ అనే అతడి స్నేహితురాలు మిచిగాన్ యూనివర్సిటీ ల్యాబరేటరీలో పనిచేస్తోంది. వీరిద్దరూ చైనీస్ కమ్యూనిస్టు పార్టీ సభ్యులు. అతడేమో పంటపొలాలను పాడుచేసే ఒక విషపూరిత మైన ఫంగస్‌ను చైనా నుంచి అమెరికాకు అక్రమంగా తీసుకొని వచ్చాడు. యూని వర్సిటీ ల్యాబరేటరీలో ఆ ఫంగస్‌పై ప్రయో గాలు చేయాలనేది ఉభయుల ప్రణాళిక. అయితే వారి ప్రణాళికను జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పుగా పరిగణించిన ట్రంప్ అధికార యంత్రాంగం ఇద్దరినీ ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా అరెస్టు చేసింది. వారి నుంచి ఫంగస్‌ను స్వాధీనం చేసుకుంది. అయితే ఈ ఫంగస్‌పై పరిశోధనలు జరపడానికిగాను చైనా ప్రభుత్వం ఆ జంటకు భారీగా నిధులు ముట్టచెప్పిందనేది అమెరికా అధికారులు అభియోగం. ఇంతటి ప్రమాదకరమైన ఫంగస్ పేరు ఫసరియమ్ గ్రమినెరుమ్. అమెరికా దాన్ని ఆగ్రో టెర్రరి జానికి ఊతమిచ్చే ఒక ఆయుధంగా వర్గీకరించింది. ఇది గోధుమ, బార్లీ,మొక్కజొన్న, వరి లాంటి పంటలను తుడిచి పెట్టేస్తుంది. ఈ ఫంగస్ కనుక ఆహారం రూపంలో మనుష్యులు తీసుకున్న పక్షంలో వాంతులు, కాలేయం దెబ్బతినడం జరుగుతుంది. దీని కారణంగా ప్రపంచ వ్యాప్తంగా వందల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లుతోందని

అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. అంతేకాకుండా వ్యవసాయంపైన ఎక్కువగా ఆధారపడే భారత్ లాంటి దేశాలపై ఈ ఆగ్రో టెర్రరిజమ్ పడగ నీడ ఇప్పటికే పడిందని కొన్ని పరిశోధనా పత్రాలు వెల్లడించాయి.

**చట్టాలకు చిక్కని ఆగ్రో టెర్రరిజమ్**

క్రిమికారకాలను ప్రయోగించి, పంటపొలాలను ఆయుధాలను మార్చి, పంటలను నామరూపాల్లేకుండా చేయడాన్ని ఆగ్రో టెర్రరిజమ్ అంటారు. ఇది వ్యవసాయాధారిత దేశాలను ఆర్థికంగా దెబ్బ తీస్తుంది. దీని లక్ష్యం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసి ఆయా దేశాల్లో అనిశ్చితి సృష్టించడం. పెద్దగా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేని దీన్ని కనిపెట్టడం చాలా కష్టం. ఆగ్రో టెర్రరిజానికి బోలెడన్ని అనుకూలతలు ఉన్నాయి. ఇది మనుషులు నేరుగా చేసేది కాదు. లక్ష్యం మనుష్యులు అంతకన్నా కాదు. కనుక పంటలు లాంటి మానవరహిత లక్ష్యాలపై జరిగే జీవాయుధ దాడులపై శిక్షలు విధించడానికి అంతర్జాతీయంగా ఇప్పటిదాకా ఎలాంటి చట్టాలు లేవు. దీంతో ఆగ్రో టెర్రరిజమ్ సూత్రధారుల అరాచకాలకు అద్దూ అదుపూ లేకుండా పోతోంది.

**జపాన్‌పై అణుబాంబు బదులుగా..**

పంటలపై లేదా వ్యవసాయ ఉత్పత్తులపై జీవ ఆయుధాలను ప్రయోగించాలనే ఆలోచన కొత్తగా పుట్టుకొచ్చిందేమీ కాదు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటన్‌లో బంగాళాదుంప పంటలు లక్ష్యంగా కొలొరాడో బంగాళాదుంప కీచురాళ్లను జర్మనీ ప్రయోగించింది. అలా ప్రయోగించిన కీచురాళ్లను 1943లో ఇంగ్లండ్‌లో కనుగొన్నారు. వాటిని విమానాల ద్వారా పంటపొలాల మీదకు విడిచిపెట్టినట్టు తేలింది. జపాన్ కూడా జర్మనీ లాగానే ఆలోచించింది. యుద్ధం కొనసాగే పక్షంలో అమెరికా, సోవియట్ యూనియన్‌లలో గోధుమ



చైనా ఫంగస్

పంటపై దాడికి ఆగ్రో టెర్రరిజాన్ని ఎంచుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన జపాన్ చేసిందని మోస్టాగనేమ్ యూనివర్శిటీ వెలువరించిన ఓ పరిశోధనాపత్రం వెల్లడించింది. అలాగని అమెరికా ఏమీ తక్కువ తినలేదు. జపాన్‌లో వరిపంటను నాశనం చేయడానికి 30 టన్నులకుపైగా విషపూరితమైన ఫంగస్‌ను పోగు చేసుకుంది. అయితే చివరకు ఆగ్రో టెర్రరిజాన్ని కాదనుకొని జపాన్‌పై అణుబాంబును ప్రయోగించడానికే అమెరికా మొగ్గు చూపిందని యూనివర్శిటీ పరిశోధనా పత్రం వెల్లడించింది.

**భారత్‌కూ తప్పలేదు**

భారతదేశ జీడీపీలో దాదాపు 17 శాతానికి వ్యవసాయరంగం దోహదపడుతుంది. 2011నాటి జనగణన ప్రకారం దేశజనాభాలో 55 శాతం వ్యవసాయం, దాని అనుబంధిత కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారు. వ్యవసాయానికి సంబంధించి పంజాబ్, రాజస్తాన్, హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాలు కీలకమైనవి. ఇవి మన పొద అంటే ఏ మాత్రం పడని పాకిస్తాన్, చైనా లాంటి దేశాలతో సరిహద్దులను పంచుకుంటున్నాయి. దీంతో ఆగ్రో టెర్రరిజమ్ తాలూకు ముప్పు కళ్లకు కట్టినట్టుగా స్పష్టంగా కనిపిస్తోంది. ఇది 2016లో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ–డీఆర్‌డీవో వెలువరించిన ఒక పరిశోధనాపత్రం ముప్పును, దాని విపరిణామాలను వెల్లడించింది. పత్రం ప్రకారం బాంగ్లాదేశ్‌లో కనుగొన్న ఓ విషపూరితమైన ఫంగస్ పశ్చిమబెంగాల్‌లోని రెండు జిల్లాల్లో బైటపడింది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. ఆ రెండు జిల్లాల్లో మూడేళ్లపాటు గోధుమ పంట సాగును నిషేధించాయి. తద్వారా గోధుమ పంటకు చేటు చేసే బాంగ్లాదేశ్ ఫంగస్ వ్యాప్తిని నిరోధించాయి.

అక్కడితో ఆగకుండా పొరుగుదేశానికి ఆనుకొని అంతర్జాతీయ సరిహద్దుకు ఐదు కి.మీ.ల పరిధిలో ఉన్న ఇతర జిల్లాల్లో కూడా గోధుమ పంట సాగుపై నిషేధం విధించాయి. అదే విధంగా 2015లో ఒకానొక వైరస్ పాకిస్తాన్‌లో పత్తిపంటను పెద్ద ఎత్తున నాశనం చేసింది. అది దక్షిణ పంజాబ్‌లో పెద్ద ఎత్తున తెల్లదోమ వ్యాప్తి చెందడానికి దారి తీసింది. దీంతో రెండింట మూడు వంతుల పంట దెబ్బ తింది. ఆ కారణంగా నష్టం 63 కోట్ల డాలర్ల నుంచి 67 కోట్ల డాలర్ల మధ్య వచ్చింది. కనీసం 15 మంది పత్తి రైతులు ఆత్మహత్య చేసుకున్నారని డీఆర్‌డీవో పరిశోధనా పత్రం పేర్కొంది. ఇంత భారీగా నష్టపరిచిన వైరస్ ఆనవాళ్లు భారత్‌లో మునుపెన్నడూ లేవని దర్యాప్తులో తేలింది. అయితే వాటి మూలాలు పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులో ఉన్నాయి. అక్కడి వెహారి, ముల్తాన్‌లలో రెండు పత్తి పంట పరిశోధనా సంస్థలకు ఈ వైరస్ కోసమని ప్రయోగాత్మకంగా పత్తి మొక్కలను పెంచుతున్నారని నిరూపితమైంది.




– జాగృతి డెస్క్



భారతీయుల ఆధ్యాత్మిక సంపద యోగాను విశ్వవ్యాప్తం చేయటంలో ప్రధాని నరేంద్రమోదీ సఫలమయ్యారు. దైనందిన జీవితంలో యోగాను స్వయంగా ఆచరిస్తూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అనుసరించేలా చేస్తున్నారు. విశాఖ వేదికగా ఈ నెల 21న జరిగే' యోగాంధ్ర అభియాన్' కార్యక్రమంలో ప్రధానితో పాటు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు.



# విశ్వ జనానికి 'యోగా'మృతం!

యోగా...! ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ విన్నా ఇదే మాట. భారత్ నుంచి ప్రపంచ దేశాలకు విస్తరించిన యోగాను అమెరికా, జర్మనీలతో పాటు ఇతర పాశ్చాత్యదేశాలు అక్కున చేర్చుకొని తమ జీవన విధానంగా మార్చుకోడానికి ప్రయత్నిస్తున్నాయి. భౌతికపరమైన అంశాలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చే పశ్చిమ దేశాల ప్రజలు జీవితంలో స్థిరత్వం, మానసిక ప్రశాంతత కోసం యోగాను అనుసరిస్తున్నారు.

సనాతన భారత వేదసంస్కృతి నుంచి ఆవిర్భవించిన యోగాకు అంతర్జాతీయంగా గుర్తింపు రావడంలో నరేంద్రమోదీ గత దశాబ్దకాలంగా కృషి చేస్తూ వచ్చారు.

**జూన్ 21న అంతర్జాతీయ యోగా దినం....**

ప్రతి ఏడాది జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోడం ఆనవాయితీగా వస్తోంది. ఈ వేడుకల్లో వేలాదిమందితో కలసి పాల్గొనటాన్ని ప్రధాని ఓ బాధ్యతగా చేసుకొన్నారు. అంతర్జాతీయ వేదికల్లో సైతం యోగా ప్రాముఖ్యత గురించి వివరిస్తున్నారు. ఆ పరంపరలో భాగంగా ఆంధ్రప్రదేశ్ వాణిజ్య రాజధాని విశాఖపట్నం వేదికగా ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భారత ప్రధాని పాల్గొనబోతున్నారు.

పదిలక్షల మందితో కలసి సామూహిక యోగా కార్యక్రమంలో పాల్గొనున్నారు. 2015 జూన్ 21 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాటిస్తూ వస్తున్నారు.

**ఆంధ్రప్రదేశ్ పై ప్రధాని ప్రశంసల వర్షం...**

యోగా ప్రాముఖ్యతను చాటి చెప్పేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన 'యోగాంధ్ర అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని ప్రశంసలతో ముంచెత్తారు. రాష్ట్రంలో యోగా సంస్కృతిని పాదుకొల్పడం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రధాని ప్రత్యేకంగా కొనియాడారు. యోగాకు దూరంగా ఉన్న వ్యక్తులు దానిని తమ జీవితంలో ఓ ప్రధాన భాగంగా చేసుకోవాల్సిన సమయం వచ్చిందని, భారీ సంఖ్యలో ప్రజలు యోగా వేడుకల్లో పాల్గొనాలని ప్రధాని పిలుపునిచ్చారు.

గత 122 మాసాలుగా 'మన్ కీ బాత్' కార్యక్రమంలో పాల్గొంటూ వస్తున్న ప్రధాని తాజాగా యోగా ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తూ సందేశమిచ్చారు. ఆధునిక జీవనశైలిలోని ఒత్తిడులను అధిగమించ డంతో పాటు ప్రశాంత, ఆరోగ్యవంతమైన జీవితం కోసం యోగాను అందరూ అనుసరించాలని, తమ దైనందిన జీవితంలో ఓ భాగంగా చేసుకొని తీరాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబసభ్యులు, స్నేహితులతో కలసి యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. యోగా గొప్పతనాన్ని, ప్రయోజనాలను ప్రపంచం గుర్తించిందని, యోగా గొలుసు లేదా యోగా రింగ్ పేరుతో జూన్ 21న వివిధ ఖండాలు, దేశాలకు చెందిన కోట్లాదిమంది యోగా చేయటం అద్భుతమంటూ తమ సందేశం ద్వారా గుర్తు చేశారు. విశాఖ వేదికగా జరిగే' యోగాంధ్ర అభియాన్' కార్యక్రమంలో ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర ప్రముఖులు పాల్గొనున్నారు.

**కార్యశాలల నుంచి పాఠశాలల వరకూ....**

ప్రపంచంలోనే అత్యధిక యువజన జనాభా కలిగిన భారత్‌లో యోగాను పాటించేవారి సంఖ్య గత కొద్ది సంవత్సరాలుగా గణనీయంగా పెరుగుతూ వస్తోంది. ప్రధానంగా యువత అధికసంఖ్యలో యోగాలో పాల్గొనటాన్ని శుభపరిణామంగా భావిస్తున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలు సైతం తమ కార్యాలయాలలో ప్రత్యేకంగా యోగా కేంద్రాలను ఏర్పాటు చేస్తూ తమ ఉద్యోగులను ప్రోత్సహిస్తున్నాయి. మరికొన్ని అంకుర పరిశ్రమలు 'యోగా సమయం' అంటూ వినూత్నరీతిలో యోగాను బోధిస్తుంటే..మరి కొన్ని సంస్థలు, యోగాను అభ్యసించిన వ్యక్తులు సైతం మారుమూల గ్రామాలకు వెళ్లి యోగాను బోధిస్తూ, ప్రాముఖ్యతను వివరిస్తూ తమవంతుగా పాటుపడుతున్నారు.

అయితే..యోగా దినోత్సవం రోజునే వేడుకలు చేసుకొంటే సరిపోదని, యోగాను జీవనశైలిగా మలచుకోడానికి ప్రాథమిక పాఠశాల దశ నుంచే అమలు చేయటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పిలుపునిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే యోగాను ఓ నిర్బంధ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని, దానికి కేంద్రప్రభుత్వం మాత్రమే చొరవ తీసుకోవాలని సూచిస్తున్నారు. దేశంలోని ప్రతి బాలుడు, బాలిక పాఠశాల దశ నుంచే యోగాను అభ్యసించగలిగితే ఆరోగ్యవంతమైన, ఆదర్శవంతమైన సమాజం రూపుదిద్దుకోడం ఏమంత కష్టంకాబోదని చెబుతున్నారు.

ఏమాత్రం ఖర్చులేని యోగాను ప్రధాన పాఠ్యాంశాలలో ఒకటిగా చేసి బోధిస్తూ వస్తే అద్భుతాలే జరుగుతాయనడంలో ఏమాత్రం సందేహం లేదు.



కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా దివ్యాంగుల శోభాయాత్ర

**భాగ్యనగర్ :** సక్షమ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌కి మద్దతుగా వీర సైనికులకు సంఘీభావం తెలుపుతూ మే 31 న భాగ్యనగర్ తులసీనగర్ కాలనీ లోని సక్షమ్ ధీమహి రీహాబిటేషన్ సెంటర్ వద్ద విజ యోత్సవ శోభాయాత్ర జరిగింది. రెడ్డి, కోశాధికారి సంతోష్‌కుమార్ అతిథులుగా విచ్చేయగా స్థానికంగా నివసిస్తున్న కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న విశ్రాంత సైనికాధికారి లక్ష్మీనారాయణ విశిష్ట అతిథిగా విచ్చేసారు.

అనేకమంది దివ్యాంగులైన చిన్నపిల్లలు కార్యకర్తలు ప్రతి కుటుంబాన్ని కలిసి, ఆపరేషన్ సిందూర్, ఉగ్రమూకపైన భారత సైనిక విజయాన్ని వివరిస్తూ మువ్వన్నెల జెండాను అందించి శోభా యాత్రకు ఆహ్వానించారు. తులసీనగర్ కాలనీలోని బస్తీలన్నీ త్రివర్ణపతాక శోభలతో కళకళ లాడాయి.




దీనిలో దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులే కాక కాలనీవాసులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని జరుపుకు న్నారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఇంద్రసేనా భారతమాత, త్రివిధ దళసైనికుల వస్త్రధారణతో పాల్గొన్నారు. పసుపు కుంకుమలను, జాతీయ జెండా లని చేతబూని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు వారంరోజులుగా సక్షమ్ మహిళా సక్షమ్ మహిళా విభాగం ఆధ్వర్యంలో పూర్తిగా మాతృ మూర్తులు నిర్వహించిన ఈ శోభాయాత్ర తులసీ నగర్, గోల్నాక ప్రాంతంలో ప్రతీ ఒక్కరిలోనూ జాతీయ భావాలను జాగృతం చేశాయి.

---

నివాళి

# నిస్వార్థజీవి వేదుల సుధామణి

**భాగ్యనగర్ :** రాష్ట్ర సేవికా సమితి కార్యకర్త వేదుల సుధామణి(65) జూన్ 5న కన్నుమూశారు. అంతకు మూడు రోజుల క్రితం ప్రమాదానికి గురైనారు.

సమాజ కార్యంలో, ముఖ్యంగా సేవారంగంలో పనిచేసే వారికి వేదుల సుధామణి తలలో నాలుక. రాష్ట్ర సేవికాసమితి దిల్‌సుఖ్‌నగర్ భాగ్ కార్య వాహికగా, భాగ్యనగర్ విభాగ్ సంపర్క ప్రముఖ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ శాఖాపరమైన విస్తరణ మాత్రమే కాక వివిధ సేవాకార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వారు.

చిన్నతనం నుంచే జాతీయ భావాల మధ్య పెరిగారు సుధామణి. వీరి తండ్రి స్వర్గీయ శేషఫణి కర్నూలు విభాగ్ కార్యవాహగా చాలాకాలం పనిచేశారు. సుధామణి వివాహం తర్వాత భర్త వేదుల నరసింహం (సమాచార భారతి వ్యవస్థాపక సభ్యులు, ప్రముఖ పాత్రికేయులు) ప్రోత్సాహంతో క్రియాశీలక



కార్యకర్తగా ఎదిగారు. ఓవైపు రాష్ట్ర సేవికా సమితి బాధ్యతలతో పాటు "సక్షమ్" తెలంగాణ రాష్ట్ర కార్యకారిణిలో సభ్యురాలిగా, నిరాశ్రయ బాలికల కోసం ఏర్పాటు చేసిన వైదేహి ఆశ్రమ (సేవాభారతి) కార్యదర్శిగా, సైదాబాద్ శిశుమందిర్ కమిటీ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహిస్తూ అంతిమ క్షణం వరకు సమాజ సేవలో నిమగ్నమయ్యారు. తన స్థితి ఏదైనా, తనువు సహకరించినా, సహకరించకపోయినా చిరునవ్వుతో పనులు సాధించడానికి కావాల్సిన మార్గం సుగమం చేయగలిగిన ధీశాలి. తనకున్న దానితో సరిపెట్టుకుని తన ఆర్థిక స్థితిగతులను, కష్టాలనూ మాత్రం ఎవరితోనూ పంచుకోనంతటి నిస్వార్థ జీవితం వీరిది. ప్రత్యక్షంగా తోబుట్టువు కాకపోయినా సంఘ సంబంధాలతో తోబుట్టువుల కన్నా ఉన్నత వ్యక్తిత్వంతో స్వయంసేవకులు, సేవికలందరూ "మణక్క" అని ఆప్యాయంగా పిలుచుకునేంత నిండైన మనిషి.

తాను మరొకరికి సహాయం చేయడం తప్ప చివరి క్షణాల్లో కూడా ఎవ్వరితోనూ చేయించుకోవడం ఇష్టంలేదు అన్నట్లు హఠాత్తుగా కన్నుమూసిన కర్మయోగి. వీరికి ఇద్దరు కుమార్తెలు. ★



# పదవి దక్కిన చిలుక గొంతు పెంచింది

తమిళ రాజకీయాలదీ, తమిళ చలనచిత్ర పరిశ్రమదీ విడదీయరాని బంధం. ఒక రంగం ప్రభావం మరొక రంగం మీద ఎక్కువగానే కనిపిస్తుంటుంది. సినిమా నడక మందగిస్తే, లేదా మరీ కన్నీటి దృశ్యాలతో ప్రేక్షకులు తడిసి ముద్దయిపోతూ ఉంటే కాస్త మార్పు అవసరం. కొత్త 'రసం' తెర మీద జాలు వారడం అనివార్యం. అదే విద్యని రాజకీయాలలో కూడా ప్రయోగిస్తూ ఉంటారు, తమిళ నాయకమన్యులు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ విలన్ స్థాయి నుంచి హాస్యగాడి స్థాయికి పడిపోవడంతో కొత్త ముఖం అవసరమైంది. ఆ క్రమంలో జరిగినదే తమిళనాడు రాజకీయ తెరమీదకి కమలహాసన్‌ను తీసుకురావడం. దీని వెనక ద్రవిడ రాజకీయం కీలకమైన పాత్ర పోషిస్తున్నది.

మక్కల్ నీధి మేయమ్ కమల్ హాసన్ ముచ్చట పడి స్థాపించుకున్న పార్టీ. కానీ ఇది గత ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూచింది. నేతే ఓడిపోయాడు. కమల హాసన్ రాజకీయ రంగానికి తెరపడింది. నిజం చెప్పాలంటే మక్కల్ (ప్రజలు) మరో సంకుచిత రాజకీయ పార్టీని నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. డీఎంకే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాజ్యసభకు కమల్ పేరు ప్రకటించారు. అందుకు కృతజ్ఞతగా అత్యుత్సాహంతో చిరకాలంగా గూడు కట్టుకున్న సంకుచిత భావ ప్రకటనతో కర్ణాటకలో చిచ్చు రగిలించాడు కమల్. ఇంకా చెప్పాలంటే పరభాషా సంస్కృతులను నిరసించే పెరియార్, కరుణానిధులకు ఈ రీతిలో తన విధేయతా నీరాజనం సమర్పించాడు. ఘుమఘుమలాడే కస్తూరి కన్నడ గరగరలాడే తమిళం నుంచి వచ్చిందని తన పాండిత్యాన్ని నిండు సభలో కుమ్మరించాడు కమల్. భాషాద్వేషాల జ్వాల రగిలించాడు. తమిళనాట ద్రావిడ వేర్పాటువాదం పురివిప్పి నాట్యం చేయడం ఇప్పటిది కాదు. భాషా ప్రయుక్త రాష్ట్రావతరణతో నాటి అఖండ మద్రాసు ప్రెసిడెన్సీ చిన్నబోయింది. ఆనాడే రాజాజీ తెలుగు, కన్నడ పట్ల తన అభిప్రాయాన్ని చాటి చెప్పాడు. ముఖ్యంగా ఆయన దృష్టి కన్నడ పైనే కేంద్రీకృతమయింది.

కన్నడిగుల మనోభావాన్ని, అస్థిత్వాన్ని కించపరుస్తూ, "కన్నడం పలుకు తమిళం, అక్షరం తెలుంగు" అని చమత్కార బాణం విసిరాడు రాజాజీ. ఆ రెండు రాష్ట్రాలు ఇది వరకటిలా పన్నులు, కప్పం చెల్లించే అవసరం, అవకాశం, చేజారిపోయిందన్న బాధే అలా బాణం రూపం దాల్చింది. మంత్రి పదవిలో ఉన్నందువల్ల హాసన్‌లా మంత్రసాని పాత్రలో కన్నడ భాషకు పురుడుపోయలేదు. దేశ, విదేశ, భాషలకు మాతృక గీర్వాణ భాష అని ఇటీవల భాషా పరిశోధనలు బయటపెట్టాయి. ఇదివరకే కన్నడం "బ్రాహ్మీ" తెగకు సంబంధించినదని భాషా నిపుణులు తేల్చి చెప్పారు. ఇరుగు, పొరుగు రాష్ట్రాల భాషా పదాలు ఏ భాషనైనా ప్రభావితం చేస్తాయి. అంత మాత్రాన భాషను కించపరచడం సరస్వతిని అవమానించడం అవుతుంది. అన్నట్టు కమల్ నాస్తికుడు. సరస్వతితో ఆయనకు పనిలేదు. సరస్వతి అమ్మవారి మీద నమ్మకం లేకపోయినా, ఒక రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడం సరికాదని అంత పెద్ద కళాకారుడు గుర్తించకుంటే ఎలా?

అన్నట్టు కమలహాసన్ అయితే మాత్రం, ఆయన అతీతుడా అని న్యాయస్థానం ప్రశ్నించింది. మీరేమైనా శాస్త్రవేత్తా అని కూడా నిలదీసింది. దీని అర్థం నోటికి ఏది వస్తే అది మాట్లాడకూడదని చెప్పడమే. అయితే ఈ మధ్య కోర్టుల ఘోష, న్యాయమూర్తుల ఆక్రోశం ద్రవిడ నాట కాస్త కూడా వినిపించడం లేదు. ఇష్టం వచ్చినట్టు సనాతన ధర్మాన్ని కించపరిస్తే కోర్టులు చూస్తూ ఊరుకోవు అని తీవ్రంగా మందలించినా, సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్న ఉదయనిధి తన విమర్శకే తాను కట్టుబడి ఉన్నానని కుండబద్దలు కొట్టి మరీ చెప్పాడు. కోర్టుల చేత చీవాట్లు తినడంలో రాహుల్ గాంధీ, డీఎంకే నేతలు పోటీలు పడుతూ ఉండడం ఇటీవలి వైచిత్రి కాదా! రాహుల్‌కి వీరసావర్కర్ అంటే ద్వేషం. ఎందుకంటే ఆయన ఆధునిక హిందూ సిద్ధాంత కర్త అని రాహుల్‌కి ఎక్కడో ఒక నమ్మకం. ఇక డీఎంకే వాళ్లు సావర్కర్ పేరు అవసరం లేకుండా నేరుగా హిందూత్వం మీద విరుచుకు పడుతూ ఉంటారు. కోర్టులు తిట్టిన తరువాత అరెస్టయినా, బెయిల్ వచ్చిన తరువాత మళ్లీ ప్రమాణ స్వీకారం చేయిస్తారు డీఎంకే ప్రభుత్వం వారు. ద్రవిడ శైలిలో కోర్టులను గౌరవించడం అంటే ఇది కదా! తమిళనాట ఈ ఓవరాక్షన్ చిత్రమాలికలను ఇంకా ఎంత కాలం చూడాలో!

సంస్కృతం మృతభాషకాదని, అమృతతుల్యమై, సాంకేతిక విద్యకు దోహదం చేస్తుందని, ఆధునిక కంప్యూటర్ దేవనాగరి లిపిని ఆహ్వానిస్తున్నది. "అమృతస్య పుత్రః" అన్న సూక్తి అనుసారం, మూలకారణం అయిన ఒక భాషామతల్లి కన్న బిడ్డలు వేరుపడిన విధంగా అనేక భాషలు భరతఖండంలోనే పురుడు పోసుకున్నాయి. జంబూద్వీపం, భరతవర్షం, భరతఖండం, నేటి భారత్ ఆనాడూ ఒక "అద్భుత పురావస్తు ప్రదర్శనశాల"లా పలు భాషలకు, సంస్కృతులకు, నాగరికతలకు, జాతులకు, ఆశ్రయం కల్పించింది.

ఇప్పటికైనా కళ్లు తెరిచి, నోరుజారినందుకు క్షమాపణ చెప్పకపోతే కమల హాసన్‌కు ముప్పుతిప్పలు తప్పవు. శ్రీనాథుడిలా "కన్నడ రాజ్యలక్ష్మి దయలేదా" అని వాపోవవలసిన పరిస్థితి ఎదురవుతుంది.

సహృదయంతోపాటు ఆర్థికబలం క్షీణించినప్పుడు, కలవరింతలు, పలవరింతలు మరింత పెరగడం సహజం. ప్రజల దృష్టి మరల్చడానికి ప్రభుత్వం భాష, మతం, కులం లాంటి సున్నితమైన విషయాలపైన పడకా తప్పదు. అవినీతికి అద్దం పెట్టిన ఇద్దరు మంత్రులను, తమిళనాడు ఉపముఖ్యమంత్రి ఉదయనిధి నిందాస్తుతిని సుప్రీమ్ తప్పుపట్టింది. సెంతిల్ బాలాజీ మరో వీరాభిమాని, రాజీనామా చేశారు. నిష్ఠుర సత్యాలు పలికినవారిని తొలగించడం, వందిమాగధులను అక్కున చేర్చుకోవడం డీఎమ్‌కే ప్రభుత్వానికి అలవాటే. గవర్నర్ తొక్కిపెట్టిన పది బిల్లులు ఆయన పదవికే తిరుక్షవరం లాంటివి. వాటికోసం పాకులాడి స్టాలిన్ చివరికి నిరాశపాలు కావలసివచ్చింది. వాటికి చెల్లుబాటు కల్పించిన ద్విసభ్య ధర్మాసనం తీర్పును తిప్పికొట్టి శాసనాలకు చెల్లుచీటి ఇచ్చింది న్యాయస్థానం. రాష్ట్రప్రతినిధి, ప్రజాప్రతినిధి, ఇద్దరి మధ్య సదవగాహన, సామరస్యం ఉండాలని రాజ్యాంగం నిర్దేశించింది. అహం అడ్డుపడితే ఆ రాష్ట్ర ప్రగతి అధోగతి పాలవకతప్పదు. తమిళనాట ఇద్దరి మధ్యా ఆధిపత్యపుపోరు జోరై జాత్యభిమానాన్ని దెబ్బ తీయడం మిక్కిలి శోచనీయం. దేశభక్త తిరువళ్లువర్ జయంతి సందర్భంగా గవర్నర్ రవిగారి సనాతన ధర్మప్రసక్తిని మనుస్మృతిలో ముడివేయడం చూచి కముక్కున వేలు పడక తప్పదు. వర్ణం కులం కాదు; ధర్మం మతంకాదు అన్న ఇంగితం మరిచి, అర్థాంతరంగా, విపరీతార్థం చెప్పడం సాహసమే అవుతుంది.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః
అన్న గీతా వాక్యాలను మరోసారి మననం చేసుకుంటే మంచిది.

– నిరామయ, 8142888461

# బాల జాగృతి



## భక్తాగ్రేసరులు



## మొల్ల

మొల్ల తెలుగు కవయిత్రులలో అగ్రస్థానంలో నిలిచింది. ఆమె 14వ శతాబ్ది ఉత్తరార్థం, 15వ శతాబ్ది ప్రథమంలో జీవించారని సాహిత్య చరిత్రకారులు పేర్కొన్నారు. ప్రస్తుత ఉమ్మడి కడప జిల్లా గోపవరంలో కుమ్మరి సామాజిక వర్గంలో జన్మించిన మొల్ల బాల్యం నుంచి భక్తిపరురాలు. ఒక సన్యాసి బోధనలతో బ్రహ్మచారిణిగా మిగిలారు. అంతగా విద్యావంతురాలు కాకపోయినా శ్రీరాముని అనుగ్రహంతో రామాయణ గ్రంథాన్ని ద్విపదలో రాసింది. భాస్కరాది కవులు అప్పటికే రామాయణాన్ని అనువదించినా, ఆరు కాండలతో 900 లోపు పద్యాలతో కేవలం అయిదు రోజులలో రాశారని చెబుతారు. ఇతర ప్రసిద్ధ తెలుగు కవులతో పోలిస్తే, ఆమె సరళమైన తెలుగు మాటలను ప్రధానంగా, సంస్కృత పదాలను అరుదుగా ఉపయోగించడం కనిపిస్తుంది. తనకు సాహిత్య ఖజానా, వ్యాకరణం, పదజాలం నియమాల గురించి తెలియదని, గోపవరం దేవత శ్రీకాంత మల్లేశ్వరుని కృపతో కవిత్వ కళ అబ్బిందని రచన ప్రారంభంలో చెప్పుకున్నారు. 'కవితలల్లిన తొలితెలుగు విదుషీమణి. రామాయణ కావ్య రచనా రసధుని' అని మన్ననలు అందుకున్నారు.

## కథ

## చిత్రం చింపి.. ప్రాణం నిలిపి!



పూర్వం ఓ రాజు ఒంటరిగా అడవికి వేటకు వెళ్లాడు. అక్కడ చాలాసేపు వేటాడి అలసిపోయి కొండపై గల ఒక చెట్టునీడలో కొంతసేపు విశ్రాంతి తీసుకున్నాడు.

ఆయనకు అక్కడి ప్రకృతి ఎంతో నచ్చింది. రాజు స్వతహాగా గొప్ప చిత్రకారుడు కూడా. దీంతో ఆ పరిసరాలను చక్కని చిత్రంగా గీయాలనుకున్నాడు.

వెంటనే వెళ్లి గుర్రానికి వేలాడుతున్న సంచీ నుంచి చిత్రలేఖనానికి కావాల్సిన సరంజామా అంతా తెచ్చుకుని గీయడం ప్రారంభించాడు. చిత్రం పూర్తయ్యాక.. దాని అందానికి ముగ్ధుడైన ఆయన అన్ని పక్కల నుంచి దాన్ని చూసి ఆనందించాలనుకున్నాడు.

మొదట కుడి పక్కకు, తర్వాత ఎడమ పక్కకు, మళ్లీ ఎదుటి వైపునకు వెళ్లి చూస్తున్నాడు. అలా అలా కొంచెం కొంచెం వెనక్కి నడుస్తూ వెళుతూ... తాను గీసిన చిత్రాన్ని చూసి సంబరపడుతున్నాడు. అలా తనకు తెలియకుండానే కొండ కొనకు వెళ్లిపోయాడు. అది దాటితే ఆయన లోయలో పడిపోవడం ఖాయం. కానీ రాజు అది గమనించలేదు.

ఈ దృశ్యాన్ని ఆ దారిన పోతున్న పశువుల కాపరి చూశాడు. 'అయ్యయ్యో.. రాజుగారు పడిపోయేటట్లున్నారు. ఎలాగైనా ఆయన్ను రక్షించాలి' అనుకొన్నాడు.

ఒకవేళ కేకవేసి చెబుదామంటే ఆయన

## పద్యం

ప్రభులు పండితులగువారి వలన గర్వ
కలన మానుడు వారు మీ కలిమి తృణము
లీలబోలింపలేమి, మృణాళగుణము
భూరిమదవారణములకు వారణంబె

భావం : ప్రభువులు పండితుల పట్ల గర్వాన్ని ప్రదర్శించడం మానుకోవాలి. పండితులు మీ సంపదను గడ్డిపోచతో సమానంగా కూడా పరిగణించరు. మదమత్తేభాన్ని తామరతూటితో బంధించడం సాధ్యం కాదు కదా!

## శ్లోకం

ఋణాగ్ని ర్వ్యాధి శత్రుశ్చ
జ్ఞాతి శేషంచ పంచకం
పునః పునః ప్రవర్ధంతే
తస్మాత్ శేషం నకారయేత్

భావం : అప్పు, నిప్పు, రోగం, శత్రువు, వైరం అనే అయిదు మిగలరాదు. అలా మిగిలితే... రోజు రోజుకు పెరుగుతుంటాయి. అందువల్ల వీటిని తొలగించాలి.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఆడియో మీటర్ | కీళ్లను పరిశీలించే పరికరం |
| బారోగ్రాఫ్ | శబ్ద తీవ్రత |
| ఆర్థోస్కోప్ | కణాలను లెక్కించే పరికరం |
| కలోరీ మీటర్ | వాతావరణ పీడనం |
| సైటో మీటర్ | రంగుల సాంద్రత |

సమాధానాలు : ఆడియో మీటర్–శబ్ద తీవ్రత; బారోగ్రాఫ్–వాతావరణ పీడనం; ఆర్థోస్కోప్–కీళ్లను పరిశీలించే పరికరం; కలోరీ మీటర్–రంగుల సాంద్రత; సైటో మీటర్–కణాలను లెక్కించే పరికరం.

నిర్వహణ : నయనశ్రీ

## శాస్త్రవేత్తలు



### జానకీ అమ్మాళ్

ఈమె పూర్తి పేరు ఎడవళత్ కక్కాడ్ జానకీ అమ్మాళ్. భారతీయ ప్రముఖ మహిళా శాస్త్రవేత్త. నవంబర్ 4,1897 మద్రాసులో జన్మించారు. వృక్షకణ శాస్త్ర రంగంలో పరిశోధనలు చేసి కేంద్రక ఆమ్లములలోని నత్రజని ఆధారాన్ని విశ్లేషించారు. చెరకు, వంగపై విశేష పరిశోధనలు చేశారు. కేరళ వర్షాధార అడవుల నుండి ఔషధపరంగా ఉపయోగకరమైన ఎన్నో మొక్కల్ని సేకరించారు. ఈమె రాసిన గ్రంథం 'క్రోమోజోమ్ అట్లాస్ ఆఫ్ ది కల్టివేటెడ్ ప్లాంట్' దేశ, విదేశాలలో వృక్ష శాస్త్రవేత్తలకు మార్గదర్శకంగా నిలుస్తోంది.

## జనరల్ నాలెడ్జ్

1. మొదటి మహిళా ఐపీఎస్ అధికారి?
2. గాలిలో అత్యధికంగా ఉండే వాయువు ఏది?
3. క్లైనోఫోబియా అంటే ఏమిటి?

జవాబులు : 1. కిరణ్ బేడీ; 2. నైట్రోజన్;
3. కదలికలంటే భయం.



కంగారుపడి లోయలోకి పడిపోవచ్చు. అందుకే పశువుల కాపరికి ఓ ఆలోచన తట్టింది.

గబగబా వెళ్లి చిత్రాన్ని చించి వేశాడు. రాజుగారు కోపంతో రుద్రుడైపోయాడు. పరుగున వచ్చి వాడి చెంప చెళ్లుమనిపించాడు. తర్వాత 'ఎందుకిట్లా చేశావు?' అని అడిగాడు.

'రాజా! మీరు కొండ కొనమీద నిలబడి ఉన్నారు. ఒక్క అడుగు వెనక్కి వేస్తే మీరు లోయలో పడిపోవడం ఖాయం. అందుకే మిమ్మల్ని రక్షించడానికే నేనీ పనిచేశాను' అని చెప్పాడు పశువుల కాపరి.

రాజుగారు ఒకసారి వెనక్కి చూసి 'ఔను నిజమే' అని తన తప్పు తెలుసుకున్నాడు. ఆ పశువుల కాపరికి ధన్యవాదాలు తెలిపాడు. తనతో పాటు రాజధానికి తీసుకెళ్లి సన్మానించాడు. కొంత భూమిని, కొన్ని ఆవులను కానుకగా ఇచ్చి పంపాడు. ★

## మెదడుకు మేత

కాళ్లు లేవు గానీ నడుస్తుంది. కళ్లు లేవు గానీ ఏడుస్తుంది?

జవాబు : మేఘం

## మంచిమాట

విడవకుండా ప్రయత్నం చేసే వారిని చూసి ఓటమి కూడా భయపడుతుంది



# వారఫలాలు

16 - 22 జూన్ 2025



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఇతరుల నుంచి రావలసిన సొమ్ములు కూడా అందుతాయి. మీ విధానాలు, నడవడిక పట్ల కుటుంబసభ్యులు ఆకర్షితులవుతారు. వ్యాపారాలలో అనుకున్న లాభాలు. ఉద్యోగాలలో కోరుకున్న విధంగా మార్పులు జరుగుతాయి. కళాకారులకు మరింత ఆశాజనకంగా ఉంటుంది. పరిశోధకులు, వైద్యుల సేవలకు విస్తృత మవుతాయి. 20,21 తేదీల్లో దూరప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. కనకదుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

కుటుంబంలో ఆహ్లాదకరంగా ఉంటుంది. శుభకార్యాల నిర్వహణలో బిజీగా గడుపుతారు. వ్యాపారాలు కొత్త పెట్టుబడులు సమకూరి మరింతగా విస్తరిస్తారు. ఉద్యోగాలలో ఉన్నత హోదాలు రాగలవు. ఆశ్చర్యకరంగా కొన్ని సమస్యలు తీరతాయి. కళాకారులకు సన్మానయోగం. రచయితలు, వ్యవసాయదారులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. 16,17 తేదీల్లో అదనపు ఖర్చులు. సమస్యలు. ఆంజనేయ దండకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

విద్యార్థుల ప్రతిభా పాటవాలు గుర్తింపు లోకి వస్తాయి. చిన్ననాటి మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలలో లాభాలకు లోటు ఉండదు. అలాగే, పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో విధి నిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. మంచి గుర్తింపు పొందుతారు. కళాకారులకు విజయాలు వరిస్తాయి. రచయితలకు శుభవర్తమానాలు. 18,19 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. బంధువిరోధాలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

మీ నిర్ణయాలను గౌరవిస్తారు. ఆస్తుల పంపకాలు పూర్తి చేస్తారు. ఆరోగ్యం మరింత మెరుగుపడి ఊరట లభిస్తుంది. వ్యాపారాలలో అనుకున్న లాభాలు దక్కుతాయి. పెట్టుబడులకు లోటు ఉండదు. ఉద్యోగాలలో విధి నిర్వహణ ప్రశాంతంగా సాగుతుంది. కళాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. శాస్త్రవేత్తలు, క్రీడాకారులకు సంతోషకర సమాచారం. 20,21 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో సమస్యలు. నృసింహస్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

సంతానం, ఉద్యోగావకాశాలు సఫలమై ఉత్సాహంతో గడుపుతారు. వ్యాపారాలలో ఆశించిన లాభాలు. ఉద్యోగాలలో మీపై ఉంచిన బాధ్యతలు సమర్థ వంతంగా నిర్వహిస్తారు. ప్రత్యేక గుర్తింపు పొందు తారు. పారిశ్రామికవేత్తలకు వివాదాలు తీరతాయి. క్రీడాకారులు, వైద్యులకు మరింత ప్రోత్సాహం. 19,20 తేదీల్లో ధనవ్యయం. మనశ్శాంతి లోపిస్తుంది. విష్ణుధ్యానం చేయండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

రుణాలపై ఒత్తిడులు ఉండవచ్చు. . పెద్దల నుంచి స్థిరాస్తి పంపకాలు వాయిదా వేస్తారు. వ్యాపారాలు లాభనష్టాలు సమానంగా ఉంటాయి. ఉద్యోగాలు ఎంతటి బాధ్యత అప్పగించినా భయపడకుండా పూర్తి చేస్తారు. రాజకీయవేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. క్రీడాకారులు, రచయితల ఆశయాలు సిద్ధిస్తాయి 21,22తేదీల్లో వృథా ఖర్చులు. దూర ప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆరోగ్యం మరింత మెరుగుపడుతుంది. వ్యాపారాల విస్తరణలో అవాంతరాలు తొలగుతాయి. ఉద్యోగాలలో ఎటువంటి ఇబ్బంది ఎదురైనా పట్టుదలతో అధిగమిస్తారు. అదనపు విధులు మీదపడినా లెక్కచేయరు. రాజకీయవేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. వైద్యులు, వ్యవసాయదారులు మరింత ఉత్సాహంగా గడుపుతారు. 17,18 తేదీల్లో ధన వ్యయం. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

బంధువులతో వివాదాలు తీరతాయి. సంతాన విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగాలలో కోరుకున్న మార్పులు ఉండవచ్చు. ఉన్నతాధికారుల నుంచి సహాయం అందుతుంది. కళాకారులకు మరింత అనుకూల సమయం. క్రీడాకారులు, పరిశోధకులకు సంతోషకర సమాచారం. 20,21 తేదీల్లో మిత్రుల నుండి ఒత్తిడులు. శ్రమాధిక్యం. శివాష్టకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

చేపట్టిన కార్యక్రమాలు మందగమనంలో సాగుతాయి. కొత్త రుణాలు చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. బంధువుల రాక కొంత ఊరటనిస్తుంది. వ్యాపారాలు మొదట్లో కొంత లాభించినా అంతగా కలసిరావు. రాజకీయవేత్తలకు కొద్దిపాటి చికాకులు. రచయితలకు కొన్ని సమస్యలు ఎదురుకావచ్చు. 20,21తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆర్థిక ఇబ్బందులు చాలావరకూ తగ్గుతాయి. మీరంటే అందరూ గౌరవిస్తారు. వ్యాపారాలు లాభాలు తథ్యం. పెట్టుబడులకు లోటు లేకుండా ఉంటుంది. ఉద్యోగాలు కోరుకున్న పదోన్నతులు దక్కుతాయి. బ్యాధ్యతలు కొంత తగ్గే సూచనలు. పారిశ్రామిక వేత్తలకు నూతనోత్సాహం. రచయితలు, క్రీడా కారులకు శుభవార్తలు. 21,22తేదీల్లో మానసిక అశాంతి. ఆకస్మిక ప్రయాణాలు. కనకధారాస్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

కొన్ని రుగ్మతల నుంచి బయటపడి ఊపిరి పీల్చుకుంటారు. వ్యాపారాలు లాభాల దిశగా కొన సాగుతారు. ఉద్యోగాలలో సమస్యలు అధిగమించి ముందడుగు వేస్తారు. పారిశ్రామికవేత్తలకు మరింత అనుకూలత. క్రీడాకారులు, రచయితలు మరిన్ని అవకాశాలు పొందుతారు. 16,17 తేదీల్లో సన్నిహితులతో కలహాలు. బాధ్యతలు పెరుగుతాయి. గణపతిని పూజించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

సంతాన ఉద్యోగాలు కొలిక్కి వచ్చి ఊరట చెందుతారు. వ్యాపారాలలో క్రమేపీ లాభాలు అందుకుంటారు. కొత్త భాగస్వాములతో విస్తరణ కార్యక్రమాలు చేపడతారు. ఉద్యోగ విధి నిర్వహణలో చిక్కులు తొలగుతాయి. ఉన్నతాధికారుల నుంచి మంచి గుర్తింపు లభిస్తుంది. రాజకీయవేత్తలకు శుభవార్తలు. క్రీడాకారులు,వైద్యులకు మరింత సానుకూలత. 17,18 తేదీల్లో దూరప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

# పదరసం - 518

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | | 4 | ■ | 5 | | 6 | 7 |
| 8 | | | ■ | 9 | | | ■ | 10 | |
| | ■ | 11 | | | ■ | ■ | 12 | | ■ |
| 13 | 14 | ■ | ■ | ■ | 15 | | | | 16 |
| ■ | 17 | 18 | 19 | ■ | | ■ | | ■ | |
| 20 | | | | ■ | 21 | 22 | ■ | 23 | |
| | ■ | | ■ | 24 | ■ | 25 | 26 | ■ | |
| 27 | 28 | ■ | 29 | | ■ | 30 | | ■ | |
| ■ | 31 | | | ■ | 32 | ■ | 33 | 34 | ■ |
| 35 | | ■ | | ■ | 36 | | ■ | 37 | |

## ఆధారాలు

**అడ్డం**

1. వడుగు (5)
5. జానకి తండ్రి (4)
8. భద్రం, జాగ్రత (3)
9. ఉదయం చెల్లాచెదరు (3)
10. వర్తకం (2)
11. మరువం లాంటి సుగంధ పత్రం (3)
12. రుచులు ఎన్ని (2)
13. కలపను కోసే యంత్రం (2)
15. భర్త సోదరి (5)
17. జగత్తు... ప్రపంచం (3)
20 నాటి ఓరుగల్లు నేటి...(4)
21. ఆచూకీ అటు నుంచి (2)
23. ఏనుగు (2)
25. మామిడే.. మీవి కావు..(2)
27. అడవి...అగ్ని (2)
29. దక్షిణం వైపు (2)
30. మాగాణి (2)
31. రక్తం (3)
33. పుష్పం (2)
35. శ్మశానం (2)
36. భూమి... (2)
37. జంబుకం తడబడింది (2)

**నిలువు**

1. మేలు...సహాయం (4)
2. అవతారాలు ఎన్ని (2)
3. తక్షశిలతో పాటే అలనాటి విద్యాసంస్థ (3)
4. ఇంద్రుని ఉద్యానవనం (3)
5. గెలుపు...(2)
6. ధనాధిపతి (4)
7. రండి..గ్రాంథికంలో, కింద నుంచి (2)
12. ప్రమాదం....(3)
14. చిలకను బంధించేది (3)
15. పెరుగులో వేసిన గారె (3)
16. బంధుత్వాలు (5)
18. ఆకాశం (3)
19. కంటకం (2)
20. వస్త్రం (3)
22. ఈయన దశమ గ్రహమట (3)
24. రజతం (2)
26. అధికం..ఎటు చదివినా ఒకటే (3)
28. గత ఏడాది (3)
29. జింక..కోతి (3)
32. ఉదరం...నాభి (2)
34. నక్షత్రం (2)

## పదరసం - 517 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 సం | త | 2 కం | ■ | 3 క | 4 ప్రో | 5 తం | ■ | 6 ప్రో | 7 చ |
| జీ | ■ | 8 ద | 9 గా | ■ | 10 త | టా | 11 కం | ■ | ద |
| 12 వి | ధి | ■ | 13 యు | ము | న | ■ | 14 చ | ద | రం |
| ■ | ■ | 15 అ | త్రి | ■ | ■ | 16 నా | ర్ల | ■ | గం |
| 17 వి | 18 ప | ణి | ■ | 19 భా | ర | వి | ■ | 20 సె | ■ |
| 21 క | న్ను | ■ | 22 శృం | గం | ■ | కు | ■ | 23 పీ | 24 సా |
| ట | ■ | ■ | గా | ■ | 25 అ | డు | 26 సు | ■ | వి |
| 27 క | ని | 28 క | రం | ■ | టు | ■ | 29 ధ | 30 రి | త్రి |
| వి | ■ | ద | ■ | 31 శ | కు | ని | ■ | వా | ■ |
| ■ | 32 జ | నం | ■ | 33 ని | లు | ■ | 34 రు | జు | వు |




# ఎవరికి వారే యమునా తీరే!

**తెలుగు సినిమా రంగం ఇవాళ చాలా చిక్కుముడుల్లో ఇరుక్కుంది. సంక్రాంతి తర్వాత సాలిడ్ హిట్ మూవీ ఒక్కటి కూడా రాకపోవడం ఒక కారణమైతే... ఎదురైన సమస్యలను సామరస్య పూర్వకంగా, కలిసి మెలిసి పరిష్కరించుకోవాలనే ఆలోచన సినిమా పెద్దలలో లేకపోవడం మరో కారణం. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న గద్దర్ ఫిల్మ్ అవార్డుల పట్ల పైకి వెలిబుచ్చలేని అసంతృప్తితో కొందరు రగిలిపోతుంటే... పెద్ద సినిమాలు అనుకున్న సమయానికి విడుదల కాకపోవడం మరో సమస్యగా మారిపోయింది. ఏతావాతా ప్రతి విషయంలోనూ ఎవరికి వారే యయునా తీరు అనేలా వ్యవహారం సాగుతోంది.**

థియేటర్ల బంద్ చేస్తామనే మాట వినిపించినప్పుడు ఉలిక్కి పడిన నిర్మాతలు దాన్ని సెట్ చేయడానికి హడావిడిగా సమావేశమయ్యారు. కానీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేక పోయారు. థియేటర్ల మీదే ఆధారపడే పంపిణీదారులు కూడా సమావేశమయ్యారు. కానీ ఎగ్జిబిటర్ల సమస్యను ఓ కొలిక్కి తీసుకు రావడంలో ఏం చేయలేక పోయారు. దాంతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్... నిర్మాతలు, పంపిణీదారులు, ప్రదర్శనకారులతో మే 20న ఓ కమిటీని వేసింది. మూడు శాఖల నుండి పది మంది చొప్పున ఎంపిక చేసింది.

ఇదిలా ఉంటే.. ది తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ముసలం పుట్టింది. ఇటీవల ఈ ఛాంబర్ అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన ప్రముఖ నిర్మాత, పంపిణీదారుడు, ఎగ్జిబిటర్ సునీల్ నారంగ్ కొత్త కమిటీ వివరాలు చెప్పడానికి ప్రెస్ మీట్ పెట్టారు. అందరినీ కలుపుకొంటూ సినిమా రంగ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే సమావేశంలవవె పాల్గొన్న కార్యదర్శి శ్రీధర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. ఆయన అగ్ర కథానాయకులను విమర్శించారు. దానిపై సునీల్ నారంగ్ మౌనంగా ఉండటంతో అది ఆయన మెడకు చుట్టుకొని, తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. మూడోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయన రాజీనామా మాటను కమిటీ ఒప్పుకోకపోవచ్చు. కాస్తంత వేడి చల్లారిన తర్వాత తిరిగి సునీల్ నారంగ్ మనసు మార్చుకుని విధులను నిర్వర్తించవచ్చు.

నిజానికి పెద్ద హీరోల సినిమాలు ఎక్కువ విడుదలై, మంచి ఓపెనింగ్స్ ఉన్నప్పుడే సినిమా రంగం కళకళలాడుతుంది. లేదా చిన్న సినిమాలలో అర్థవంతమైనవి వచ్చి, అవి విజయం సాధిస్తే కొంత వరకూ ఫర్వాలేదు. కానీ గడిచిన ఐదు నెలల్లో లాభాలు తెచ్చిపెట్టిన సినిమాలు కేవలం మూడే అని శ్రీధర్ తేల్చి చెప్పేశారు. వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం', నార్నె నితిన్ 'మ్యాడ్ స్క్వేర్', ప్రియదర్శి 'కోర్టు' సినిమాలు తప్పితే మిగిలినవేవీ లాభాలు తెచ్చిపెట్టలేదని చెప్పారు. అగ్ర కథానాయకులు రూ. కోట్లు పారితోషికం తీసుకుంటున్నారని, కానీ వారి సినిమాలకు ఆ స్థాయిలో ఓపెనింగ్స్ కానీ లాభాలు కానీ రావడం లేదని తెలిపారు. వారి పారితోషికాలను అదుపు చేయాల్సిన అవసరం ఉందనీ అన్నారు. తారల పారితోషికాలకు ఓ పద్ధతి అంటూ లేదు. హీరోలు సక్సెస్‌లో ఉంటే ఒక పారితోషికం, ఫ్లాప్స్‌లో ఉంటే మరో రకంగా పారితోషికం ముడుతుంది. అది డిమాండ్ అండ్ సప్లయ్‌పై ఆధారపడి ఉంటుంది. ఒక్కోసారి భారీ మొత్తం పారితోషికం తీసుకున్నా... సినిమా ఫ్లాప్ అయినప్పుడు హీరోలు కొంత మొత్తాన్ని తిరిగి ఇస్తుంటారు. ఈ మధ్య వచ్చిన 'జాక్' సినిమా ఫ్లాప్ అయినప్పుడు సిద్ధు జొన్నలగడ్డ అదే పని చేశాడు. సో... హీరోలు ఎక్కువ సినిమాలు చేయాలి, తక్కువ పారితోషికం తీసుకోవాలి అనేవి ఒకరు హుకుం వల్ల జరిగే పనులు కావు. అలానే సినిమాలను కేవలం పర్సెంటేజ్ ప్రకారమే ఆడతామని సింగిల్ థియేటర్ల ఓనర్లు డిమాండ్ చేయడం కూడా జరిగే పనిలా కనిపించడం లేదు. ఎందుకంటే అసలు పెద్ద సినిమాలే ఎక్కువ రావడం లేదు. చిన్న సినిమాలు వచ్చినా వాటికి కలెక్షన్స్ ఉండటం లేదు. గడిచిన ఆరు నెలల్లో ఆడినవే మూడు సినిమాలని ఒక పక్క చెబుతూ, పర్సంటేజ్‌కు సినిమాలను ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్స్ మొండికేస్తే... వారి పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. సినిమా థియేటర్లను నిదానంగా మూసివేయాల్సిన పరిస్థితి వస్తుంది. కాబట్టి పర్సంటేజ్‌లో సినిమాలను ప్రదర్శిస్తే ఆడతాయని అనుకోవడానికి లేదు. నిజానికి మంచి సినిమాలు వస్తే జనాలు చూస్తారు. అలాంటి మంచి సినిమాలను తీయాల్సిన పని దర్శకులు, నిర్మాతలది.


సునీల్ నారంగ్

### ఓటీటీ చేతుల్లోకి సినిమాలు!

ఈ సమస్యలు ఇలా ఉంటే... ఇప్పుడు ఓటీటీ సంస్థలే స్టార్ హీరోల చిత్రాల విడుదల తేదీని నియంత్రిస్తున్నాయని సునీల్ నారంగ్ వాపోతున్నారు. తమ చిత్రాలను ఎప్పుడు విడుదల చేయాలో వాళ్లే నిర్ణయిస్తున్నారని అన్నారు. గతంలో థియేట్రికల్, శాటిలైట్ ఆదాయాలను దృష్టిలో పెట్టుకుని సినిమాలు నిర్మించే వాళ్లమని, కానీ ఇప్పుడు ఓటీటీ హక్కుల కోసం సినిమా నిర్మించాల్సి వస్తోందని తెలిపారు. ఓటీటీ సంస్థలు చెప్పిన తేదీనే తమ చిత్రాలను రిలీజ్ చేయాల్సి వస్తోందని, రిలీజ్ ను వాయిదా వేస్తామంటే ఎగ్రిమెంట్‌లో కోత పెడుతున్నారని అన్నారు. సినిమాల కారణంగా ఓటీటీ, బుక్ మై షో, క్యూబ్ సంస్థలు లాభాలు గడిస్తున్నాయి కానీ ప్రొడ్యూసర్లు, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ ఇబ్బందుల్లోనే ఉన్నారని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారాన్ని లోతుగా గమనిస్తే... మరి కొంత కాలం పాటు ఈ చిక్కుముడులు వీడవని అనిపిస్తోంది.

**– అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.300/-




వెల : ₹.100/-




వెల : ₹.400/-




వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.499/-




వెల : ₹.200/-




వెల : ₹.120/-



వెల : ₹.300/-




వెల : ₹.525/-




వెల : ₹.499/-




వెల: PB ₹.549/-




వెల :₹.450/-




వెల : ₹.399/-




వెల : ₹.125/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 34




మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోనంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.

www.youtube.com/@Jagrititv

చెప్పండి మెచ్చండి పంచండి